RNI.No.TELTEL/2013/52694

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam

# ఉదయం

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal

సంపుటి : 12 ‖ సంచిక : 188 ‖ ఆదిలాబాద్ ‖ మంగళవారం, డిసెంబర్ 17, 2024 ‖ VOODAYAM Telugu Daily ‖ వెల : రూ. 3.00 ‖ పేజీలు : 12

### సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కరీంనగర్, డిసెంబర్ 16(ఎ.ఎం.ఎస్): సమగ్ర శిక్ష ఉద్యోగులను తక్షణమే రెగ్యులర్ చేయాలని సిపిఐ జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. రేవంత్ రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. ఆయన వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ఉన్నారు. అలాగే ఉద్యోగులకు పలువురు మద్దతు తెలిపారు. ట్ చేయాలని, వారికి మినిమం బేసిక్ ఇవ్వాలని, వారికి ఇన్సూరెన్స్ హెల్త్ సౌకర్యాలు కల్పించాలని, పార్ట్ టైం ఉద్యోగులకు 12 నెల జీతం ఇవ్వాలన్నారు.

### విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ ల పంపిణీ

హుజూరాబాద్, డిసెంబర్ 16(ఎ.ఎం.ఎన్): హుజురాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు సోమవారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లను అందించారు. మహదేవ్పూర్ లోని కాళేశ్వరం జిల్లా పరిషత్ హై స్కూల్లో 160, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో 72, జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ మాదాపూర్ లో 74, జడ్పీహెచ్ఎస్ బొమ్మపూర్ లో 12, అంబటిపల్లిలో 17 మొత్తం 336 పరీక్ష ప్యాడ్ లను విద్యార్థులకు ట్రస్టు నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా అందించారు.

# మీరొక్క సంతకం పెడితే బిల్లులన్నీ క్లియర్ అయ్యేవేగా..

- మాకు వారసత్వంగా అప్పులు మిగిల్చారు
- బీఆర్ ఎస్ అంటే బకాయిల రాష్ట్ర సమితి
- పంచాయతీలకు నిధులన్నీ విడుదల చేస్తాం
- శాసనసభలో మంత్రి సీతక్క
- మీ సమాధానంతో సంతృప్తి చెందలేం... హరీశ్‌రావు
- సభ నుంచి బీఆర్ ఎస్ వాకౌట్
- పంచాయతీలు, పట్టణాల్లోని అభివృద్ధిపై అసెంబ్లీలో వాడి వేడి చర్చ





హైదరాబాద్ : తాను పుట్టిన మలుగు ప్రాంతంతోపాటు రాష్ట్రంలోని గిరిజన గూడేలు, ఆదివాసీ ఏరియాలు, తండాల్లో పరిస్థితులు ఎలా ఉంటాయో తనకు తెలుసునని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ్య (సీతక్క) అన్నారు. మానవ వికాసానికి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు రహదారులే జీవన రేఖలని ఆమె వ్యాఖ్యానించారు. ఆరు రోజుల విరామానంతరం రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యాయి. సభ ఆరంభం కాగానే సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీలు, తండాల్లో మౌలిక వసతులపై కాంగ్రెస్ సభ్యులు చిక్కుడు వంశీకృష్ణ, మల్ రెడ్డి రంగారెడ్డి తదితరులు పలు అంశాలను లేవనెత్తారు. వంశీకృష్ణ మాట్లాడుతూ...గత బీఆర్ ఎస్ ప్రభుత్వం తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చినప్పటికీ, తాగునీరు, రోడ్లు, విద్యుత్ తదితర సౌకర్యాలను కల్పించలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా తండాల్లో బీటీ రోడ్లు, అది సాధ్యపడకపోతే కనీసం మెటల్ రోడ్లయినా వేయాలని ఆయన కోరారు. ఇంటర్ స్టేట్ కనెక్టింగ్ బ్రిడ్జిని కృష్ణా నదిపై నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. శ్రీశైలం చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేందుకు వీలుగా ఎలివేటెడ్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. పదర మండల కేంద్రం నుంచి మద్దిమడుగు వరకూ రెండు లైన్ల రహదారిని నిర్మించాలని సీఎంను కోరారు. అక్కడ సింగిల్ లైన్ రోడ్డు ఉండటం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వం పంచాయతీలను రావాల్సిన నిధులను కూడా వాడుకుని, సర్పంచుల హక్కులను కూడా కాలరాసిందని ఆక్షేపించారు. గత పదేండ్లుగా పంచాయతీల్లో కనీసం విద్యుత్ బల్బులు కొనేందుకు కూడా నిధుల్లేని దుస్థితి నెలకొందని వాపోయారు. ఈ నేపథ్యంలో పంచాయతీల నిధులను వాటికే కేటాయించాలని, ఆ మేరకు బడ్జెట్‌ను విడుదల చేయాలని కోరారు. సభ్యుల ప్రశ్నలకు మంత్రి సీతక్క సమాధానమిస్తూ... రోడ్లు లేకపోతే అభివృద్ధి కుంటుపడుతుందని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాబోయే నాలుగేండ్లలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రూ. 12 వేల కోట్లతో 17 వేల కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించేందుకు నిర్ణయించారని వెల్లడించారు. ఈ యేడాది ఇప్పటికే సీఆర్ ఆర్ కింద 2,311 కోట్లను మంజూరు చేసి, 2,400 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలిచామని తెలిపారు. రాబోయే రోజుల్లో మిగిలిన రూ.10 వేల కోట్లతో దాదాపు 15 వేల కిలోమీటర్ల రహదారుల నిర్మాణాలను పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఇవిగాక మరో 1,200 కిలోమీటర్ల మేర కొత్త రోడ్లను నిర్మించేందుకు ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. త్వరలోనే అన్ని పంచాయతీలు, తండాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లను నిర్మిస్తామని హామీనిచ్చారు. వీటికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని చెప్పారు.. సీసీ రోడ్ల కోసం గత మార్చిలో రూ.600 కోట్లను, గత నెల్లో రూ.324 కోట్లను కూడా విడుదల చేశామని వివరించారు. ఎమ్.ఆర్.ఆర్. కింద రూ.1,150 కోట్లను, వర్షాల కోసం దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు రూ.50 కోట్లను విడుదల చేశామని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. పంచాయతీలకు ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.691 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని ఆమె మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పంచాయతీలు, పట్టణాల్లో అభివృద్ధికి సంబంధించి ప్రతిపక్ష బీఆర్ ఎస్ సభ్యుడు తన్నీరు హరీశ్‌రావు మాట్లాడుతూ... తమ ప్రభుత్వ హయాంలో పదేండ్లలో పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా అటు పంచాయతీలను, ఇటు మున్సిపాల్టీలను అద్భుతంగా తీర్చిదిద్దామని తెలిపారు. కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీలకు ఇవ్వాల్సిన రూ.691 కోట్లను పెండింగ్‌లో ఉంచి, వాటి గురించి ప్రశ్నించిన సర్పంచులను అరెస్టు చేయిస్తోందని వాపోయారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కింద ఏడాది కాలంగా ఒక్క రూపాయి విడుదల చేయకపోవటంతో నేడు పల్లెల్లో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఈజీఎస్, 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా ప్రభుత్వం దారి మళ్లించటం శోచనీయమన్నారు. జీపీ జనరల్ ఫండ్ నిధులను ఖర్చు చేసేందుకు కూడా ఆర్థిక శాఖ అనుమతులివ్వటం లేదని తెలిపారు. దీంతో చెక్కులు పాస్ కావటం లేదనీ, ఫలితంగా సర్పంచులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత నవంబరు నెలలో బడా బడా కాంట్రాక్టర్లకు రూ.1,200 కోట్లకు పైగా బిల్లులను ప్రభుత్వం విడుదల చేసిందని హరీశ్‌రావు ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాంటప్పుడు చిన్న చిన్న కాంట్రాక్టర్లు, సర్పంచులకు ఇవ్వటానికి డబ్బులెందుకు లేవని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. సర్పంచులు అప్పులు చేసి, బంగారం తనఖా పెట్టి డబ్బులు తీసుకొచ్చి పంచాయతీల్లో పనులు చేయించారనీ, వారిని ఇబ్బందులకు గురి చేసి, ఆత్మహత్యల వైపు నెట్టటం సరికాదని అన్నారు. చివరకు మన పల్లెల్లో పరిస్థితి ఎలా ఉందంటే.. అమెరికా లాంటి దేశాలు, తెలంగాణకు వెళితే చికున్ గున్యా వస్తుందంటూ హెచ్చరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మన రాష్ట్రానికి అవమానకరమని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలన ఈ రకంగా ఉందంటూ ఎద్దేవా చేశారు. గ్రామ పంచాయతీల్లోని సిబ్బందికి సైతం మూడు నాలుగు నెలల నుంచి వేతనాలు ఇవ్వటం లేదని విమర్శించారు. పెండింగ్లో ఉన్న బిల్లులు, జీతాలను ఎప్పటిలోగా చెల్లిస్తారో చెప్పాలంటూ ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

హరీశ్‌రావు లేవనెత్తిన అంశాలకు మంత్రి సీతక్క సమాధానమిస్తూ... గత బీఆర్ ఎస్ ప్రభుత్వం తన వారసత్వంగా పెండింగ్ బిల్లుల భారాన్ని తమ నెత్తిపై మోపి వెళ్లిపోయిందని ఎద్దేవా చేశారు. కేవలం గతేడాది నుంచే ఆయా బిల్లులు పెండింగ్‌లో లేవనీ, 2014 నుంచి అంటే బీఆర్ ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి పెండింగ్లో ఉన్నాయని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో ఆర్థికశాఖ మంత్రిగా పని చేసిన హరీశ్‌రావు ఒక్క సంతకం చేస్తే సరిపోయేదీ, పెండింగ్ బిల్లులకు సంబంధించిన నిధులన్నీ విడుదలయ్యేవని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి ఇప్పటిదాకా ఉపాధి హామీ పనుల కింద రూ.450 కోట్లను విడుదల చేశామని అన్నారు. పంచాయతీల్లో పనుల కోసం మరో రూ.710 కోట్లను విడుదల చేశామని ఆమె తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వే ను చేపట్టిన ప్రభుత్వం, ఆ సర్వే ఆధారంగా రిజర్వేషన్లను ఖరారు చేసి, ఆ తర్వాత పంచాయతీలకు ఎన్నికలను నిర్వహిస్తుందని వెల్లడించారు. ఎన్నికలు జరక్కపోవటం వల్లే పంచాయతీలకు నిధులను విడుదల చేయలేకపోతున్నామని స్పష్టం చేశారు. మన వూరు, మన బడి కార్యక్రమం కింద గత ప్రభుత్వం రూ.1,100 కోట్ల పనులను చేపడితే, అందులో రూ.800 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో బడుల్లో అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ వెంటనే విడుదల చేయాలంటూ ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

అనంతరం స్పీకర్ అనుమతితో హరీశ్‌రావు మాట్లాడుతూ... పంచాయతీరాజ్ శాఖ మంత్రి చెప్పిన సమాధానంతో తాము సంతృప్తి చెందటం లేదని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ తీరుకు నిరసనగా తమ పార్టీ తరపున సభ నుంచి వాకౌట్ చేస్తున్నామని ప్రకటించారు. ఈ దశలో జోక్యం చేసుకున్న సభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు... ప్రధాన ప్రతిపక్ష సభ్యుల తీరుపట్ల అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతీనెలా పంచాయతీలకు నిధులు విడుదల చేస్తే... రూ.610 కోట్ల మేర బిల్లులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయంటూ ప్రశ్నించారు. అనంతరం పోలేపల్లి సెజ్‌లో పలు కంపెనీలు వెదజల్లుతున్న కాలుష్యం గురించి కాంగ్రెస్ సభ్యుడు అనిరుధ్ రెడ్డి పలు ప్రశ్నలు వేశారు. అరబిందో, ఏపీ ఫార్మా తదితర కంపెనీల నుంచి వెలువడుతున్న కాలుష్యం వల్ల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ప్రశ్నలకు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమాధానాలిచ్చారు.

ప్రశ్నోత్తరాల అనంతరం స్పీకర్ సంతాప తీర్మానాలను ప్రతిపాదించారు. ఇల్లందు మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య, మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే జ్యోతి దేవి, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే సోలిపేట రామచంద్రారెడ్డి మరణం పట్ల శాసనసభ తీవ్ర సంతాపాన్ని తెలుపుతోందని ఆయన పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఆయన తేనీటి విరామాన్ని ప్రకటించారు.



### సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు
## సీఎం దృష్టికి తీసుకెళ్తా

హైదరాబాద్ : రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి

ఏ చిన్నారెడ్డితో భేటీ అయిన సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న 19,300 మంది సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి అన్నారు. సోమవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో చిన్నారెడ్డితో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ప్రతినిధులు భేటీ అయ్యారు. సమస్యల పరిష్కారం కోసం గత వారం రోజుల నుంచి సమ్మె చేస్తున్న తమకు అనుకూలంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని వారు చిన్నారెడ్డి ని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు ఉద్యోగ భద్రతతో కూడిన పే స్కేల్ ఇవ్వాలని, ఉద్యోగుల రీ ఎంగేజ్ విధానాన్ని తీసివేయాలని,

ప్రతి ఉద్యోగికి బీమా సౌకర్యం కల్పించాలని పదవీ విరమణ చేసిన వారికి బెనిఫిట్స్ ఇవ్వాలని వారు చిన్నారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ భేటీలో మాజీ ఎమ్మెల్సీ బి మోహన్ రెడ్డి, పిఆర్టియు రాష్ట్ర మాజీ అధ్యక్షులు పి వెంకట్ రెడ్డి, పిఆర్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి, సహ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

# నోటిఫికేషన్ వేయడం అంటే ఉద్యోగం ఇవ్వడం కాదని గత పాలకుల విధానం

## జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తాం



శాసనమండలిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్ : నోటిఫికేషన్ వేయడం అంటే ఉద్యోగం ఇవ్వడం కాదని గత పాలకుల విధానమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఉద్యోగాల భర్తీపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 55,172 ఉద్యోగాలు భర్తీ చేశామని ఇందులో 54,573 మందికి నియామక ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు. మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ను ప్రక్షాళన చేసి జాబ్ క్యాలెండర్ విడుదల చేసినట్టు తెలిపారు. గత పది సంవత్సరాలపాటు ఉద్యోగ నియామకాలు లేక యువకులు అల్లాడిపోయారని.. ఉద్యోగాల కోసం యువత ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నారని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం తెచ్చుకున్నదే ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువత ఉద్యోగాలు పొంది జీవితంలో స్థిరపడాలనేదే మా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. మా ప్రభుత్వం ఏర్పడిన కొద్ది సమయంలోనే 55 నుంచి 56 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. గత పాలకులు పదేళ్ల కాలంలో గ్రూప్ వన్ పరీక్ష ఒక్కసారి కూడా నిర్వహించలేకపోయారు, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయలేదు అన్నారు. మేము అధికారంలోకి రాగానే పాత ఖాళీలు కొత్తవి కలిపి గ్రూప్ వన్ నోటిఫికేషన్ విడుదల చేశాము. ఈ పరీక్షలను ఆపాలని కావాలనే కొద్దిమంది కోర్టుకు వెళ్లారు కానీ మేము ఇచ్చిన మాట ప్రకారం 563 పోస్టులకు పరీక్ష నిర్వహించాము, 11062 ఖాళీలతో డీఎస్సీ నిర్వహించి 10, 600 మందికి అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇచ్చామని తెలిపారు. ఉద్యోగ నియామక పరీక్షలన్నీ పారదర్శకంగా, ప్రశ్నాపత్రం లీక్ వంటివి లేకుండా చూసుకుంటూ ఖాళీలను భర్తీ చేసుకుంటూ పోతున్నామని వివరించారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలు జాబ్ క్యాలెండర్ ప్రకారం దశలవారీగా భర్తీ చేసుకుంటూ ముందుకు పోతాం అన్నారు. ఉర్దూ మీడియం లో బ్యాక్లాగ్ పోస్టుల భర్తీకి డీ రిజర్వేషన్ విధానం పరిశీలించాలని కొందరు సభ్యులు అడిగారు కానీ అందుకు అవకాశం లేదని తెలిపారు.

# మంచు కుటుంబంపై మూడు ఎఫ్ఐఆర్ లు నమోదు

## రాచకొండ సీపీ సుధీర్ బాబు

హైదరాబాద్ డిసెంబర్ 16 : మంచు కుటుంబంపై మూడు ఎఫ్ఐఆర్ లు నమోదు చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు చెప్పారు. ఇటీవల మంచు మోహన్ బాబు, ఆయన చిన్న కొడుకు మంచు మనోజ్ ల మధ్య వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. వీరిద్దరూ ఒకరిపై ఒకరు తమ ప్రాణాలకు ప్రమాదం ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో మంచు ఫ్యామిలీ రచ్చ తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ అయ్యింది.తాజాగా మంచు ఫ్యామిలీ వివాదంపై స్పందించిన రాచకొండ సీపీ.. మంచు కుటుంబంపై మూడు కేసులు నమోదయ్యాయని వాటిపై దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. లీగల్‌గా ఏది చేయాలో అది చేస్తామన్నారు. మోహన్‌బాబుకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామని.. అయితే, ఈ నెల 24 వరకు మోహన్‌బాబు టైం అడిగారని తెలిపారు. కోర్టు టైం ఇచ్చింది కాబట్టి అరెస్ట్ చేయలేదని రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు.



లగచర్ల రైతులకు బేడీలు వేయడం పైన శాసనసభ లోపల బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల ఆందోళన రైతులకు బేడీలు వేసిన ఫోటోలతో కూడిన ప్లకార్డులతో నినాదాలు ఇది దొంగల రాజ్యం దోపిడి రాజ్యం అంటూ నినాదాలు రైతులకు బేడీల సిగ్గు సిగ్గు అంటూ నినాదాలు



# సంక్రాంతి నుంచి కొత్త రేషన్ కార్డులు

హైదరాబాద్ డిసెంబర్ 16 : కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారకి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. సోమవారం అసెంబ్లీలో మాట్లాడుతూ.. సంక్రాంతి నుంచి కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని ప్రకటించారు. రేషన్ కార్డుల జారీపై మంత్రివర్గ ఉప సంఘం వేశామని తెలిపారు. దాదాపు 36 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు ఆయన చెప్పారు. కొత్త రేషన్‌కార్డులకు దాదాపు రూ.956 కోట్ల వ్యయం అంచనా వేసినట్లు తెలిపారు. అలాగే.. ప్రస్తుతం రేషన్ కార్డుదారులకు ఇస్తున్న 6 కిలోలతో పాటు సన్నబియ్యం కూడా ఇస్తామని స్పష్టం చేశారు.

హైదరాబాద్ డిసెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )బీ: కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారకి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. సోమవారం అసెంబ్లీలో మాట్లాడుతూ.. సంక్రాంతి నుంచి కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని ప్రకటించారు. రేషన్ కార్డుల జారీపై మంత్రివర్గ ఉప సంఘం వేశామని తెలిపారు. దాదాపు 36 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు ఆయన చెప్పారు. కొత్త రేషన్‌కార్డులకు దాదాపు రూ.956 కోట్ల వ్యయం అంచనా వేసినట్లు తెలిపారు. అలాగే.. ప్రస్తుతం రేషన్ కార్డుదారులకు ఇస్తున్న 6 కిలోలతో పాటు సన్నబియ్యం కూడా ఇస్తామని స్పష్టం చేశారు.

# సంపాదకీయం

## కేరళలో 'బాల' వికాసం

కేరళలో 'బాల' వికాసంపాఠశాలలంటే? ఏడంతస్తుల భవనాలు, ప్రహరీ గోడలు, ఖరీదైన స్కూల్ యూనిఫామ్స్ కాదు. మానవ జీవితాలను తీర్చిదిద్ది, జాతి భవిష్యత్తును రూపొందించే జీవన నిలయాలు, చైతన్య కేంద్రాలు. మానవీయ విలు వల్ని పాదుకొలిపే ఆధునిక దేవాలయాలు. అలాంటి విద్యా విధానం కేరళ రాష్ట్రంలో ప్రత్యక్షంగా అధ్యయనం చేశాం. అక్టోబర్ 30,31న కోజికోడ్‌లో కేరళ బాల సంఘం ఏడో రాష్ట్ర మహాసభల సందర్భంగా సౌహార్ధ సందేశకులుగా వెళ్లాము. అక్కడ ప్రపంచ మంతా ఒకే కుటుంబమనే విశ్వజనీన భావనకు పట్టం కడతారు. చదువులే కాదు, ఆటాపాటలతో పాటు జీవిత పాఠాలను నేర్పుతారు. తరగతి గదుల్లోనే నిజమైన పౌరులను తీర్చిదిద్దుతారు. మనిషి తత్వం, ప్రేమతత్వం, సోదరత్వం తోటివారికి తోడ్పడాలన్న ధృఢసంకల్పంతో ఏర్పడినదే కేరళ బాలసంఘం. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, జాతీయోద్యమ స్ఫూర్తితో ఉచిత ఆహారం, బస్సు సౌకర్యం, కుల, మత, ప్రాంత, భాష లింగ వివక్ష లేని ప్రపంచ శాంతి, ప్రకృతి పర్యావరణ ఎజెండాగా, ఆకలి, అనారోగ్యం, పేదరికం, నిరుద్యోగం, సంపూర్ణ అక్షరాస్యత దిశగా.. బాలల హక్కుల్ని వివరిస్తూ అడుగులు వేసింది. పల్లెల్లో ఉన్న ప్రతి పిల్లవాడికి భరోసా అయ్యింది. బాల సంఘం కేరళ మొత్తం విస్తరించింది. 14 జిల్లాలలో 210 ఏరియాలలో 2,279 గ్రామాలలో 31,258 యూనిట్స్‌లో 13 లక్షల బాలలతో విస్తరించింది. హారిపోటర్ నుండి అంతరిక్షం వరకు, గౌతమ బుద్ధుని నుంచి మహాత్మాగాంధీ వరకు, మాంటిస్సోరి నుండి గిజుబాయి వరకు ఎందరో మహానీయుల బాటలో బాల బాలికలను తీర్చిదిద్దుతున్నారు. అక్కడ పెద్దలు పిల్లలతో స్నేహం చేస్తారు. పిల్లలు చెప్పింది శ్రద్ధగా వింటారు. పిల్లల అభిప్రాయాలను తల్లిదండ్రులు పెద్దలు ఆచరించే సాంప్రదాయం వారి సంస్కృతిలోనే ఉంది. ఆంగ్లభాషతో పాటు అన్య భాషలు ఎన్ని నేర్చినా.. పాలనలో బోధనలో మాతృభాషపై మమకారం తగ్గలేదు. కేరళ స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ 2013లోనే ఉనికిలోకి వచ్చింది. బాల కార్మిక రహిత రాష్ట్రంగా బాల కార్మికుల అక్రమ రవాణాపై పోరాడేందుకు బాలల సంరక్షణ యూనిట్ ఏర్పడి, అక్రమ రవాణా, పిల్లలు యాచకత్వం, అర్ధాంతరంగా చదువు ఆపేసిన విద్యార్థుల సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరిం చింది. డ్రాపౌట్స్ లేకుండా చూసే బాధ్యత చైల్డ్ హెల్ప్ డెస్క్, రెస్క్యూ ఫోర్స్ సహాయం సమన్వయంతో అధికారులు 24 గంటలు షిఫ్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. బాల కార్మికుల జాడ కోసం వారానికి మూడు రోజులు తనిఖీలు నిర్వహిస్తారు. బాల్యం ఒక హక్కు, పిల్లల చదువుల ప్రాధాన్యతపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించి "బాల్యం బడిలోనే" ఉండాలి. కేరళ సమాజాన్ని ఒప్పించి తీర్మానం చేశారు. పాఠశాల మాత్రమే పిల్లలను పట్టించుకునే ఏకైక సంస్థగా గుర్తించింది. పిల్లల సర్వతోముఖా వికాసానికి తగినట్టుగా పాఠశాలలను అభివృద్ధి చేసింది. అంతర్జాతీయ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. చదువుతోపాటు ఆటాపాటలు ఉంటాయి. ఆట స్థలాలు లేని స్కూల్స్‌కి అనుమతులుండవు. ప్రతి పాఠశాలలో పిఈటి, డ్రామా, స్క్రిప్ట్, డాన్స్ టీచర్ తప్పకుండా ఉండాలి. స్మార్ట్‌రూమ్స్ ఆధునిక విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు శిక్షణా తరగతులు ప్రణాళిక ప్రతి బిడ్డకు ఉపయోగపడాలి. సమాజం భాగస్వామ్యం కాకుండా కేవలం ప్రభుత్వ కృషి ఫలితాలివ్వదు. అందుకే అన్ని రంగాల్లో ప్రజల భాగస్వామ్యంతోనే ప్రణాళికలు అమలు జరుగుతాయి. పిల్లల మనోధైర్యానికి మార్షల్ ఆర్ట్స్ ప్రాచీన నృత్యాలు, అర్థం కాని పాఠ్యాంశాలను కళారూపాల ద్వారా అర్థం చేయిస్తారు. ఆటాపాటలు నిత్యజీవితంలో భాగమే. 'సమగ్ర' అనే పోర్టల్ ద్వారా కేరళ విద్యాశాఖ వెయ్యికి పైగా ప్రభుత్వ పాఠశాలలను డిజిటల్ పాఠశాలలుగా మార్చి 45 వేల స్మార్ట్ రూమ్స్‌ను నిర్మించారు. లిటిల్ కైట్స్, ఐటి క్లబ్బులను, యూనిమేషన్స్, షార్ట్ ఫిలిమ్స్, సైబర్ భద్రత వంటి అంశాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి విద్యార్థికి మధ్యాహ్నం భోజనం గుడ్డు, వారానికి ఒకరోజు చికెన్ మూడువేల మంది పిల్లలు ఒకేసారి కలిసి భోజనం చేసే డైనింగ్ హాల్, పేరెంట్స్ విజిటింగ్ హాల్, అతిపెద్ద కిచెన్, ఆధునిక సంగీత వాయి ద్యాల శిక్షణలు, ప్రతి స్కూల్లో ఇండోర్ స్టేడియం, విద్య ఒకటే కాదు, బహుళ వైవిధ్య శిక్షణలతో, ఏ విద్యార్థికి ఏ రంగంలో ఆసక్తి ఉంటే? ఆ రంగంలో తమ ప్రతిభాపాటవాలు, ఉపాధి అవకాశాలు ఒక్కమాటలో చెప్పాలంటే? ఒక నిరుపేద విద్యార్థికి అంతర్జాతీయ స్థాయి విద్య ఉచితంగా అందుతుంది."వేనల్‌తుంబికల్" (వీధి నాటకాలు) ప్రతి సంవత్సరం ఏప్రిల్, మే నెలలో 210 బృందాలు నాలుగువేల మంది బాల కళాకారులు బాలల సామాజిక సమస్యలపై లక్షలాది మందితో ప్రదర్శనలిచ్చి పెద్దలకు సైతం చైతన్యం కల్పిస్తారు. ఆటాపాటల్లో సత్తా చాటుతున్న వారిని చిన్న వయస్సులోనే చేటరదీసి ప్రోత్సహిస్తున్నారు. శిక్షణలిచ్చి విశ్వ క్రీడల్లో విజేతలుగా నిలబెడుతున్నారు. వేసవి సెలవుల్లో సమ్మర్ క్యాంప్‌లు, శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించే లక్ష్యంతో పనిచేస్తున్నారు. మలయాళంలో బాల సాహిత్యా అకాడమీ ఏర్పడి, రచనలు, ముద్రణలు అక్కడి నుంచి వెలువడుతాయి. పుస్తక పఠనం, ప్రతి ఇంట్లో లైబ్రరీ, క్యాంపెయిన్ నిర్వహించి పఠనాసక్తిని పెంచుతారు. బాలల కార్యక్రమంలో కుటుంబాలు, పెద్దలు పాల్గొంటారు. రాజ్యాంగ పీఠికను చదివించడం బాలల అసెంబ్లీ, పార్లమెంటు కార్యక్రమాలు, లౌకిక, మానవత్వ, సమతా మమతల పండుగలు, వన భోజనాలు నిర్వహిస్తారు. సూర్య, చంద్ర గ్రహణాలు మూఢనమ్మకాలను సవాల్ చేస్తూ.. పదివేల మంది పిల్లలు రోడ్లు మీదికొచ్చి గ్రహణాన్ని వీక్షించారు. సైన్స్ వండర్ షోలతో కొత్త విషయాల్ని నేర్పిస్తారు. ఈ ప్రపంచం పిల్లలదే, ఎదగడానికి ఎల్లలు లేవు. విజ్ఞాన ఆధారిత సమాజ నిర్మాణంలో కేరళ ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేస్తున్నది.

# మరుపు రాని దినం




2013 డిసెంబర్ 17... తెలంగాణ రాష్ట్ర ముసాయిదా బిల్లు ప్రవేశ పెట్టిన దినం

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ఉద్దేశించి చారిత్రిక సంఘటనలలో 2013 డిసెంబర్ 17కూడా ఒక మరుపు రాని దినం. రాష్ట్ర విభజన, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఆంధ్ర ప్రదేశ్ పునర్ వ్యవస్తీకరణ బిల్లు - 2013 ముసాయిదాను రాష్ట్ర ఉభయ సభలు... శాసనసభ, శాసనమండలి లోనూ 2013 డిసెంబర్ 17న ప్రవేశపెట్టారు. 65 పుటలు, 13 షెడ్యూళ్ళు ఉన్న సదరు బిల్లును తెలుగు, ఉర్దూ భాషల్లో స్వేచ్ఛానువాదం చేసి, ప్రతులను సభ్యులకు పంచిపెట్టారు. అలాగే శాసనసభ వెబ్ సైట్ లో కూడా బిల్లును అందుబాటులో ఉంచినట్లు నాటి స్పీకర్ నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. ఒక్కో షెడ్యూల్ ను విభజనకు సంబంధించిన ఒక్కో అంశాన్ని వివరించడానికి కేటాయించారు. నీటి విభజనకు ఒక షెడ్యూల్, ఉద్యోగులు అధికారుల విభజనకు ఒక షెడ్యూల్, శాసన మండలి విభజనకు ఒకటి%ొ% ఇలా ఏయే ప్రాంతంలో ఎన్ని పరిశ్రమలు ఉన్నదీ, ఎన్ని విద్యా సంస్థలు, ఆసుపత్రులు ఉన్నదీ, తదితర వివరాలన్నీ వివిధ షెడ్యూళ్లలో పొందుపరిచినట్లు ప్రకటించారు. తెలంగాణా ప్రాంత శాసన సభ్యులంతా ముసాయిదా బిల్లును స్వాగతించగా, సభా వ్యవహారాల సలహా సంఘం సమావేశంలో నిర్ణయించకుండా సభలో చర్చను ప్రారంభించడాన్ని సీమాంధ్ర ప్రాంత సభ్యులు వ్యతి రేకించారు. శాసనసభ కార్యకలాపాలు ప్రారంభం అయ్యాక దాదాపు అన్ని పార్టీల సభ్యులు ప్రత్యేక తెలంగాణ అనుకూల, వ్యతిరేక నినాదాలతో స్పీకర్ పోడియం ను చుట్టుముట్టి పోటాపోటీగా గొడవ చేశారు. 30 నిమిషాల వాయిదా అనంతరం తిరిగి సమావేశం అయిన సభలో స్పీకర్ తనకు రాష్ట్రపతి నుండి బిల్లు ముసాయిదా అందినట్లు ప్రకటించారు. స్పీకర్ ఆదేశాల మేరకు నాటి శాసన సభ కార్యదర్శి ఎస్.రాజసదారాం బిల్లు ముసాయిదాకు అనుబంధంగా పంపిన లేఖను చదివి వినిపించారు. 2014 జనవరి 23వ తేదీ లోగా, బిల్లుపై చర్చించి, బిల్లును వెనక్కి పంపాలని రాష్ట్రపతి తమ సందేశంలో పేర్కొన్నట్లు శాసనసభ కార్యదర్శి రాజా సదారాం సభలో తెలిపారు. గొడవ, నినాదాలు, ప్రతి నినాదాలు కొనసాగడంతో స్పీకర్ మరో 30 నిమిషాలు సభను వాయిదా వేశారు. ఆ నాటి ఉదయం శాసనసభ సమావేశం కాగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం, సమైక్య రాష్ట్రాల మద్దతుదారులు సభలో గందరగోళం పరిస్థితులు సృష్టించడంతో సభా కార్యకలాపాలు గంటపాటు వాయిదాపడ్డాయి. సభ తిరిగి సమావేశమైన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు లేక పోవడంతో స్పీకర్ సభను రెండుసార్లు వాయిదా వేయవలసి వచ్చింది. ఆరోగ్యం బాగా లేదంటూ నాటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి సభకు గైర్హాజరయ్యారు. నాటి శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు ను సంప్రదించిన స్పీకర్ నాదెండ్ల మనోహర్ బిల్లును శాసన సభలో ప్రవేశ పెట్టినట్లు ప్రకటించారు. చర్చను వెంటనే ప్రారంభించాలన్న శ్రీధర్ బాబు కోరిక మేరకు చర్చను ప్రారంభించాల్సిందిగా నాటి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడును, స్పీకర్ స్థానంలో ఉన్న డిప్యూటీ స్పీకర్ కోరారు. అయితే టిడిపి, కాంగ్రెస్ పార్టీలకు చెందిన సీమాంధ్ర శాసన సభ్యులు బిల్లు కాపీలను చింపి వేసి సమైక్య రాష్ట్రంకు మద్దతుగా నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలను అడ్డు కున్నారు. ప్రతిపక్ష నాయకుడు సభలో లేక పోవడంతో సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ స్థానం లో ఉన్న ఉపసభాపతి మల్లు భట్టి విక్రమార్క సభను మరుసటి రోజుకు వాయిదా వేసారు. శాసనమండలి లోనూ సభా ధ్యక్షుడు చక్రపాణి బిల్లును ప్రవేశ పెట్టగనే తెలుగు దేశం, సీమాంధ్ర కాంగ్రెస్ సభ్యులు పోడియంను చుట్టు ముట్టి రభస సృష్టించడంతో సభ తెల్ల వారటికి వాయిదా పడింది. సచివాలయంలో సీమాంధ్ర తెలంగాణ ఉద్యోగులు పోటా పోటీగా ర్యాలీలు నిర్వహించారు. బిల్లుపై చర్చించడానికి వీలుగా - శాసనసభ శీతాకాల సమావేశాలను పొడిగించాల్సిన అవసరం ఉందని నాటి పంచాయితీ రాజ్ శాఖా మంత్రి జానారెడ్డి అభిప్రాయ పడ్డారు. అయితే శాసన సభలో తెలంగాణ బిల్లుపై చర్చ ప్రారంభం కావడంపట్ల తెలంగాణా రాజకీయ ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం సంతోషం వ్యక్తం చేశారు.అసెంబ్లీ శీతాకాల సమావేశాలకు ముందు సభ ప్రోరోగ్ కాకపోగా, బిల్లు రాష్ట్ర శాసనసభకు రానున్న నేపథ్యంలో సభను ప్రోరోగ్ చేయించాలని, తర్వాత సభను ఎప్పుడు సమావేశ పరచాలనే నిర్ణయాధికారాన్ని తన చేతిలోకి తీసుకోవాలని సిఎం కిరణ్ భావించారు. ప్రోరోగ్ చేయాల్సిందిగా స్పీకర్ నాదెండ్ల మనోహర్‌కు లేఖ రాశారు. ఇది తెలంగాణ నేతలకు కోపం తెప్పించింది. ప్రోరోగ్‌కు ఒప్పుకునేది లేదు. ఒకవేళ స్పీకర్ లేఖ పంపించినా శాసనసభ వ్యవ హారాల మంత్రిగా ఆ ఫైలును నా దగ్గరే పెండింగ్‌లో పెడతాను అని శ్రీధర్ బాబు బహిరంగంగా ప్రకటించారు. అంతేకాదు స్పీకర్ నుంచి వచ్చిన ఫైలును పెండింగ్‌లో పెట్టి చూపించారు కూడా. దీంతో సభ ప్రోరోగ్ కాకుండా ఆగిపోయింది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకుని, మంత్రి శ్రీధర్ బాబును శాసన సభా వ్యవహారాల శాఖ నుండి తప్పించారు. కాగా, శాసనసభ వ్యవహారాల శాఖను సీమాంధ్ర కాంగ్రెస్ ఎమ్మెల్యేల కన్వీనర్‌గా, సమ్మెక్య పోరుకు నేతృత్వం వహిస్తున్న శైలజానాథ్‌కు శాసనసభా వ్యవహారాలను అప్పగించడం విశేషం. 3వ తేదీ నుంచి విభజన బిల్లుపై అసెంబ్లీలో చర్చ జరగనున్న అత్యంత కీలకమ్మైన సమయంలో శ్రీధర్ బాబును శాసనసభా వ్యవహారాల శాఖ నుండి తప్పించారు.చివరికి మంత్రివర్గం సమావేశమ్మై శాసనసభ శీతాకాల సమావేశాలకు ముహూర్తం నిర్ణయించింది. డిసెంబర్ 16న స్పీకర్ నాదెండ్ల మనోహర్ ఈ బిల్లును శాసనసభలో ప్రవేశ పెట్టారు. అదే రోజు సభ వాయిదా పడి, తిరిగి సమావేశమ్మైన తర్వాత డిప్యూటీ స్పీకర్ మల్లు భట్టు విక్రమార్క స్పీకర్ స్థానంలో ఉండగా బిల్లుపై చర్చకు శ్రీకారం చుట్టడం తదితరాలు క్రమానుగతంగా జరిగి పోయాయి.గతంలో ప్రతిపాదించిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2013, 2014 జనవరి 30 న ఆంధ్రప్రదేశ్ శాసనసభ తిరస్కరించింది. 2014 బిల్లు 2014 ఫిబ్రవరి 18 న లోక్‌సభలో, 2014 ఫిబ్రవరి 20 న రాజ్యసభలో ఆమోదించబడింది. ఈ బిల్లును భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ 2014 మార్చి 1 న ధ్రువీకరించారు. అధికారిక గెజిట్‌లో 2014 మార్చి 2 న ప్రచురించారు, దీని ప్రకారం 2014 జూన్ 2 చట్టం ప్రకారం 'నియమించబడిన రోజు' అనగా కొత్త రాష్ట్రాలు ఆవిర్భవించే రోజుగా ప్రకటించారు. బిల్లు రాష్ట్రపతి అంగీకారాన్ని పొంది 2014 మార్చి 1 న గెజిట్‌లో ప్రచురించింది. తెలంగాణ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన తేదీ ( నియమించబడిన తేదీ)అనగా 2 జూన్ 2014 న భారతదేశంలోని 29 వ రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది.



రామ కిష్టయ్య సంగన భట్ల...

# జగమెరిగిన తబలా విద్వాంసుడు ఉస్తాద్ జాకీర్ హుసేన్



డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

ప్రపంచానికి భారతీయ శాస్త్రీయ తబలా సంగీతాన్ని పరిచయం చేసిన ఘనుడు మన ఉస్తాద్? జాకీర్ హుసేన్. తబలా విద్వాంసుడు, సంగీత నిర్మాత, కంపోజర్, సినీ నటుడు, పర్‌క్యూషనిస్ట్ అయిన ప్రఖ్యాత హిందూస్తానీ తబలా సంగీత విద్వాంసుడు జాకీర్ హుసేన్ తన 73వ ఏట తీవ్ర అనారోగ్యంతో అమెరికాలో కన్నుమూసారనే వార్త ప్రపంచ సంగీత విద్వాంసులు, సంగీతాభిమానులను, ముఖ్యంగా భారతీయులను నివ్వెరపరిచింది. 09 మార్చి 1951న ముంబాయిలో జన్మించిన జాకీర్ హుసేన్ తండ్రి ప్రఖ్యాత తబలా విద్వాంసుడు "ఉస్తాద్? అల్లా" రాఖా కావడంతో తన ఏడవ ఏటి నుంచే తండ్రి అడుగు జాడల్లో నడుస్తూ తబలాపై అసమాన్య పట్టు సాధిస్తూ, 12వ ఏటనే ప్రదర్శనలు ఇస్తూ సంగీతకారుల మన్ననలు పొందడం, ప్రపంచానికి తన తబలా సంగీతాన్ని పరిచయం చేయడం జరిగింది. ముంబాయిలోని సెయింట్ మైఖేల్ ఉన్నత పాఠశాలలో స్కూల్ ఎడ్యుకేషన్, సెయింట్ గ్జేవియర్స్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. వెల్లింగ్టన్ యూనివర్సిటీ నుంచి సంగీతంలో డాక్టరేట్ పట్టా పొందారు. ప్రముఖ కథక్ నర్తకి, తన మేనేజర్, గురువైన 'ఆంటోనియా మిన్నెకోలా'ను వివాహమాడి ఇద్దరు కూతుళ్లకా జన్మనిచ్చారు. బహువిధ సంగీత విద్వాంసుల సమ్మేళనంలో మెరిసిన జాకీర్ హుసేన్ తబలా: 1970లో అమెరికా పర్యటించి ఏడాదికి 150కి పైగా సంగీత ప్రదర్శనలు ఇస్తూ, వివిధ రకాల సంగీత విద్వాంసులతో కలిసి అబ్బురపరిచే తబలా సంగీత విన్యాసాలను, అనేక రకాల స్టైల్స్‌ను, జాజ్, వరల్డ్ మ్యూజిక్‌లను మేళవించి సంగీతాభిమానుల మనసులు దోచుకున్నారు. 1991లో డ్రమ్మర్ మైఖేల్ హార్ట్‌తో కలిసి ప్లానెట్ డ్రమ్ ఆల్బమ్ తీసి "గ్రామీ అవార్డు"తో పాటు అనేక ఇతర అవార్డులు పొందారు. 1996 అట్లాంటా ఓలంపిక్స్ ప్రారంభోత్సవ వేడుకల్లో తన తబలా సంగీత కళలో చూపరుల మన్ననలు పొందారు. ఆరు దశాబ్దాలకు పైగా తబలా సంగీతానికి పట్టాభిషేకం చేసిన జాకీర్ హుసేన్ మన భరతమాత ముద్దు బిడ్డ కావడం మన అదృష్టం. ఉస్తాద్? జాకీర్ హుసేన్‌ను వరించిన పురస్కారాల పంట: ఉస్తాద్? జాకీర్ హుసేన్ సంగీత కృషి, ప్రతిభను గుర్తించిన భారత ప్రభుత్వం 1988లో 'పద్మశ్రీ', 2002లో 'పద్మ భూషన్', 2023లో 'పద్మ విభూషన్' పురస్కారాలు పొందారు. 1999లో 'యూఎస్ నేషనల్ హెరిటేజ్ ఫెల్లోషిప్' పొందారు. 2024లో నిర్వహించిన 66వ గ్రామీ అవార్డుల ప్రదానోత్సవంలో 5 కెటగిరీల్లో ప్రపంచ ప్రఖ్యాత 'గ్రామీ మ్యూజిక్ అవార్డులు' స్వీకరించిన తొలి భారతీయ సంగీత విద్వాంసుడిగా పేరొందారు. పలు ప్రపంచ ప్రఖ్యాత సమకాలీన సంగీత విద్యాంసులతో కలిసి సంగీత సృజనకు ఊపిరి పోశారు. 2006లో మధ్యప్రదేశ్ ప్రభుత్వ "కాళిదాసు సమ్మాన్", 1990లో 'భారత సంగీత నాటక అకాడమీ అవార్డు', 2018లో 'రత్న సదస్య' పురస్కారం, 2019లో 'సంగీత నాటక అకాడమీ ఫెల్లో'గా గుర్తింపు పొందారు. అనేక సినిమాలకు తన సంగీత సహకారం అందిస్తూనే, 2015లో 'సింఫొనీ ఆర్కెస్ట్రా ఆఫ్ ఇండియా'తో మరిచిపోలేని సంగీత నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పలు అమెరికన్ యూనివర్సిటీల్లో సంగీత పాఠ్యాంశాలు బోధిస్తూ, రేపటి తరానికి సంగీత సామర్థ్యాలను అవగాహన పరిచారు. 2017లో ఎస్ఎఫ్‌జజ్ వేదికలో 'జీవన సాఫల్య పురస్కారం', 2022లో ప్రఖ్యాత 'క్యోటో ప్రైజ్'ను స్వీకరించారు. 2016లో నాటి అమెరికా అధ్యక్షుడు బారక్ ఒబామా పిలుపుతో వైట్ హౌజ్‌లో తన ప్రతిభను ప్రదర్శించారు. అసంఖ్యాక మ్యూజిక్ అల్బమ్స్ సృష్టికర్తగా పేరు తెచ్చుకున్న జాకీర్ హుసేన్ జీవిత విశేషాలను పొందుపరుస్తూ "జకీర్ హుసేన్ : ఏ లైఫ్‌ఇన్ మ్యూజిక్" అనే పుస్తకాన్ని నసీర్ మున్నీ కబీర్ అనబడే రచయిత రచించారు. ముంబాయి యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందిన జాకీర్ హుసేన్ సంగీత జీవితం నేటి సంగీతాభిమానులు, యువ సంగీత కళాకారులకు దారి దీపం కావాలని కోరుకుందాం, ఉస్తాద్? తబలా వాయిద్య కళను సాధన చేసి శ్రోతలకు వీణలు విందు చేద్దాం.

# మైనారిటీల హక్కులకు రక్షణ ఏదీ?

భారతదేశం ఒక ప్రజాస్వామ్య, సెక్యులర్ దేశం. ఇక్కడ పౌరులందరికీ సమాన హక్కులూ, అవకాశాలు లభ్యం కావాలి. ఏ ఒక్కరిపట్లా వివక్ష, పక్షపాతం ఉండకూడదు. దేశంలో న్యాయం, ధర్మం అమలవుతున్నాయనడానికి ఇది నిదర్శనం. కాని పాలకుల నిర్వాకం వల్ల ఆపరిస్థితి లోపించింది. గత ఏడున్నర దశాబ్దాలకుపైగా దేశంలో ఒక పెద్ద సమూహం హక్కుల ఉల్లంఘనకు, అన్యాయానికి, వివక్షకు, అవకాశాల లేమికి గురవుతూఉంది. బడుగు బలహీన వర్గాలు, ముఖ్యంగా ముస్లిం మైనారిటీల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. ఏడున్నర దశాబ్దుల కాలమంటే చిన్న విషయం కాదు. ఈకాలంలో దేశం అనేక రంగాల్లో అభివృద్ధిని సాధించింది. కాని మైనారిటీ వర్గాలకు మాత్రం స్వాతంత్ర్య ఫలాలు ఇంకా అందనిద్రాక్షలుగానే మిగిలి పొయ్యాయి. ఇంతటి సుదీర్ఘ స్వతంత్ర భారతంలో పేదలు, బడుగు బలహీన వర్గాలకు సమాన హక్కులు, అవకాశాలు లభిస్తున్నాయా? అన్నది సమాధానం కోసం తడుముకోవాల్సిన ప్రశ్న. ఎందుకంటే, గత డెబ్భయ్యేళ్ళకు పైగా ఒక పెద్ద మానవ సమూహం మనదేశంలో వివక్షకు, అన్యాయానికి, అవకాశాల లేమికి, పీడనకు, హక్కుల ఉల్లంఘనకు గురవుతూ ఉంది. నిజానికి పరాయి బానిసత్వం నుండి విముక్తి పొందిన తరువాత ప్రజల జీవితాలు మారిపోవాలి. వారి జీవన ప్రమాణాలు మెరుగు పడాలి. అన్నిటికీ మించి వారి ఆత్మ విశ్వాసానికి ఆకాశమే హద్దుకావాలి. కాని మన దేశంలోని ముస్లిం మైనారిటీల పరిస్థితి అలాలేదు. అడుగడుగునా వారికి అవమానాలే ఎదురవుతున్నాయి. వారి హక్కులకు భంగం కలిగే అనేక కార్యక్రమాలు దేశంలో అనునిత్యం జరుగుతున్నాయి. వారి ఆస్తులకు, వారి ప్రార్ధనాలయాలకు రక్షణ లేని పరిస్థితి నెలకొంది. మోదీ, యోగీ లాంటి మతోన్మాద నేతలు అధికారపీఠం అధిరోహించిన నాటినుండి వారి జీవనం మరీ దుర్భరంగా మారిపోయింది. రాజ్యాంగం ప్రసాదించిన అనేక హక్కులకు దిక్కులేకుండా పోయింది. మొన్నటి ఎన్నికల్లో మెజారిటీ తగ్గి 240 సీట్లు మాత్రమే రాబట్టి సరిపోయింది గాని, అదే వారన్నట్లు నాలుగొందలు దాటిఉంటే ఈ పాటికి భారత రాజ్యాంగం ఏమైపొయ్యి ఉండేదో ఊహిస్తేనే భయమేస్తోంది. ఇంతటి నియంతృత్వాన్ని, ఇంతటి ఫాసిజాన్ని దేశం ఎప్పుడూ చూడలేదు. నివాస గృహాలపై బుల్డోజర్లు నడపడం, ప్రార్ధనాలయాలను కూల్చడం, ఇళ్ళలో జొరబడి భీభత్సం సృష్టించడం, నోట్లో మూత్రం పోయడం, దుకాణాలను కాల్చేయడం, పిల్లలు, మహిళలపై దౌర్జన్యాలకు పాల్పడడం, ఉన్మాదంతో ఊగిపోతూ ఒకగుంపు మూకుమ్మడిగా నిస్సహాయులపై దాడి చేసి చంపడం, ముస్లిం మైనారిటీలే లక్ష్యంగా వారి ప్రార్ధనాలయాలముందు ఉన్మాదంతో ఊగిపోతూ, డ్యాన్సులు చేస్తూ ఆయుధాలు ప్రదర్శిండం, ఆపరిసరాలన్నీ దద్దరిల్లేలా డీజే సౌండ్స్ పెట్టడం, ఎదురు పడిన వారిని చావబాదడం, మసీదు మీనార్లు ఎక్కిమరీ కాషాయ జెండాలు కట్టడం, ముస్లింలకు వ్యతిరేకంగా అమాయక హిందూ సోదరుల్ని రెచ్చగొట్టడం లాంటి అనేక దుర్మార్గాలకు పరివార్ మూక పాల్పడుతోంది. అయినా పోలీసులతో



సహా అందరూ గుడ్లప్పగించి చూస్తారు తప్ప ఎవరూ ఏమీ మాట్లాడరు. ముస్లింలను, క్రైస్తవులను అరికించి నరుకుతాం... ఊచకోత కోస్తాం...అంటూ కరవాలాలు ఝులిపించి బహిరంగంగా టీవీల్లో మాట్లాడుతుంటే 'అందరూ' చూస్తూ ఆనందిస్తున్నారు. కంచే చేను మేసినట్లు పాలకుల భావజాలమే ఉన్మాదమైనప్పుడు మంచిని, మానవీయతను ఆశించడం అత్యాశ తప్ప మరేమీకాదు. ప్రభుత్వమే కక్షకట్టి ముస్లింలకు వ్యతిరేకంగా చట్టాలు చేస్తుంటే ఇక వారికి రక్షణ ఎలా ఉంటుంది? కనీసం తినే తిండి, తొడిగే బట్టవిషయంలో కూడా స్వతంత్రత లేకుండా పోయింది. మూకదాడులు, ఆస్తుల విధ్వసంతో పోయినవారి ప్రాణాలుపోగా, మిగిలినవారి జీవితాలు దుర్భరమౌతున్నాయి. అసలే పేదరికంతో మగ్గుతున్న జాతికి ఇది గోరుచుట్టుపై రోకటి పోటు. ఈనాటికీ దేశ మైనారిటీ జనాభాలో అరవైశాతం మంది ప్రజలు దారిద్ర్య రేఖ దిగువన దుర్భర జీవనం గడుపుతున్నారంటే పరిస్థితిని అర్ధం చేసుకోవచ్చు. అత్యధిక శాతం మందికి సరైన జీవనోపాధి అవకాశాలు లేవు. కూడు, గూడు, గుడ్డ అన్న కనీస రాజ్యాంగ హామీ కూడా వీరికి వర్తించడం లేదు. అక్షరాస్యతా శాతం అతి హీనం. ఉన్నత స్థాయి విద్యనభ్యసించిన వారు కూడా చాలా తక్కువ. దేశ సంపదనంతా బడా బాబులకు దారాదత్తం చేసి బడుగుల నోట్లో మన్నుకొట్టడం ప్రస్తుత పాలకులు చేస్తున్న పని. కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెట్టి, ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి ఓట్లు రాబట్టుకొని అందలాన్ని ఎక్కడం పరివార్ ఫాసిస్టు శక్తులకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదు. మైనారిటీ వర్గాలకు వ్యతిరేకంగా మెజారిటీ వర్గాన్ని రెచ్చగొట్టడం, పురిగొల్పడం ఈదుర్మార్గులకు వెన్నతో పెట్టిన విద్య. నిజానికి దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయబద్దంగా, రాజ్యాంగ పరంగా వారికి లభించవలసిన హక్కులు, అవకాశాలు, అభివృద్ధి ఫలాలు లభించినప్పుడే 'స్వతంత్ర భారత' భావనకు పరిపూర్ణత చేకూరుతుంది. 'దేశస్వాతంత్ర్య ఫలాలు, సమాన అవకాశాలు అందరికీ' అన్నరాజ్యాంగ హామీకి సార్థకత సిద్ధిస్తుంది.

అలా కాకుండా దేశంలోని ఏఒక్క వర్గం ప్రజలైనా వివక్షకు, పక్షపాతానికి, అణచివేతకు, అవకాశాల లేమికి, న్యాయ నిరాకరణకు గురైతే దేశం ప్రగతీ వికాసాల బాటలో పయనించడం, నాగరిక లక్షణాలతో విలసిల్లడం అసాధ్యం.

కనుక, పాలక పక్షాలు ఇప్పటికైనా స్పందించి దేశ ప్రజలకు, ముఖ్యంగా ఎస్ సీ, ఎస్టీ, బీసి, మైనారిటీ, బడుగు బలహీన వర్గాల ప్రజలందరికీ రాజ్యాంగం కల్పించినటువంటి హక్కుల్ని వారికి అందించాలి. ముస్లిమ్ మైనారిటీలకు వారి జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పిస్తూ, పంచాయితీ మొదలు పార్లమెంటు వరకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి. ముస్లిముల సంక్షేమానికి అరకొర నిధులు విదల్చడం కాకుండా ప్రత్యేకంగా సమగ్ర బడ్జెట్ కేటాయించాలి. ఎస్ సీ, ఎస్టీలకు అత్యాచార నిరోధక చట్టం ఉన్నట్లుగానే, ముస్లిమ్ ల కోసం కూడా అత్యాచార నిరోధక చట్టం తీసుకురావాలి. సబ్ ప్లాన్ అమలు చేయాలి. మైనారిటీ కార్పొరేషన్ , మైనారిటీ ఎడ్యుకేషన్ బోర్డు, ముస్లిమ్ పర్సనల్ లా, ఉర్దూఅకాడమీ, వక్ఫ బోర్డుల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. వక్ఫ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి. కబ్జాకోరుల చేతుల్లో ఉన్న భూములు, ఇతరేతర ఆస్తుల్ని వారినుండి తిరిగి రాబట్టాలి. విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలన్నింటిలో ముస్లింలకు సముచితమైన, చట్టబద్ధమైన అవకాశాలు, ప్రాతినిధ్యం కల్పించాలి. దేశం పట్ల, దేశ ప్రజల పట్ల, అందులో భాగమైన మైనారిటీల పట్ల ఏమాత్రం బాధ్యత ఉన్నా కనీసం జస్టిస్ సచార్ సిఫారసులనైనా తక్షణం అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. బియ్యారెస్ వాగ్దానం చేసి మోసం చేసిన 12 శాతం రిజర్వేషన్ల హామీని కాంగ్రెస్ సర్కారైనా అమలు చేసి మాది చేతల ప్రభుత్వమని నిరూపించుకోవాలి. ముస్లింలకు ఉపాధి అవకాశాల కల్పనలో, మైనారిటీ రుణాల విషయంలోగత బీఆరెస్ సర్కారు ఘోరంగా విఫలమైంది. కాంగ్రెస్ ఈతప్పును సరిదిద్ది ముస్లింలకు వడ్డీరహిత రుణ సౌకర్యం కల్పించాలి. వారి సంక్షేమం కోసం ఏదైనా ఒక నిర్దిష్టమైన పథకం ప్రకటించి అమలు చేయాలి. ముస్లింలు కూడా ఓటుబ్యాంకు రాజకీయాలకు లొంగకుండా, రాజకీయ చైతన్యం పెంపొందించుకొని, ఎవరో వస్తారు, ఏదో చేస్తారని ఎదురు చూడకుండా రాజ్యాంగ ప్రసాదితమైన తమ హక్కుల సాధనకు రాజ్యాంగ బద్ధంగానే పోరాడాలి. పాలక పక్షాలు చురుగ్గా స్పందించేలా దేశంలోని ప్రజాస్వామ్య ప్రియులు, హక్కుల నేతలు, లౌకిక వాదులు, వామపక్షీయులు, బహుజన శక్తులతో కలిసి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు రావాలి. ప్రజాస్వామ్య శక్తులు, భావ సారూప్యత కలిగిన వ్యక్తులు, సంస్థలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పౌరసమాజం సహకారంతో ముస్లిమ్ నేతలు, సంఘాలు ఐక్య కార్యాచరణ రూపొందించుకొని ఉద్యమాలకు పూనుకోవాలి.

భాధిత వర్గాల్లో చైతన్యం రానంతకాలం పాలక పక్షాలు వారిని ఓటు బ్యాంకులుగానే పరిగణించి చిన్నచిన్న తాయిలాలతోనే సంతృప్తి పరిచే ప్రయత్నాలు చేస్తుంటాయి. కనుక చైతన్యంతో కార్యాచరణ రూపొందించుకొని సాధన దిశగా ముందుకు సాగితేనే హక్కులు పరిరక్షించబడే అవకాశం ఉంది.



యండి. ఉస్మాన్ ఖాన్

# మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి పాయం జయ బాబు

## ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పాయం జయబాబు దొర



భద్రాచలం నియోజకవర్గం డిసెంబర్15(వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం లో జాతీయ మానవ హక్కులు మహిళా మరియు శారు సందక్షణ సమితి సమావేశంఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పాయం జయబాబు దొరఅధ్యక్షతన జరిగింది.సమావేశానికి జాతీయ చైర్మన్ అనంతల శ్రీనివాస్ మరియు రీజనల్ అధ్యక్షుడుసామంతుల దుబాష్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. సమావేశంలోప్రసంగించారు.నేషనల్ చైర్మన్ ఆనందుల శ్రీనివాస్ మాట్లాడుతూ సరసన సక ప్రవేబ్బరికి మానవ హక్కులలపై అవగాహన ఉండాలన్నారు. మన హక్కులు మనం మెలుకోవాలనిసూచించారు. 1948 డిసెంబర్ 10వవేసిన అంతర్జాతీయ మానవ హక్కులకమీషన్ ఏర్పడిందని తెలిపారు. మానవహక్కుల కమీషన్ ముఖ్యశ్యంప్రతి ఒక్కరు – స్వేచ్చాపరమైన జీవిదిలి గడి పెందుకు ధరించు మారిషినిప్రతీ ఒక్కరికి స్వేచ్చగా జీవించే హక్కు ఉందని మరియు సమాజంలో ధనగౌరవానికి ఎలాంటి భంగం కలగకుండా ఉండాలన్న నదుద్దేశ్యంతో ఏర్పాటు చేశారనితెలిపారు. ప్రస్తుతం మానవ హక్కులకు భంగం కలుగుతుందనితెలిపారు. పూర్వంలోని లా ఆ నేషనల్ హ్యూమన్ రైట్స్ ఉమన్ అండ్ చైల్డ్‌పొలటెక్షన్ కౌన్సిల్ సామాన్యుడికి హక్కు అండగా ఉంటూ వారి హక్కులనుఅరికి శైలియ చేయడంలో కోలక పావు వహిస్తుందని అట్లాగే ప్రభుత్వఅధికారులకు సామాన్యుడికి మధ్య వారధిలా ఉంటుందని ఉ టుందని తెలిపారు. ప్రభుత్వ అధికారులతో కలిసి వారిని అప్రమత్తం చేస్తుందని అన్నారు. ప్రస్తుతం మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతందని ఇలా జరగకుండాప్రద జిల్లాలో మానవ వేళ్ళులు అవగాహన సరస్సులు నిర్వహిస్తు ప్రజలకువారి హక్కులను తెలియచేస్తున్నామని అన్నారు. అత్తారిఖలురావు జిల్లా అద్భుజము శీలం క్రిష్ణ . ఎస్.కె అమావాస్యాధి చాలుగాఒకరు. గిరిప్రసాద్ ఒంకటరి విరఖర్ అయిన్లీ భద్రడో కతేగూడెన్ ప్రెసెటాచ్ తదితరులు హాజరయ్యారు.

# మన సంస్కృతి రాష్ట్ర స్థాయి ప్రతిభ పరీక్షలో సత్తా చాటిన నాగభూషణ పాఠశాల విద్యార్థి

## అభినందించిన పాఠశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం



బాసర డిసెంబర్ 16 ( వుదయం ప్రతినిధి) ఇటీవల నిర్వహించిన మన సంస్కృతి రాష్ట్ర స్థాయి తెలుగు ప్రతిభ పరీక్షలో బాసర విద్యార్థి రాష్ట్రస్థాయిలో తన ప్రతిభను చూపాడు. ఈ నేపథ్యంలో విద్యార్థిని అందరూ అభినందించారు. బాసర మండల కేంద్రంలోని శ్రీ నాగభూషణ విద్యాలయం పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి నేత్ర కిషోర్ ఈ నెల 13న హైదరాబాద్ లోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో మన సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు ప్రతిభ పరీక్ష పోటీల్లో రాష్ట్ర స్థాయిలో మొదట స్థానంలో నిలిచి సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ చేతులమీదుగా నగదు బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశంసా పురస్కారం అందుకున్నాడు. దింతో సోమవారం నేత్రకిశోర్ ను పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ బాబురావు జారికొటే, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ సులోచన ఉపాధ్యాయులు అభినందించి శాలువతో సత్కరించారు. విద్యార్థి తండ్రి గుండెల్లి కృష్ణమూర్తిని శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ. మా పాఠశాల విద్యార్థి తెలుగు ప్రతిభ పరీక్షలో స్టేట్ ఫస్ట్ రావడం మా పాఠశాలకు గర్వకారణం అని అన్నారు. తెలుగు భాష ఉపాధ్యాయులను అభినందించారు. తెలుగు భాష గొప్పదనం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సులోచన, తెలుగు ఉపాధ్యాయుడు రాజేశ్వర్, ఉపాధ్యాయిని రజిత మరియు విద్యార్థి తండ్రి కృష్ణమూర్తి మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఈనెల 20న హజ్రత్ సయ్యద్ రుస్తుం అలీషా ఉర్సు

- 21 న (చిరాగా)దీపోత్సవం
- 22 న ఖతం ఖురాన్,తీర్థ ప్రసాద వితరణ
- 6 వ ఉర్సు ఉత్సవాలకు దర్గా ముస్తాబు



నాగర్ కర్నూల్ డిసెంబర్16( వుదయం ప్రతినిధి) జిల్లా లోని బిజినేపల్లి మండలం వట్టెం గ్రామంలో ఈనెల 20వ తేదీన హజ్రత్ ఖాజా సయ్యద్ మహమ్మద్ రుస్తుం అలీ షా చిస్తి మిర్జాయి ఖలందరి రహ్మతుల్లా అలై గారి ఆరవ ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దర్గా పీఠాధిపతులు మహమ్మద్ ఖాజా అమీర్ అలీ చిస్తి మిర్జాయి ఖలందరి సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. వట్టెంలోని తమ నివాసం నుంచి సాయంత్రం నాలుగు గంటల 30 నిమిషాలకు గంధం బయలుదేరి గ్రామపురవీధులకుండా ప్రధాన రహదారి వెంట సాయంత్రం దర్గా వద్దకు చేరుకోవడం జరుగుతుందన్నారు. రాత్రి పది గంటలకు దర్గా వద్ద గంధం సమర్పణ ప్రత్యేక ఫాతిహాలు ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పీఠాధిపతి తెలిపారు. సజ్జదే నషీన్ హజరత్ కాజా మహమ్మద్ సయ్యద్ అమీరొద్దీన్ చిస్తీ హాఫీజ్ ఖారి సయ్యద్ శర్ఫొద్దీన్ చిస్తి గారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని ఆయన తెలిపారు. 21వ తేదీన సాయంత్రం 7 గంటలకు చీరాగా, నా తీయ కార్యక్రమం తో పాటు మీలాద్ అనంతరం ఖవ్వాలి ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. 22వ తేదీన ఉదయం 8 గంటలకు ఖురాన్ పఠనం ఫాతిహా ఖతం ఖురాన్ అనంతరం ఖవ్వాలి, కార్యక్రమాలతోపాటు తీర్థ ప్రసాద వితరణ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయని,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని దర్గా పీఠాధిపతి మహమ్మద్ ఖాజా అమీర్ అలీ చిస్తి మిర్జాయి ఖలందరి తెలిపారు.

# అంబులెన్స్. షెడ్ ఏర్పాటు చేయాలని తాసిల్దార్ గారికి వినతి పత్రం

## తాసిల్దార్ ముంజం సోము గారికి వినతి పత్రం సమీర్ పోస్తున్న బి ఆర్ ఎస్ నాయకులు



నిర్మల్ జిల్లా కుబీర్ మండలం డిసెంబర్ 16. వుదయం విలేఖరి కుబీర్ మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వంకుబీర్ మండలానికి 108 అంబులెన్సు సాంక్షన్ చేయటం జరిగింది కావున తొందర్లోనే అంబులెన్స్ ప్రారంభించేటట్టు చేయాలని అలాగే అంబులెన్స్ షెడ్ ఏర్పాటు చేయాలని మండలం లోని కుబీర్ మండల వాసులు పంచాయితీ ప్రజలు. మండలంలోని ప్రజలు తాసిల్దార్ గారికి కోరారు. ఈ మేరకు వారు సోమవారం కుబీర్ మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ ముంజం సోము గారికి వినీతి పత్రం సమర్పించారు. వారు సానుకూలంగా స్పందించి వెంటనే అంబులెన్స్ షెడ్ ఏర్పాటు చేయిస్తానని వారు కోరడం జరిగింది. కార్యక్రమంలో. బి ఆర్ ఎస్సీ సెల్ అధ్యక్షులు జుమడ ఈ నగేష్ ,వికాస్ తది తరులు పాల్గొన్నారు

## డ్రైనేజిల్లో మురుగును తొలగించాలి

లింగాల డిసెంబర్16(వుదయం ప్రతినిధి): లింగాల మండల కేంద్రంలోని 12 13 తదితర వార్డుల్లో డ్రైనేజీల్లో చెత్తాచెదారంతో మురుగు నిండిపోవడంతో డ్రైనేజీ పక్కనున్న ఇంటి నిర్మించుకున్న కుటుంబ సభ్యులకు దుర్గంధ వాసనతో,దోమలు ఇళ్లలోకి వ్యాప్తి చెంది మలేరియా టైఫాయిడ్ పైతర విష జ్వరాలు వస్తున్నాయని ఆయా కాలనీవాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ కార్యదర్శి స్పందించి వెంటనే డ్రైనేజీలు నిండు పోయిన మురుగును తొలగించి,దోమలకు సంబంధించిన రసాయన మందులతో డ్రైనేజీ కాలువలు పిచికారి చేసి విష జ్వరాల నుండి విముక్తి చేయాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

## బోథ్ మండలాన్ని వణికిస్తున్న చలి

బోథ్, డిసెంబర్16(వుదయం ప్రతినిధి): బోథ్ మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోయాయి. ఉష్ణోగ్రతలు తగ్గడంతో ప్రజలు చలిమంట కాసుకుంటున్నారు. అలాగే అధికారులు కూడా ప్రజలకు పలు సూచనలు చేస్తున్నారు. గుండె జబ్బులు, ఆస్తమా ఉన్న పేషెంట్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. మరియు పొగ మంచు కారణంగా వాహనదారులు నెమ్మదిగా వెళ్లాలని సూచిస్తున్నారు.

# అసెంబ్లీలో ఫిర్యాదు తర్వాత కూడా చెరువులోకి అరబిందో వ్యర్థాలు

- పత్రికల్లో వచ్చినా పట్టించుకోని కాలుష్య మండలి
- కలుషిత జలాలను అరికట్టే చర్యలు తీసుకోవాలి
- అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి





జడ్చర్ల, డిసెంబర్15(వుదయం ప్రతినిధి): జడ్చర్ల సెజ్ లోని అరబిందో ఫార్మా కలుషిత జలాలను ముదిరెడ్డిపల్లి చెరువులోకి వదులుతోందనే విషయాన్ని తాను ఇదివరకే అసెంబ్లీ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చినా ఆ కంపెనీ కలుషిత జలాలను వదలడం ఆపలేదని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి చెప్పారు. ఈ విషయంగా కాలుష్యమండలి చర్యలు తీసుకోవాలని కోరారు.సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో అనిరుధ్ రెడ్డి పోలేపల్లి సెజ్ లోని అరబిందో ఫార్మా కంపెనీ ముదిరెడ్డిపల్లి చెరువులోకి కాలుష్య జలాలను వదులుతున్నందున పంటలు దెబ్బతింటున్నాయని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా? అని వేసిన ప్రశ్నకు ముందుగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమాధానం ఇస్తూ, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గతంలోనూ, ఇటీవల జరిగిన తనిఖీల్లో అరబిందో తో పాటుగా ఆమ్నెల్, ఏపిఎల్ హెల్త్ కేర్ పరిశ్రమల నుంచి ఎలాంటి వ్యర్థాలు విసర్జించడం లేదని, పరిశ్రమలు వదిలే జలాల కారణంగా భూసారానికి ఎలాంటి నష్టం జరగలేదని తేల్చడం జరిగిందని చెప్పారు. ఆ తర్వాత అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, అరబిందో పరిశ్రమ నుంచి వర్షపు నీటితో పాటు కలుషిత జలాలను ముదిరెడ్డిపల్లి చెరువులోకి వదులుతున్న కారణంగా చెరువులో చేపలు మరణిస్తున్నాయని, పంటలు దెబ్బతింటున్నాయని, ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని గత జూలై 30 న జరిగిన అసెంబ్లీ సమావేశంలోనూ చెప్పడం జరిగిందని గుర్తు చేసారు. అయితే తాను సభలో ఈ విషయాన్ని గురించి ఫిర్యాదు చేసిన తర్వాత కూడా అరబిందో పరిశ్రమ ముదిరెడ్డిపల్లి చెరువులోకి కలుషిత జలాలను వదలడం జరిగిందని, ఆగష్టు, అక్టోబర్ మాసాల్లో దీనికి సంబంధించిన వార్తలు ఆధారాలు, ఫోటోలతో సహా ప్రముఖ మీడియాలోనూ వచ్చాయని ప్రస్తావిస్తూ వాటికి సంబంధించిన క్లిప్పింగ్ లను స్పీకర్ కు చూపించారు. అయినా కాలుష్య మండలి అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోలేదని చెప్పారు. అరబిందో పరిశ్రమ నుంచి కలుషిత జలాలు చెరువులోకి వస్తున్నప్పుడు ముద్దిరెడ్డిపల్లి గ్రామస్తులు ఈ విషయం గురించి కాలుష్య మండలికి ఫిర్యాదు చేస్తే వారు వెంటనే వచ్చి ఆ విషయాన్ని పరిశీలించకుండా ఆ నీళ్ల ఆగిపోయి, ఆనవాళ్లన్నీ ఎండిపోయిన తర్వాత వచ్చారని విమర్శించారు. మరోసారి కూడా ముదిరెడ్డిపల్లి గ్రామస్తులు కాలుష్య మండలి అధికారుల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తే వారి ఫిర్యాదుపై చర్యలు తీసుకోకపోగా అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సలహా ఇచ్చారని అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. కాలుష్య మండలి పరిశ్రమల కాలుష్యాన్ని నియంత్రించడానికి రూపొందించిన నిబంధనల్లో 90 శాతం అమలు చేసినా కలుషిత జలాల సమస్య పరిష్కారమౌతుందన్నారు. గతంలో రెడ్ కేటగిరీకి చెందిన ఒక పరిశ్రమ విషయంగా తాను కోర్టుకు వెళ్లి దాన్ని తరలించాలని కోర్టు నుంచి ఆదేశాలు తెచ్చినా వాటిని అమలు చేయలేదని పేర్కొన్నారు. అరబిందో కలుషిత జలాల విషయంగా చర్యలు తీసుకోవాలని, దాని కారణంగా నష్టపోతున్న ముదిరాజ్ బిడ్డలకు న్యాయం చేయాలని అనిరుధ్ రెడ్డి కోరారు. దీనిపై మంత్రి శ్రదర్ బాబు స్పందిస్తూ, అనిరుధ్ రెడ్డి చెప్పిన విధంగా ఆగష్టు 24, అక్టోబర్ 26న అరబిందో కలుషిత జలాలపై వచ్చిన వార్తల విషయాన్ని పరిశీలిస్తామని, ఈ విషయంగా వ్యవసాయ శాఖ నుంచి నివేదిక కోరుతామని చెప్పారు. కాలుష్య మండలి నిబంధనలు అమలు చేయడంలో ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వాటిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# మండల పార్టీ ఆధ్వర్యంలో గాదరి కిషోర్ జన్మదిన వేడుక



తుంగతుర్తి/ శాలిగౌరారం, డిసెంబర్ 16, (వుదయం ప్రతినిధి):తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డా. గాదరి కిషోర్ కుమార్ జన్మదిన వేడుకని ఘనంగా నిర్వహించారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు,మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కట్ట వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చాడ హతీష్ రెడ్డి, అక్కెనపల్లి శ్రీరాములు, అడ్లూరు గ్రామ శాఖ అధ్యక్షుడు దొనకొండ అంజయ్య, బాకీ వెంకటయ్య, ఎండి రఫీ, మెట్టు నగేష్, నూనెముంతల అంజయ్య, గోదాల సురేష్ రెడ్డి,ఆలకుంట్ల వెంకన్న, నిమ్మల సాయిబాబా, పనికెర కమలాకర్, యామగోని వెంకన్న, మెట్టు ఉపేందర్, నిమ్మల సురేష్ గౌడ్, రాపాక రాజు, బీసు రవిగౌడ్, రాచకొండ గణేష్, మాగి రవి, బట్ట చిన్న సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కామ్రేడ్ రావి సీతయ్య వర్ధంతి



దమ్మపేట డిసెంబర్16(వుదయం ప్రతినిధి): మండల పరిధిలోని ముష్టిబండ గ్రామములో సోమవారం నాడు సిపిఎం పార్టీ నాయకులు అమరజీవి కామ్రేడ్ రావి సీతయ్య 2. వ వర్ధంతి ముష్టిబండ పార్టీ శాఖ కార్యదర్శి కొలిక్కిపోగు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది మొట్టమొదట సీతయ్య స్మారక స్థూపం వద్ద పార్టీ జెండాను జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మీనారాయణ ఎగురవేశారు చిత్రపటానికి మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు తరువాత జరిగిన వర్ధంతి సభలో జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మీనారాయణ మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు లు మాట్లాడుతూ సీతయ్య ప్రపంచంలోనే మహత్తర మైన మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని నమ్మి ఎర్రజెండాను భుజానికి ఎత్తుకొని తన జీవితాంతం పేద ప్రజల కోసం కష్టజీవులు కోసం రైతుల కోసం అణగారిన వర్గాల కోసం కుల రహిత సమాజం కోసం వర్గ రహిత సమాజం కోసం ప్రజల తరఫున మిలిటెంట్ పోరాటాలు నిర్వహించారని ఘనంగా నివాళు లర్పించారు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అవి అన్ని తుంగలో తొక్కారని హామీలు అమలు కోసం ప్రజా పోరాటాలు నిర్వహించాలని అన్నారు ఈ ప్రాంతంలో మార్క్ లిస్ట్ పార్టీ ఎదుగుదల కోసం రావి సీతారామయ్య తన ప్రాణం ఉన్నంత వరకు కృషి చేశారని వారన్నారు ఈ కార్యక్రమంలో ఆరుకుట్ల రాంప్రసాద్ కొలికి పోగు ప్రశాంత్, జగన్నాథం శ్రీనివాసరావు, చీకటి వెంకట లక్ష్మీనారాయణ, కొలిక్కిపోగు జగపతి, కొలిగిపోగు లక్షన్న , గ్రామ పెద్దలు కూకలకుంట చిట్యారావు.

కూకులకుంట భద్రయ్య గారి రవికుమార్ ,సీతయ్య కుటుంబ సభ్యులు రావి వీర వెంకట కుమార్, రావి బన్ను ,తంగెళ్ళమూడి రమేష్ , సీతయ్య కుమార్తెలు కోడళ్లో తదితరులు పాల్గొన్నారు

# ప్రకృతి పచ్చగ ఉంటేనె జీవితం నిండుగా ఉంటుంది"..

## మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్



తుంగతుర్తి నియోజకవర్గం, డిసెంబర్ 16, (వుదయం ప్రతినిధి): "ప్రకృతి పచ్చగా ఉంటేనే జీవితం నిండగా ఉంటుందని'' మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అన్నారు. కిషోర్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ నందర్భంగా కిషోర్ కుమార్హైదరాబాద్ పట్టణంలోని తన నివాసంలో మొక్కను నాటి మాట్లాడుతూ..గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషంగా ఉ ందన్నారు. ఇది పర్యావరణ పరిరక్షణకు ఒక నిజమైన చాలెంజ్ అని, మొక్కలు నాటడం, పెంచడం బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. మొక్కలను సంరక్షించడం వల్ల నేలతల్లికి, మానవ సమాజానికి ఎంతో ఉపయోగకరమని, మనమందరం ఆరోగ్యకరంగా ఉండాలంటే మొక్కలు నాటడం చాలా అవసరమన్నారు.ప్రతి ఒక్కరు మొక్కలు పెంచే బాధ్యత తీసుకోవాలని గాదరి కిషోర్ కుమార్ ఆకాంక్షించారు.

# సిఎమ్ఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన భూక్యా ప్రవీణ్ నాయక్.సీతారాం రెడ్డి.



బయ్యారం డిసెంబర్16(వుదయం ప్రతినిధి): బయ్యారం మండలంలోని కొత్తపేట ఎస్సి కాలనీ కి చెందిన కదారి రాకేష్ కు సిఎమ్ఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ ద్వారా 9,500,గంధంపల్లి బీసీ కాలనీ చెందిన పల్లెపర్తి లక్ష్మి16,500 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తూ నిరుపేద కుటుంబాలకు సహాయ సహకారం అందిస్తున్న మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్,ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాలతో సొసైటీ డైరెక్టర్ జూలకంటి సీతారాం రెడ్డి,మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి భుఖ్యప్రవీణ్ నాయక్ ఇద్దరు కలిసి 26,000 రూపాయల చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాధితులు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీటీస్ గంగావతి గోపాల్,బొమ్మకంటి రాంబాబు,బోడ సాయిక్రిష్ణ,కొల్లిపాక రవి,పుల్లూరి బాలరాజు, ధారా రఘుపతి,ఉల్లోజు సైదులు,మాచర్ల సుక్కయ్య,మరికంటి శ్రీను,గుగులోత్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్ గ్యాస్ ఏజెన్సీ పై చర్యలు తీసుకోవాలి .

**కస్టమర్లను మభ్యపెట్టి మోసం చేస్తున్న పెంచరామిశాఖ.**

**ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లాఅధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ.**



భూపాలపల్లి డిసెంబర్16(వుదయం ప్రతినిధి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోనిమొగుళ్ళపల్లీ మండలంలో భారత్ గ్యాస్ ఏజెన్సీ నుండి కస్టమర్ల అనుమతి లేకుండ వారిని చిట్యాల మండలం లోని వెంచరామిలో కొత్తగా ఏర్పడ్డ శాఖకు కి బదిలీచేసి కస్టమర్స్ కి ప్రభుత్వ సబ్సిడీ అందకుండా చేస్తున్న వెంచరామి శాఖ భారత్ గ్యాస్ ఏజెన్సీని గుర్తింపు ని వెంటనే రద్దు చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ డిమాండ్ చేసారు.... ఏజెన్సీ రిజిస్ట్రేషన్ మొగుళ్ళపల్లీ శాఖలో ఉన్నప్పుడు సబ్సిడీ డబ్బులు అందగా,, వెంచరామి శాఖకు బదిలీ చేయగానే సబ్సిడీ రాక పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారు అని తెలియజేసారు....ఇట్టి విషయంపై వెంటనే జిల్లా కలెక్టర్ కూడా స్పందించి గ్యాస్ ఏజెన్సీ పై విచారణ జరిపించి బాద్యులపై చర్యలు తీసుకోవాలని మరియు భాదితులకు ప్రభుత్వ గ్యాస్ సబ్సిడీ డబ్బులు అందేలా చర్యలు డిమాండ్ చేశారు....లేని పక్షంలో పెద్ద ఎత్తున భాధితుల పక్షాన ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు...

# వెనక్కి పంపిన సోయా పంట ఆందోళనలో రైతన్న.



కామారెడ్డి జిల్లా డిసెంబర్16(వుదయం ప్రతినిధి): జుక్కల్ నియోజకవర్గం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సోయా పంటకు మద్దతు ధర కల్పిస్తూ మద్నూర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో నాబార్డు ద్వారా మద్నూర్ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. సోమవారం సోయా పంట బాగులేదంటూ ఇక్కడి నుండి వెళ్ళిన లారీలను అక్కడ పరిశీలించిన అధికారులు బాగు లేదంటూ 500 నుండి 600 బ్యాగులు వెనక్కు పంపడంతో మద్నూర్ మార్కెట్ యార్డులో సోమవారం నాడు రైతులంతా ఆందోళనకు వ్యక్తం చేశారు. విండో కార్యదర్శిని ఎందుకు పంట వెనక్కి వచ్చిందని అడిగారు. నిబంధనల ప్ర కారమే తాము సోయాలు అమ్మామని కొనుగోళ్ల అనంతరం రైతులకు ఇలా వాపసు చేయడం సరియైన విధానం కాదంటూ విమర్శించారు. మద్నూర్ తాసిల్దార్ ముజిబ్ మరియు సొసైటీ కార్యదర్శి బాబురావు రైతులతో మాట్లాడుతూ పై అధికారులతో మాట్లాడి ఇలాంటివి పునావృతం కాకుండా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

# వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

**శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ రామ మందిరం నందు**



మేళ్ళచెరువు/ హుజూర్నగర్ డిసెంబర్ 16 (వుదయం ప్రతినిధి): సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీ గోదా భూనీలా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం మరియు శ్రీరామ మందిరం నందు ధనుర్మాస ఉత్సవములు అత్యంత వైభవోపేతముగా ప్రారంభమైనాయి. ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా ఈరోజు ఉదయం 6:48 నిమిషాలకు విఘ్నేశ్వర పూజ,పుణ్యాహవాచనం, రక్షాబంధనం,తిరుప్పావై మొదటి పాశురం పారాయణం,స్వామివారికి విశేష పూజలు, నివేదన, నీరాజన మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాద వినియోగంలు జరిగినవి. అర్చకులు కొంకపాక రాధాకృష్ణమూర్తి శర్మ, నరగిరినాదుని రంగభట్టాచార్యులు,సుదర్శనం ప్రసాదాచార్యులు,యాతవాకిళ్ళ భాను కిరణ్ శర్మ, రామమందిరం వ్యవస్థాపక ధర్మకర్త చైర్మన్ నక్క.కొండారెడ్డి,కార్యనిర్వాహణాధికారి నాగెళ్ల.శంబిరెడ్డి, పోశం.వెంకటరెడ్డి దంపతులు,మాజీ సర్పంచ్ పందిళ్ళపల్లి.శంకర్ రెడ్డి దంపతులు, సిద్ధం.వెంకటరత్నం దంపతులు,భాస్కర్ రెడ్డి,శాగం రెడ్డి. శంగభిరెడ్డి,కర్నాటి.శంభిరెడ్డి, ఇరిగెల.లక్ష్మీ రామకృష్ణారెడ్డి, పూర్ణయ్య,వెంకటేశ్వర్లు, వీరభద్రరావు,శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం శంబయ్య, శ్రీను,రామారావు,గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

మంథని, డిసెంబర్16(వుదయం ప్రతినిధి): ఆశ వర్కర్ల సమస్యల సాధనకు పోరాటం చేస్తామని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి. జ్యోతి తెలిపారు. పెద్దపల్లిలో రాష్ట్ర బస్సు జాత గోడ ప్రతులను ఆవిష్కరించారు.

ఆశా వర్కర్ల రాష్ట్ర బస్సు జాత ఈనెల 17న పెద్దపల్లి జిల్లా కేంద్రానికి రానున్న సందర్భంగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జ్యోతి, వెంకటేశ్వరి, అరుణ, పద్మలు పాల్గొన్నారు.

## భగవాన్ తామేవార్ చిత్రపాఠనికి నివాళులు అర్పించిన వైన్స్ యాజమాన్యం..



కామారెడ్డి డిసెంబర్16(వుదయం ప్రతినిధి): బిచ్చుకుంద వైన్స్ యాజమాన్యం భగవాన్ తామేవార్ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు వర్ధంతి సందర్భంగా చిత్ర పాఠనికి నివాళులు అర్పించారు ఇ కార్యక్రమం లో వైన్స్ యాజమాన్యం ఉన్నారు..

# బాధిత కుటుంబానికి పరామర్శ



నడికూడ, డిసెంబర్ 16 (వుదయం ప్రతినిధి) నడికూడ మండలంలోని కంఠాత్మకూర్ గ్రామంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ తల్లి ఉపేంద్రమ్మ ఇటీవల మృతిచెందగా, ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ శనివారం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

వారి వెంట మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజం, జిల్లా అధ్యక్షుడు తాళ్ల రవీందర్, అమ్మగారి శ్యామ్, రావుల కిరణ్, సారంగపాణి, ప్రభాకర్, పులి రాజేష్, బుస్స మల్లేశం పాల్గొన్నారు.

# ప్రజల పిర్యాదులకు పరిష్కారం చూపాలి

**జిల్లా ఎస్పి కిరణ్ ఖరే**



జయశంకర్ భూపాలపల్లి డిసెంబర్ 16(వుదయం ప్రతినిధి) ప్రజల పిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి,చట్ట ప్రకారం పరిష్కారానికి చొరవ చూపాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పి కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దివాస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ప్రజల నుంచి పిర్యాదులు స్వీకరించి,వారితో ముఖాముఖి మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ప్రజాదివాస్ కార్యక్రమంలో 16 మంది బాధితులు పిర్యాదు చేయగా, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే తెలియ పరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఎస్పి అదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఆదేశించారు.

# నూతన గ్రంథాలయ భవనానికి కపిలవాయి పేరు పెట్టాలి

**జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం**



నాగర్ కర్నూల్ డిసెంబర్ 16(వుదయం ప్రతినిధి)జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనానికి కీర్తిశేషులు డాక్టర్.కపిలవాయి లింగమూర్తి పేరు పెట్టాలని వెన్నెల సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బడావత్ సంతోష్ కి సాహితీ సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది .కవితా కళానిధి శతాధిక గ్రంథకర్త డాక్టర్ కపిలవాయిలింగమూర్తి 1928 లో నాగర్ కర్నూల్ జిల్లాలో జన్మించి పరిశోధనా రంగంలో విశ్వ విద్యాలయాలు చేయాల్సిన పనిని ఒంటి చేతితో చేశారు. కవిగా పరిశోధకుడిగా పరిష్కర్తగా విలువైన పుస్తకాలను రాసి తన పరిశోధనల ద్వారా స్థానిక చరిత్రలను ఎన్నింటినో వెలికితీసి సమాజానికి అందించారని, ఎందరినో కవులను ప్రోత్సహించి చేయుత నందించి కృషిచేశారని, తెలుగుభాషకు అజరామరమైన సేవలందించారు. నూతనంగా నిర్మించే గ్రంథాలయ భవనానికి కపిలవాయి లింగమూర్తి గారి పేరును పెట్టాలని ప్రభుత్వాని వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో వెన్నెల సాహిత్య అకాడమీ అధ్యక్షులు ముచ్చర్ల దినకర్ ,నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షులు వనపట్ల సుబ్బయ్య గౌరవ అధ్యక్షులు కందికొండ మోహన్ తెలంగాణ సాహితీ అధ్యక్షులు వహీద్ ఖాన్ దళిత సమైఖ్య అధ్యక్షులు ఎదిరెపల్లి కాశన్నతదితరులు పాల్గోన్నారు

# కొత్తపేట గ్రామా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి గ్రామ కమిటీఏకగ్రీవ ఎన్నిక .

**ఏబిసిడి వర్గీకరణ పోరులో మాదిగలు ముందు ఉండాలి.**

**జిల్లా ఎంఎస్పీ జిల్లా నాయకులు.. నేరెళ్ల ఓదెలు మాదిగ .**



భూపాలపల్లి డిసెంబర్16(వుదయం ప్రతినిధి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోనిఎమ్మార్పీఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం చిట్యాల మండల అధ్యక్షులు దొడ్డ శంకర్ మాదిగ ప్రధాన కార్యదర్శి కాట్కూరి మొగిలి మాదిగ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెస్ పి జిల్లా నాయకులు నేరెళ్ల ఓదెలు మాదిగ విచ్చేసి మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నూతన గ్రామ కమిటీ నిర్మాణంలో భాగంగా గ్రామ కమిటీ లు నిర్మాణం కోసం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కమిటీ లు ఎం ఎస్ పి ఎమ్మార్పీఎస్ మహిళా కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని ఓదెలు మాదిగ అన్నారు మాలల కు కొమ్ముకాస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే స్పందించి ఏ బి సి డి వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా నాయకులు నేరెళ్ల ఓదెలు మాదిగ డిమాండ్ చేశారు లేనిపక్షంలో స్థానిక సంస్థల ఎలక్షన్లలో మాదిగలు కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడిస్తారని హెచ్చరించారు ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ కొత్తపేట.. ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు సావటి చంద్రయ్య. ఉపాధ్యక్షులు సావటి రామస్వామి. ప్రధాన కార్యదర్శి దొడ్డే సమ్మయ్య. కార్యదర్శి చావటి సదయ్య. సహాయ కార్యదర్శి. చిలువేరి రాజయ్య. సంయుక్త కార్యదర్శి అంకిల భద్రయ్య. కోశాధికారి ఎర్ర విజేందర్. ప్రచార కార్యదర్శి చిలువేరు భద్రయ్య. ముఖ్య సలహాదారులు సావటి నరసయ్య. సావటి సమ్మయ్య. మహిళా కమిటీ ఎంఆర్పిఎస్ కొత్తపేట. గ్రామ అధ్యక్షురాలు దొడ్డే నందిని. ఉపాధ్యక్షురాలు ఎర్ర సౌజన్య. ప్రధాన కార్యదర్శి ఎర్ర విజయ. కార్యదర్శి సిలివేరి రజిత. సహాయ కార్యదర్శి ఎర్ర సప్న. సంయుక్త కార్యదర్శి సావట్టి మౌనిక. కోశాధికారి అంకిల ఈశ్వరమ్మ. ప్రచార కార్యదర్శి సామటి లక్ష్మి. ఎంఎస్పి గ్రామ కమిటీ కొత్తపేట ఎన్నిక. ఎమ్మెస్పీ గ్రామ అధ్యక్షుడు సావటి భద్రయ్య. ఉపాధ్యక్షులు చిలివేరి కిషన్. ప్రధాన కార్యదర్శి దొడ్డే సదయ్య. కార్యదర్శి సావటి శీను. సహాయ కార్యదర్శి చిలువేరు కిరణ్.సంయుక్త కార్యదర్శి దొడ్డే నాగార్జున. కోశాధికారి కొయ్యల క్రాంతి. ప్రచార కార్యదర్శి సిలువేరు బిక్షపతి. ముఖ్య సలహాదారులు సావటి సారంగపాణి. సావటి ఓదెలు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎమ్మెస్ లుఅనుబంధ సంఘాలు పాల్గొన్నారు.

# గ్రూప్ 2 పరీక్షా కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి డిసెంబర్ 16(వఃదయం ప్రతినిధి) భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మాంటిసోరి, బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న గ్రూప్ 2 పరీక్షా కేంద్రాలను సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 17 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టిజిపిఎస్సి నిబంధనలు మేరకు పరీక్షా కేంద్రాలలోకి సెల్ ఫోన్ అనుమతి లేనికారణంగా నిబంధనలు పాటిస్తూ, కలెక్టర్ పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్లు తీసుకురావద్దన్న నియమాన్ని ఆయన పాటించారు. తన సెల్ ఫోన్‌ను వాహనంలోనే వదిలి వెళ్లి పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పర్యవేక్షణ, సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని ఇన్విజిలేటర్స్, చీఫ్ సూపరింటెండెట్లుకు సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో పరీక్ష సజావుగా, సక్రమంగా జరిగేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేశామని తెలిపారు. పరీక్ష పూర్తి అయ్యే వరకు అభ్యర్థులను బయటికి పంపొద్దని ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా నిరాటంకంగా సరఫరా చేస్తున్నామని తెలిపారు. అత్యవసర వైద్య సేవలకు అన్ని కేంద్రాల్లో అత్యవసర వైద్య సేవల కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సురక్షిత మంచినీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 4 సబ్జెక్ట్ లో గ్రూప్ 2 పరీక్ష ఉంటుందని మొదటి రోజు ఉదయం, సాయంత్రం అలాగే రెండో రోజు ఉదయం సాయంత్రం పరీక్ష నిర్వహస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. మాంటి సోరిలో పాటశాలలో 15 రూములు ఏర్పాటు చేశామని 360 మంది అభ్యర్థులు హాజరు కావల్సి ఉండగా 190 మంది హాజరు అయ్యారని, 170 మంది గైర్హాజరు అయ్యారని,బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ లో 12 రూములు ఏర్పాటు చేయగా 288 మంది అభ్యర్థులు హాజరు కావల్సి ఉండగా 144 మంది హాజరయ్యారని, 144 మంది గైర్హాజరయ్యారని,అలాగే భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 12 రూములు ఏర్పాటు చేయగా 288 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 116 హాజరయ్యారని,172 మంది గైర్హాజరు అయినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజిపిఎస్సి పర్యవేక్షకులు, చీఫ్ సూపరింటెండట్లు, రూట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# సీఎం కప్ క్రీడా పోటీలలో పాల్గొంటున్న జిల్లా క్రీడాకారులు మంచి నైపుణ్యాన్ని కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలి

**ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో రాణించే విధంగా శిక్షణ ఇవ్వడమే సీఎం కప్ క్రీడా పోటీల ముఖ్య ఉద్దేశ్యం**

**జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**



నల్లగొండ డిసెంబర్ 16(వుదయం ప్రతినిధి): సీఎం కప్ క్రీడా పోటీలలో పాల్గొంటున్న జిల్లా క్రీడాకారులు మంచి నైపుణ్యాన్ని కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. సోమవారం ఆమె నల్గొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో ఈనెల 16 నుండి 21 వరకు నిర్వహించనున్న సీఎం కప్ క్రీడా పోటీలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అంతేకాక సీఎం కప్ క్రీడా పోటీల ప్రారంభ సూచకంగా క్రీడా పథకాన్ని ఎగురవేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో రాణించే విధంగా శిక్షణ ఇవ్వడమే సీఎం కప్ క్రీడా పోటీల ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. అందువల్ల క్రీడాకారులు వారిలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆమె కోరారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి నర్సిరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారం తో క్రీడలని మరింత ముందుకు తీసుకొని వెళ్తాం!

## మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి





హుజుర్ నగర్ డిసెంబర్ 16 (వుదయం ప్రతినిధి):సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజక వర్గంలో
సీ యం ట్రోఫీని సిఐ చరమందరాజు తో మున్సిపల్ వైస్ చైర్మన్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారుల పరిచయ కార్యక్రమం అనంతరం మాట్లాడుతూ హుజూర్నగర్ నియోజకవర్గంలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సహాయ సహకారాలతో అత్యాధునిక హంగులతో ఇండోర్ స్టేడియం త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు వారు తెలిపారు. అలాగే సెలెక్ట్ అయిన విద్యార్థిని, విద్యార్థులు బేస్ బాల్ లో జిల్లాకి మంచి పేరు తీసుకురావాలని క్రీడల్లో క్రీడాకారులకు కావలసిన అన్ని సదుపాయాలు కల్పించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుండి నలుమూల నుంచి వచ్చిన క్రీడాకారులను సెలక్షన్ చేయడం జరిగింది. ఈ సెలక్షన్ల కొరకు 30 మంది బాలికలు ,40 మంది బాలురు, పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో డివైయస్ ఓ రామచంద్రం ,మరియు ఎస్జీఎఫ్ జిల్లా సెక్రటరీ ఆజాం బాబా గారు, హుజూర్నగర్ మండల విద్యాశాఖ అధికారి సైదానాయక్ గారు, గరిడేపల్లి మండల విద్యాశాఖ అధికారి చత్రు నాయక్ గారు, స్థానిక పాఠశాలప్రధానోపాధ్యాయులు నోడలించార్జ్ శ్రీనివాస్ రెడ్డి గారు, వ్యాయామ ఉపాధ్యాయులు విశ్వగ్న,జనార్దన్ రెడ్డి, శ్రీ కే సునీల్ కుమార్, హుస్సేన్, అంబేద్కర్ , సుభద్రలు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




చిట్యాల డిసెంబర్ 16(వుదయం ప్రతినిధి): నల్గొండ జిల్లా చిట్యాల మండలం లోని నేరడ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి 2005-06 పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో కలిసి ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, పరిపూర్ణ, గోపి, గోపాల కృష్ణ, హరీష్, బద్రి, ఉదయ్, సూచరిత, శోభ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ డే తో బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు...

### జిల్లా పోలీసు కార్యాలయంలో పలు ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



నల్లగొండ డిసెంబర్ 16(వుదయం ప్రతినిధి): ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 30 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని,పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా,నమ్మకం కలిగించాలని అన్నారు. ఎవరైనా చట్టవ్యతిరకమైన చర్యలు చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారి పట్ల కటినంగా వ్యవహరించాలని అన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

# భవన నిర్మాణ వ్యర్థాలతో భవాని నగర్ వాసులకు తిప్పలు.



కోదాడ టౌన్ డిసెంబర్ 16(వుదయం) కోదాడ పట్టణంలోని 19వ వార్డు భవాని నగర్ లో మధిర కృష్ణారెడ్డి వీధిలో ప్రజలు రాకపోకలు కొనసాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యంతో సిబ్బంది వీధిలో వేసిన భవన నిర్మాణ వ్యర్థాలు తొలగించకపోవడంతో అటుగా వెళుతున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ వీధిలో మట్టికి బదులుగా రాళ్లు దర్శనం ఇవ్వటంతో ఇది కోదాడ మున్సిపాలిటీలో భాగం కాదా అని అనుకుంటున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ వారు స్పందించి వ్యర్థాలను పోసిన వారిపై చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని ఆ వార్డు ప్రజలు కోరుతున్నారు.

# కోదాడ పట్టణ అభివృద్ధిలో సుబ్బరామయ్య కృషి అభినందనీయం

### మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు



కోదాడ టౌన్ డిసెంబర్ 16(వుదయం):కోదాడ మాజీ సర్పంచ్ సుబ్బరామయ్య పట్టణ అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు అన్నారు. సోమవారం సుబ్బరామయ్య వర్ధంతి సందర్భంగా పట్టణంలోని రాజీవ్ చౌక్ చౌరస్తాలో ఉన్న సుబ్బరామయ్య విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కోదాడ అభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. నేటి నాయకులు వారిని ఆదర్శంగా తీసుకొని వారు చూపిన బాటలో నడవాలి అన్నారు. వారి ఆశయాల సాధన కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మాజీ డిసిసిబి చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు,మాజీ సర్పంచ్ ఎర్నేని బాబు,కుటుంబ సభ్యులు వరప్రసాద్, నరసింహారావు, శివరామయ్య,తొండపు సతీష్, బాగ్దాద్,డేగ శ్రీధర్, రాయపూడి వెంకటనారాయణ, ఉప్పుగండ్ల శ్రీను,చంద్రశేఖర్,పతంగి శ్రీను,పాలూరి సత్యనారాయణ, కేశవులు,బషీర్,జానకి రామయ్య, చింతలపాటి శ్రీనివాసరావు, హబీబ్, సుబ్బారావు, సైదా నాయక్,ఆదమ్,పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు..

# రాష్ట్ర స్థాయి ప్రతిభ పరీక్షలో సత్తా చాటిన నాగభూషణ పాఠశాల విద్యార్థి

## అభినందించిన పాఠశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం





బాసర, డిసెంబర్16 (వుదయం ప్రతినిధి) తెలుగు ప్రతిభ పరీక్షలో బాసర విద్యార్థి రాష్ట్రస్థాయిలో తన ప్రతిభను చూపాడు. ఈ నేపథ్యంలో విద్యార్థిని అందరూ అభినందించారు. బాసర మండల కేంద్రంలోని శ్రీ నాగభూషణ విద్యాలయం పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి నేత్ర కిషోర్ ఈ నెల 13న హైదరాబాద్ లోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో మన సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు ప్రతిభ పరీక్ష పోటీల్లో రాష్ట్ర స్థాయిలో మొదట స్థానంలో నిలిచి సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ చేతులమీదుగా నగదు బహుమతితో పాటు, జ్ఞాపిక, ప్రశంసా పురస్కారం అందుకున్నాడు. దింతో సోమవారం నేత్రకిశోర్ ను పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ బాబురావు జారికొటే, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ సులోచన ఉపాధ్యాయులు అభినందించి శాలువతో సత్కరించారు. విద్యార్థి తండ్రి గుండెల్లి కృష్ణమూర్తిని శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థి తెలుగు ప్రతిభ పరీక్షలో స్టేట్ ఫస్ట్ రావడం మా పాఠశాలకు గర్వకారణం అని అన్నారు. తెలుగు భాష ఉపాధ్యాయులను అభినందించారు. తెలుగు భాష గొప్పదనం గురించి వివరించారు.

# నక్షబాట ఆక్రమణ పై న్యాయం చేయాలని తహసిల్దార్ కు ఫిర్యాదు



వెల్దండ డిసెంబర్ 16 (వుద యం ప్రతినిధి )మండల పరిధిలోని చొక్కనపల్లి గ్రామంలో పొలాలకు వెళ్లే నక్ష బాటను గ్రామానికి చెందిన కుడుముల లింగారెడ్డి నక్ష బాటను ఆక్రమించుకున్నాడని సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో ప్రజావాణిలో తహసిల్దార్ కార్తీక్ కుమార్ కు రైతులు కలిసి వినతి పత్రం అందించారు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నక్ష బాటను ఆక్రమించుకున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకొని బాటను పునరుద్ధరించాలని

పొలాలకు వెళ్లడానికి గత ఆరు నెలల నుండి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము తమకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు

వినతి పత్రం అందించిన వారిలో బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ శేఖర్ రెడ్డి రైతులు జంగయ్య యాదవ్ . శశిధర్ రెడ్డి. పెద్దయ్య . వెంకటయ్యతో పాటు తదితరులు ఉన్నారు

# రెండో రోజు ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

జనగామ, డిసెంబర్16(వుదయం ప్రతినిధి): జనగామ జిల్లా వ్యాప్తంగా సోమవారం రెండో రోజు గ్రూప్-2 పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జరిగిన తప్పిదాలు ఎదురు కాకుండా క్షుణ్ణంగా పరిశీలించి అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తున్నారు. స్థానిక పరీక్ష కేంద్రాల వద్ద ఎస్ఐల ఆధ్వర్యంలో పట్టిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# నర్సాపూర్ కాలనీ సమస్యలపై వినతి పత్రం అందజేత

నర్సాపూర్, డిసెంబర్16(వుదయం ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని 9వ, వార్డులో శ్రీ వెంకటేశ్వర కాలనీ మురుగునీరు కాలువ నిర్మాణం, తాగునీరు, విద్యుత్తు సరఫరా, సీసీ రోడ్లు తదితర సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాలీ సమస్యలపై మున్సిపల్ చైర్మన్ కు వినతి పత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# చిట్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడి గా జనగాం రవీందర్ ను ఏకగ్రీవంగా ఎన్నిక



నల్లగొండ డిసెంబర్ 16(వుదయం ప్రతినిధి): నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గం చిట్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడి గా తాళ్లవెల్లెంల మాజీ సర్పంచ్ జనగాం రవీందర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని గాదిరెడ్డి పల్లెలో జరిగిన క్లబ్ సభ్యుల సమావేశంలో ప్రధాన కార్యదర్శిగా రేగులగడ్డ నర్సింహ, కోశాధికారిగా కొల్లోజు శ్రీకాంత్, క్లబ్ బాధ్యులను ఎన్నుకు న్నారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ రేపాల మదన్మోహన్ మాట్లాడుతూ చిట్యాల క్లబ్ ఇంటర్నేషనల్ క్లబ్ జిల్లాలోనే ఉత్తమ క్లబ్ గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. సమావేశంలో డా. హరినాథ్, మురళీధర్ రెడ్డి, రామకృష్ణ, లక్ష్మ య్య, మాధవరెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, శ్రవన్ కుమార్, కరుణాకర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

## మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



కల్వకుర్తి డిసెంబర్ 16 (రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ నుముల రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం ఈ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ విమర్శించారు సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి తో కలిసి మాట్లాడారు ఏడాది పరిపాలన పూర్తయిన చెప్పిన ఆరోగ్యానికి పూర్తిస్థాయిలో అమలు కాలేదని ప్రధానంగా రెండు లక్షల రుణమాఫీ చేశామని చెబుతున్నారే కానీ రైతుల అకౌంట్లో డబ్బులు జమ కాలేదని ఇదే కాక రెండు లక్షల పైబడిన రుణాలు తీసుకున్న వారి రైతుల అకౌంట్లో ప్రభుత్వం చెల్లిస్తే మిగతా డబ్బులు రైతులే అప్పు చెల్లిస్తారని తెలిపారు 2 లక్షల రూపాయల పైబడిన రుణాలు తీసుకున్న రైతులు రెండు లక్షల పోగా మిగతా డబ్బులు మొదటనే చెల్లించాలని తిరకాసు పెట్టడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి న్యాయం చేయాలని కోరారు రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతుందని ముఖ్యమంత్రి, మంత్రులు లేకుండా హామీలు ఇస్తున్నారని ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాలన్నీ పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు సమావేశంలో టిఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు జంగిల్ యాదగిరి , మాజీ ఉప సర్పంచ్ నిరంజన్ పోలి అశోక్,, శంకర్ నాయక్,, బుంగ ముదిరాజ్, శ్రీను, వెంకటయ్య తదితరులు ఉన్నారు

# గణిత పోటీల్లో వివేకానంద స్కూల్ విద్యార్థులకు మొదటి రెండు ర్యాంకులు



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లావు దయం బ్యూరో బోడపాటి వరప్రసాద్ రామచంద్రపురం పట్టణంలోని శ్రీ వివేకానంద స్కూల్ విద్యార్థులు రామానుజన్ గణిత అకాడమీ నిర్వహించిన ప్రతిభా పోటీల్లో మొదటి ర్యాంకు మరియు రెండో ర్యాంకు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ సరోజినీ తెలిపారుకష్టపడి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నాలుగో తరగతి విద్యార్థిని ప్రకృతి మరియు ఆరవ తరగతి విద్యార్థి మానస్ లను కళాశాల ప్రిన్సిపాల్ మరియు యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించి భవిష్యత్తులో శ్రీ వివేకానంద స్కూల్ కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు

# ఇందిరమ్మ ఇల్లు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం...



పినపాక నియోజకవర్గం డిసెంబర్16(వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇల్లు సర్వే మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కాళీమాత ఏరియాలో మున్సిపాలిటీ అధికారులు ఇందిరమ్మ ఇల్లు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేస్తూ వారి కుటుంబ వివరాలు పూర్తిస్థాయిలో తెలుసుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొబైల్ యాప్ లో కుటుంబ డేటా మరియు ఫోటోలు ఎంట్రీ చేసి వారి సమక్షంలోనే యాప్ లో ఎంట్రీ చేయడం జరుగుతుందని తెలియజేశారు ప్రతి పేద కుటుంబానికి ఈ సర్వే ద్వారా ఇందిరమ్మ ఇల్లు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని తెలియజేశారు ఈ యొక్కకార్యక్రమంలో మున్సిపల్ అధికారులు శ్రీను, ఝాన్సీ ,ఇందిరమ్మ కమిటీ సభ్యులు నేల కుమారస్వామి,కర్రీ నగేష్ నాయుడు, సురేష్, లత, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్పారావు,గణేష్,చలముత్తు తదితరులు పాల్గొన్నారు

## చికిత్స పొందుతూ ఒకరు మృతి

ముథోల్, డిసెంబర్16 (వుదయం ప్రతినిధి) ముథోల్ మండల కేంద్రానికి చెందిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సంజీవ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని నాగార్జున నగర్ కు చెందిన శృంగారే దత్తా (65) ఆదివారం ఇంటి నుంచి బస్టాండ్ కు వెళ్తుండగా వెనక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స కోసం నిజామాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్టీసీ డ్రైవర్ పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఆయుర్వేద వైద్య శిభిరానికి స్పందన



బెల్లంపల్లి, డిసెంబరు16 (వుదయం ప్రతినిధి) బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి సహకారంతో సోమవారం మాతా రీసెర్చ్ సెంటర్, హైదరాబాద్ డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో గోలేటి టౌన్ షిప్ లోని సి.ఈ.ఆర్. క్లబ్ లో ఆయుర్వేద వైద్య శిభిరం నిర్వహించడం జరిగింది. ఉద్యోగులు, గ్రామస్తులను పరీక్షించి దీర్ఘకాలిక వ్యాదులైన కీళ్ళ, మోకాళ్ళ నొప్పులు, బి.పి. షుగర్, పక్షవాతము, అజీర్ణము, మలబద్ధకము, అస్తమా, స్త్రీల వ్యాధులు మొదలగు వాటికి మందులు అందజేశారు. ఎస్ఓ టూ జీఎం కె రాజమల్లు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతిలు వైద్య శిభిరాన్ని సందర్శించి పరీక్షలు చేయించుకున్నారు

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



ముథోల్:16డిసెంబర్(వుదయం ప్రతినిధి)ముథోల్ మండలంలోని విట్టోలి గ్రామా నికి చెందిన కాలేవార్ సాగర బాయి కుమారుడు ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో సోమవారం బైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో కాంగ్రెస్ పార్టీ నియోజ కవర్గ ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు ను బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పేద బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం ఎంతో కృషి చేస్తు న్నారని తెలిపారు. ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నా రు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రె డ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచా ర్జీ సీతక్క కు బాధిత కుటుంబ సభ్యు లు ధన్యవాదాలు తెలిపారు. ఈ కా ర్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఇంచార్జి రావుల గంగారెడ్డి,నాయకు లు రావుల శ్రీనివాస్, రమేష్, ఆత్మరా మ్, గంగారం,సాయినాథ్,కాలేవార్ దిగంబర్, గంగాధర్ తదితరులున్నారు.

## గుండాల అంబా రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు




వెల్దండ డిసెంబర్ 16 (వుద యం ప్రతినిధి)దక్షిణ కాశీగా విరజిల్లుతున్న వెల్దండ మండలం గుండాల అంబా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారము మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తినారు

ఈ సందర్భంగా భక్తులు కోనేరులో పుణ్యస్థానాలు ఆచరించి శివయ్య స్వామివారికి అభిషేకాలు పూజలు వ్రతాలు నిర్వహించారు కార్యక్రమంలో ఆలయ అర్చకులు శివప్రసాద్ శర్మ. సంతోష్ శర్మ నరహరి శర్మ. సురేష్ శర్మ తోపాటు భక్తులు ఉన్నారు

## అమ్మవారి ఆశీస్సులతో అభివృద్ధి చేస్తా

మునుగోడు, డిసెంబర్16(వుదయం ప్రతినిధి): చండంపేట మండలం కంబాలపల్లిలో రాత్రి జరిగిన మహాలక్ష్మమ్మ జాతర ఉ త్సవాలో ఎమ్మెల్యే బాలు నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలపై ఉ ండాలని, ఆ తల్లి ఆశీస్సులతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరసింహ,

మాధవరెడ్డి, సిరాజ్ ఖాన్, మాజీఎంపిపి సర్వయ్య, మల్లేష్ యాదవ్, దేవేందర్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపన్న హస్తం ఫౌండేషన్ పేరుతో సహాయం

మిర్యాలగూడ, డిసెంబర్16(వుదయం ప్రతినిధి): చందుపట్లకి చెందిన కొందరు యువత ఆపన్న హస్తం ఫౌండేషన్ పేరుతో ఆపదలో ఉన్న వారికి సోషల్ మీడియా వేదికగా కొంత డబ్బు సమాకూర్చి సహాయం కోసం చూస్తున వారికి అందజేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేము చేస్తున్న ప్రయత్నానికి సహకరిస్తున్నటువంటి ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి ఆ పన్న హస్తం ఫౌండేషన్ అండగా ఉంటుందని తెలిపారు.

## శ్రీ విక్రమభట్టీశ్వరస్వామి సేవలో బండారు శ్రీనివాస్

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వు దయం బ్యూరో బోడపాటి వరప్రసాద్

ఆలమూరు శ్రీ పార్వతీ సమేత భట్టీ, విక్ర%జ%మేశ్వర స్వామివారి ఆలయాన్ని సోమవారం జనసేన ఇన్చార్జి బండారు శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన బండారు శ్రీనివాస్ కు శైవాగమ పండితులు కాళ్ళకూరి సూరిపండు, నరేంద్రలు పూర్ణ కుంభంతో సాదర స్వాగతం పలికారు. 15 సంవత్సరాలుగా శివ ముక్కోటి సందర్భంగా భట్టీశ్వరునికి అన్నాభి షేకం జరవడం ఆనవాయితీగా ఉందని, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారని అర్చకులు బండారు శ్రీనివాస్ కు తెలిపారు. 2 వేల సంవత్సరాల నాటి వురాతన ఆలయాన్ని



దర్శించుకోవడం ఆనందదాయకమని బండారు శ్రీనివాస్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. భట్టీశ్వరునికి బండారు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విక్రమేశ్వరున్ని దర్శించుకున్న బండారు శ్రీనివాస్, ప్రముఖ పారిశ్రామికవేత్త వంటిపల్లి పాపారావు, ఆలమూరు జనసేన మండల అధ్యక్షులు సూరపరెడ్డి సత్య, కొత్తపెల్లి నగేష్, గారపాటి శ్రీనివాస్ చౌదరి, బండారు బాబి,వైట్ల సత్యనారాయణ, సిరినేడి పట్టాభి, చల్లా వెంకటేశ్వరరావు, చల్లా బాబి, కర్రీ సత్యనారాయణ, బలగం శివ, పట్టా రాజు, డిపి రావు, చీకట్ల సతీష్, రాజాని సుబ్రమణ్యం, వెంకటేష్ జనసేన నాయకులకు వేదమంత్రాలతో పండితులు వేదాశీర్వచనం తీర్థ ప్రసాదాలు అందించారు

## షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహాన్ని అందుబాటులోకి తీసుకురావాలి



బెల్లంపల్లి, డిసెంబరు16 (వుదయం ప్రతినిధి) తాండూరు మండలంలోని తాండూర్ బస్ స్టాప్ వద్ద గల షెడ్యుల్ కులాల బాలుర వసతి గృహ భవనాన్ని మరమ్మత్తులు చేయించి ఉ పయోగం లోకి తీసుకువచ్చి విద్యార్థుల సంఖ్య పెంచాలని అలాగే అద్దే భవనంలో కొనసాగుతున్న మహాత్మ జ్యోతిబాపూలే బాలుర పాఠశాలను

షెడ్యుల్ కులాల బాలుర వసతి గృహంలోకి మార్చాలని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు, ఫుడ్ కార్పొరేషన్ మెంబర్ ఆఫ్ ఇండియా పులుగం తిరుపతి, తెలుగుదేశం పార్టీ తాండూర్ మండల ఇంచ్చార్జి దాసరి శ్రీనివాస్ లు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూహైవే పక్కన ఈ బిల్డింగ్ ఖాళీగా ఉండటంతో అసాంఘిక కర్యకలాపాలకు అడ్డాగా మారుతోందని అక్క దక్కడ ప్రహరి గోడ సరిగా లేక పోవడంతో పందుల స్వైర విహారం తో పాటు పోకిరీలకు మందు బాబులకు అడ్డాగా మారిందన్నారు. అరకొర వసతుల నడుమ కొనసాగుతున్న మహాత్మ జ్యోతిబావూలే బాలుర పాఠశాలలో విద్యార్థులు 440 మంది, ఇక్కడ ఉండగా ఇంటర్ చదివే విద్యార్థులు 35 మంది తగినంత వసతి లేక చెన్నూరులో విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. ఎంజేపిని ఇక్కడకు తరలిస్తే తాండూర్ బస్టాండ్ ఆర్టీసీ బస్ స్టాప్ ఉంటుంది కాబట్టి పిల్లల తల్లిదండ్రులకు, ఉ పాధ్యాయులకు ప్రయాణ సౌకర్యం ఎంతగానో ఉ పయోగపడుతుందని అన్నారు.

గత మూడు సంవత్సరాల నుండి కొద్దిమంది విద్యార్థులతో నెట్టుకు వచ్చిన ఎం ప్రయోజనం లేదని ఇప్పుడు శాశ్వతంగా మూసివేశారు. అందువల్ల నిరుపయోగంగా ఉన్న షెడ్యుల్ కులాల బాలుర వసతి గృహంపాఠశాలకు అదనపు గదులను ఏర్పాటు చేసి చిన్న చిన్న మరమ్మత్తులు చేసి అందుబాటులోకి తీసుకువస్తే ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గుతుందని తెలియజేస్తున్నారు. ప్రస్తుతానికి శాశ్వత బిల్డింగ్ అయ్యేవరకు షెడ్యుల్ కులాల బాలుర వసతి గృహం బిల్డింగ్ ఎంతగానో ఉ పయోగపడుతుందని తదనంతరం జూనియర్ కాలేజీ కి కూడా ఉపయోగపడుతుందన్నారు. కలెక్టర్ చోరవ తీసుకొని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు 10 ఎకరాల స్థలం, బెల్లంపల్లి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలకు 20 ఎకరాల స్థలం కేటాయించి గురుకులలాలకు శాశ్వత భవనాలు నిర్మానాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీవీటిఈసి రాష్ట్ర నాయకులు మణిరాంసింగ్, ఎస్ ఎస్ పాండే,గైని తిరుపతి, యండి అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులతో కుమ్మక్కై సిమెంట్ ఫ్యాక్టరీకి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు.?

జయశంకర్ భూపాలపల్లి డిసెంబర్ 16(వుదయం ప్రతినిధి) అధికారులతో కుమ్మక్కై కాస్తులో ఉన్నా మా భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు వినతి పత్రం అందించినట్లు పలిమేల రైతులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు పలిమెల శివారులో గల 102 ఎకరాల భూమిపై గత 50 సంవత్సరాలుగా కాస్తు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమ భూములను తమకు తెలియకుండా సిమెంట్ ఫ్యాక్టరీ కి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని, గత 50 సంవత్సరాలుగా సర్వహక్కులు కలిగి అనుభవిస్తున్నామని తమకు



తెలియకుండా కొందరు సంబంధిత శాఖ అధికారులతో కుమ్మక్కై సిమెంట్ ఫ్యాక్టరీకి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయంలో కాకుండా సొంత అడ్డాలో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించారని, గత 50 సంవత్సరాలుగా కాస్తులు ఉన్న తమకు పట్టాలు రాకుండా అడ్డుపడుతూ అక్రమ రిజిస్ట్రేషన్ చేయించిన వారిపై చర్య తీసుకొని మా భూములను మాకు ఇప్పించేలా న్యాయం చేయాలని వినతి పత్రంలో విజ్ఞప్తి చేసినట్లు రైతులను ప్రకటనలో తెలిపారు.

## కొత్తకోటలో దత్త జయంతి ఉత్సవాలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే

దేవరకద్ర, డిసెంబర్16(వుదయం ప్రతినిధి): దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట పట్టణంలో దత్త జయంతి ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా అనఘాదేవి సమేత దత్తాత్రేయ స్వామి మూర్తులకు పరిమళ పుష్ప అర్చన, అభిషేకం కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు దత్తాత్రేయ గుడి ధర్మకర్త భీమ వెంకటరమణ ఎమ్మెల్యే కు స్వాగత సత్కారం చేశారు. కార్యక్రమంలో నాయకులు భక్తులు, మహిళలు, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-2 పరీక్షలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

నాగర్ కర్నూల్ డిసెంబర్ 16(వుదయం ప్రతినిధి)జిల్లాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్ 2 పరీక్షల్లో రెండోవ రోజు సోమవారం ఉదయం పెపర్ 3, మధ్యాహ్నం పేపర్ 4 నిర్వహించగా గ్రూప్-2 పరీక్షలు పకడ్బందీగా ప్రశాంతంగా ముగిసినట్లు కలెక్టర్ తెలిపారు.సోమవారం ఉదయం నాగర్ కర్నూల్ పట్టణంలోని సాధన డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న రెండోవ రోజు గ్రూప్-2 మూడవ పేపర్ పరీక్షా కేంద్రాన్ని నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా సందర్శించి, పరీక్ష జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, మాట్లాడుతూ... ఆది, సోమవారాల్లో రెండు రోజులపాటు నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణ సందర్భంగా(32) పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు 144 సెక్షన్ అమలు



చేశారన్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఏర్పాటు చేసిన 32 పరీక్ష కేంద్రాల్లో గ్రూప్ 2 పరీక్షలను పకడ్బందీగా ప్రశాంతంగా కొనసాగిందని కలెక్టర్ తెలిపారు.జిల్లాలోని 32 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 9731 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా సోమవారం పేపర్ 3 కు ఉదయం 4699 మంది హాజరయ్యారన్నారు. 5032 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరు అయ్యారని, 48శాతం హాజరు శాతం నమోదు అయినట్లు కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన 4వ పేపరుకు 4699 మంది అభ్యర్థులు హాజరు కాగా 5032 మంది అభ్యర్థులు గైర్హాజరు అయినట్లు తెలిపారు. జిల్లాలో గ్రూప్-2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు.మొత్తంగా జిల్లాలో రెండు రోజులుగా జరిగిన గ్రూప్-టు పరీక్షల్లో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలియజేశారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

**వచ్చే వారం నాటికి అన్ని శాఖలు సాధ్యమైనంత ఎక్కువ ఫిర్యాదులను పరిష్కరించాలి**

**జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా అధికారులతో ప్రజావాణి ఫిర్యాదులపై సమీక్ష**

నల్లగొండ డిసెంబర్ 16(వుదయం ప్రతినిధి): ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా అధికారులతో ప్రజావాణి ఫిర్యాదులపై ఆమె సమీక్షించారు. రెవిన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్, వ్యవసాయ తదితర శాఖల వద్ద ఫిర్యాదులు ఎక్కువగా పెండింగ్లో ఉ న్నాయని, ఈ శాఖల అధికారులు ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పరిష్కరించాలని చెప్పారు. ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కరించాలని, ముఖ్యంగా ఫిర్యాదుల పరిష్కారం వేగంగా ఉ ండాలని అన్నారు. వచ్చే వారం



నాటికి అన్ని శాఖలు సాధ్యమైనంత ఎక్కువ ఫిర్యాదులను పరిష్కరించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సంవత్సరం క్రిస్మస్ వేడుకలలో భాగంగా అన్ని నియోజకవర్గాలలో క్రిస్మస్ వేడుకల సందర్భంగా విందు ఏర్పాటు చేయాలని, ఇందుకు సంబంధించి ఆర్డీవోలు, తహసిల్దారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఎవరైనా కొత్తగా దరఖాస్తులు ఇస్తే ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాల్లో తీసుకోవాలని, గతంలో దరఖాస్తు చేసుకున్న వారు తిరిగి దరఖాస్తు చేసుకోకూడదని ఆమె కోరారు. కాగా ఈ సోమవారం (50) మంది ఫిర్యాదు దారులు వారి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ కు సమర్పించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డిఆర్ఓ అమరేందర్, జెడ్పిసిఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి హాజరయ్యారు.

## మరణం లేని మనిషి మంచాల తిరుపతి.!

**– నేదునూరి జ్యోతి**



హనుమకొండ, డిసెంబర్ 16(వుదయం జిల్లా ప్రతినిధి) : రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమాజంలో వర్గ పోరాటము తీవ్రతరం అవుతున్న దశలో యవ్వనములో మావోయిజం వైపు ఆకర్షింపబడి మిలిటెంట్గా భూస్వాముల దౌర్జన్యాలపై పోరాడిన విప్లవ వీరుడు మరణము లేని మనిషి మంచాల తిరుపతి అని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి తెలిపారు సోమవారం రోజున ముల్కనూరు మండలం వంగర గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన మంచాల తిరుపతి ఘనంగా నివాళులర్పించి అనంతరం మాట్లాడుతూ తెలంగాణలో దొరల భూస్వాముల ఆగడాల నుండి ప్రజలను రక్షించడానికి మావోయిజానికి ప్రభావితమై అనేక ప్రజాహిత పోరాటకార్యక్రమాలు నిర్వహించిన నీతి నిజాయితీ నిబద్ధత కలిగిన గొప్ప కమ్యూనిస్టు. నాయకుడు తిరుపతి అని తెలిపారు తిరుపతి సహచరురాలు రమాదేవి కూడా మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారని తెలిపారు రమ తిరుపతి ల ఆదర్శ వివాహం1999లో సురవరం సుధాకర్ రెడ్డి దేశిని చిన్న మల్లయ్య చాడ వెంకటరెడ్డి చిన్నమనేని రాజేశ్వరరావు గార్ల సహకారంతో ఆదర్శ వివాహం చేసుకొని నేటికీ కమ్యూనిస్టు ఉద్యమంలో కొనసాగడాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు మంచాల తిరుపతి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షునిగా యువజన సంఘం కరీంనగర్ ఉమ్మడి జిల్లా నాయకునిగా ప్రస్తుతం హనుమకొండ జిల్లా సమితి సభ్యునిగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులుగా కొనసాగుతున్న నేపథ్యంలో పేదరికం ప్రభుత్వము కాటు వేసి నందున తిరుపతి మరణానికి ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నప్పటికీ ఈ వ్యాధికి వర్తించదని చెప్పినందువల్ల హాస్పిటల్ నుండి నెట్టివేయబడి పేదరికం పర్యవసరంగా తిరుపతి అమరత్వం పొందినాడని ఆవేదన వ్యక్తం చేశారు తిరుపతి మరణానికి ప్రభుత్వం బాధ్యత వహించి 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు వంగర గ్రామంలో భూ పోరాటాలు కొనసాగిస్తూ కోర్టు కేసులను ఎదుర్కొన్నారు పేద దళిత కుటుంబంలో పుట్టినప్పటికీ పేదల కోసం పని చేస్తున్నటువంటి ఎర్రజెండా ఎత్తి పట్టి పేద ప్రజలకి హక్కులు సాధించి పెట్టాలని కుటుంబాన్ని త్యాగం చేసి పార్టీలో ఇరువురు కొనసాగడం మరెందరికో ఆదర్శమని తెలిపారు ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం భోజనం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గడ్డం లలిత, హుస్నాబాద్ నియోజకవర్గ టిఆర్ఎస్ అధికార ప్రతినిధి ఏలేని మల్లికార్జున్ రెడ్డి, బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకులు నేదునూరి రాజమౌళి సిద్దిపేట జిల్లా మహిళా సమఖ్య అధ్యక్షురాలు గూడ పద్మ తిరుపతి సహచరురాలు రమాదేవి కూతురు త్రివర్ణ లోహిత కుమారుడు త్రిలేఖ టిఆర్ఎస్ నాయకులు గోపగోని అరవిందు పాల్గొనే నివాళులర్పించారు




# బిజినెస్




# పేరుకే మూడు చక్రాల బుల్లి కారు.. కానీ ఫీచర్లు తెలిస్తే మాత్రం దిమ్మతిరగాల్సిందే!

మరికొద్ది రోజుల్లోనే మూడు చక్రాలు కలిగిన బుల్లి ఎలక్ట్రిక్ కారు మార్కెట్లోకి విడుదల కానుంది. కారు చిన్నదే అయినప్పటికీ ఫీచర్లు మాత్రం ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఎక్కువ శాతం సామాన్య అలాగే మధ్య తరగతి కుటుంబాలు ఎక్కువగా ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ మధ్యతరగతి కుటుంబాలలోని వ్యక్తులు ఎక్కువ శాతం మోటార్ సైకిల్స్ ని వినియోగిస్తూ ఉంటారు. కారు కొనుగోలు చేసే అంత స్తోమత ఉండదు. కొంతమంది చిన్న చిన్నగా డబ్బులు పొదుపు చేసుకొని బడ్జెట్ ధరలో ఉండే కార్లను కొనుగోలు చేయాలని చూస్తూ ఉంటారు. ఇలా కార్లను కొనుగోలు చేయలేని వారు బస్సులు, రైళ్లు తదితర ప్రయాణ సాధనలపై ఆధారపడతారు. ఇక అత్యవసర సమయంలో ప్రయాణానికి ఇబ్బందులు ఎదురవుతాయి. ఇలాంటి వారందరి కోసం తక్కువ ధరలో ఎలక్ట్రిక్ కారు అందుబాటులోకి వచ్చింది. స్ట్రోమ్ ఆర్3 పేరుతో విడుదలైన ఈ కారును ఒక్కసారి రీచార్జి చేస్తే సుమారు 200 కిలోమీటర్లు ప్రయాణం చేయవచ్చుట. ఈ కారు చూడడానికి చిన్నగా మూడు చక్రాలతో ఉన్నప్పటికీ ఈ కారు ఫీచర్లు మాత్రం ప్రతి ఒక్కరిని ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. కాగా స్ట్రోమ్ ఆర్3 పేరుతో విడుదల చేసిన ఈ కారుకు మూడు చక్రాలు ఉంటాయి. స్ట్రోమ్ ఆర్3 ఎలక్ట్రిక్ కారు ధర రూ. 4.5 లక్షలు మాత్రమే. దీన్ని ఒక్కసారి రీచార్జి చేస్తే దాదాపుగా 200 కిలో మీటర్ల రేంజ్ ని అందిస్తుందట. దీనిలో శక్తివంతమైన ఎలక్ట్రిక్ బ్యాటరీ, అధిక సామర్థ్యం కలిగిన మోటార్లను ఏర్పాటు చేశారు. ఈ కారుకు రెండు డోర్లు ఏర్పాటు చేశారు. మూడు చక్రాలు అమర్చారు. ఆకర్షణీయమైన డిజైన్, చిన్న బానెట్, విశాలమైన ఎయిర్ డ్యామ్, ఎల్ ఈడీ లైట్లు, డ్యూయల్ టోన్, సన్ రూఫ్ వంటి ఫీచర్స్ యూజర్స్ ని బాగా ఆకట్టుకుంటున్నాయి. ఈ బుల్లి ఎలక్ట్రిక్ కారు పొడవు 2907, వెడల్పు 1405, ఎత్తు 1572, గ్రౌండ్ క్లియరెన్స్ 185 మి.మీలుగా ఉన్నాయి. కారు మొత్తం బరువు 550 కిలోలు ఉంటుంది. దీనికి 13 అంగుళాల స్టీల్ వీల్స్ అమర్చారు. స్ట్రోమ్ ఆర్ 3 కారు ఇంకా మార్కెట్ లోకి విడుదల కాలేదు. దీనికి తుది మెరుగులు దిద్దడంలో కంపెనీ బిజీగా ఉంది. అవన్నీ పూర్తయ్యాక, పరీక్షలు జరిపి, ఎలాంటి లోటుపాట్లు లేవని నిర్ధారణ అయిన తర్వాత కారును మార్కెట్ లోకి విడుదల చేయనున్నారు. ఈ సరికొత్త ఎలక్ట్రిక్ కారుకు ప్రజల ఆదరణ బాగుంటుందని భావిస్తున్నారు.



సామాన్యులకు కూడా అందుబాటు ధరలో లభించడం, మెరుగైన రేంజ్ కారణంగా అందరికీ దీనిపై ఆసక్తి నెలకొంది. అలాగే డిజైన్ కూడా చాలా అద్భుతంగా ఉంది. మూడు చక్రాలలో చాలా అందంగా తీర్చిదిద్దారు. మరి ఈ కారును మార్కెట్లోకి వచ్చిన తర్వాత వినియోగదారులను ఏ మేరకు మెప్పిస్తుందో చూడాలి మరి.



## విశాఖ మార్కెట్లో ధరతి బ్రో ఎలక్ట్రిక్ వాహనం

విశాఖపట్నం కేంద్రంగా నిర్మితమైన ఎలక్ట్రికల్ వాహనం ధరతి బ్రోను ఆదివారం ధరతి గ్రీన్ ప్రయివేట్ లిమిటెడ్ చైర్మన్ అండ్ ఎండి డాక్టర్ డి జైభారత్ విడుదల చేశారు. విశాఖపట్నం సిరిపురంలోని ఓ హొటల్‌లో జరిగిన వాహన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ తమ వాహనం ప్రత్యేకమైన డిజైన్ కలిగి, ప్లాస్టిక్ భాగాలు లేకుండా పూర్తి మెటల్ బాడీతో నిర్మితమైందని చెప్పారు. 2.2 కిలోవాట్ల పీక్ పవర్ బిఎల్డిసి మోటార్ 2.4 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్‌తో వంద కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుందని తెలిపారు. భారతదేశంలో మొదటిసారిగా ద్విచక్ర వాహనంలో రైడర్, పిలియన్ రైడర్‌కు ఒక మీటరు పొడవు ఫుట్ రెస్ట్‌తో వస్తుందని వివరించారు. పార్కింగ్, 3-స్పీడ్ మోడ్స్ (ఎకో, నార్మల్, స్పోర్ట్), క్రూస్ మోడ్, రివర్స్ మోడ్, వాక్ అసిస్ట్ మోడ్, పవర్ సేవింగ్ మోడ్, సైడ్ స్టాండ్ సెన్సార్, యాంటీ థెఫ్ట్, డౌన్ హిల్, అప్-హిల్, స్టాల్-హాల్ట్, రీజెనరేటివ్ బ్రేకింగ్, రీజెనరేటివ్ థ్రోటిల్, హిల్ అసిస్ట్, యుఎస్‌బి ఛార్జింగ్, సిబిఎస్ ఫీచర్లతో మార్కెట్లో లభిస్తుందని ఆయన తెలిపారు.

## పెట్రోలు ధరల టెన్షన్‌కు ఇక టాటా..



కొత్త కారును కొనుగోలు చేయాలనే కోరిక చాలామందికి ఉంటుంది. అయితే పెరుగుతున్న పెట్రోలు ధరలు వారిని వెనక్కులాగుతూ ఉంటాయి. వాటి కారణంగా కారును సక్రమంగా నిర్వహించలేమేమోననే భయం వెంటాడుతుంది. ఇలాంటి వారందరి కోసం సీఎన్ జీ కార్లు అందుబాటులోకి వచ్చాయి. కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్జీ)తో ఇవి నడుస్తాయి. పెట్రోలుతో పోల్చితే సీఎన్జీ ధర తక్కువగా ఉంటుంది. అత్యవసర సమయంలో పెట్రోలుతో కూడా నడిచేలా వీటిని రూపొందించారు. ఈ నేపథ్యంలో రూ. 8 లక్షల ధరలో అందుబాటులో ఉన్న ప్రముఖ కంపెనీల బెస్ట్ సీఎన్జీ కార్లు ఇవే. టాటా పంచ్ లోని బేస్ మోడల్ పెట్రోలు కారు ధర రూ. 6.12 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. దీనిలో రెండు సీఎన్జీ వేరియంట్లు అందుబాటులో ఉన్నాయి. సీఎన్జీ బేస్ ప్యూర్ వేరియంట్ రూ. 7.22 లక్షలు, అడ్వెంచర్ సీఎన్జీ వేరియంట్ రూ. 7.94 లక్షలు పలుకుతుంది. టాటా పంచ్ సీఎన్జీ కారు 6000 ఆర్పీఎం వద్ద 72.4 బీహెచ్పీ, 3250 ఆర్పీఎం వద్ద 103 ఎన్ఎం టార్కును విడుదల చేస్తుంది. 3.5 అంగుళాల ఇన్ స్ట్రుమెంట్ క్లస్టర్, నాలుగు స్పీకర్ల ఆడియో సెటప్ తదితర ప్రత్యేకతలు ఉన్నాయి. హ్యుందాయ్ గ్రాండ్ ఐ10 నియోస్ 1.2 ఎంటీ డ్యూయల్ సీఎన్జీ మాగ్నా వేరియంట్ రూ. 7.75 లక్షలకు అందుబాటులో ఉంది. ఇది 6000 ఆర్పీఎం వద్ద 68 బీహెచ్పీ, 4000 ఆర్పీఎం వద్ద 95.1 ఎన్ఎం టార్కును విడుదల చేస్తుంది. 3.5 అంగుళాల ఇన్ స్ట్రుమెంట్ క్లస్టర్, యూఎస్బీ టైప్ సీ ఫాస్ట్ చార్జర్, అడ్జెస్టబుల్ డ్రైవర్ సీటు తదితర ప్రత్యేకతలు ఉన్నాయి. మాన్యువల్ తో కూడిన బేస్ పెట్రోలు వేరియంట్ రూ. 5.92 లక్షలకు అందుబాటులో ఉంది. మారుతీ సుజకీ సెలెరియో వీఎక్స్ఐ సీఎన్జీ వేరియంట్ రూ. 6.73 లక్షలకు (ఎక్స్ షోరూమ్) అందుబాటులో ఉంది. దీనిలో 1.0 లీటర్ కే సిరీస్ సీఎన్ జీ ఇంజిన్ ఏర్పాటు చేశారు. దీని నుంచి 5300 ఆర్పీఎం వద్ద 55.9 బీహెచ్పీ, 3400 ఆర్పీఎం వద్ద 82.1 ఎన్ఎం టార్క్ విడుదల అవుతుంది. డ్యూయల్ ఎయిర్ బ్యాగులు, ఈబీడీతో కూడిన ఏబీఎస్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్ తదితర ప్రత్యేతకలు ఉన్నాయి. దీనిలోని పెట్రోలు వేరియంట్ రూ. 5.36 లక్షలు పలుకుతోంది. టాటా ఆల్ట్రోజ్ బేస్ పెట్రోలు కారు వేరియంట్ రూ. 6.49 లక్షలు, బేస్ సీఎన్ జీ వేరియంట్ రూ. 7.44 లక్షలకు అందుబాటులో ఉంది. సీఎన్ జీ కారును ఎనిమిది రకాల వేరియంట్లలో తీసుకువచ్చారు.

## మరో 15 రోజుల్లో హొండా ఈవీ స్కూటర్ల బుకింగ్స్ షురూ

ప్రపంచవ్యాప్తంగా ఇటీవల కాలంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం బాగా పెరిగింది. ముఖ్యంగా మధ్య తరగతి ప్రజలు పెరుగుతున్న పెట్రోల్ ధరల నుంచి రక్షణకు ఈవీ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో టాప్ కంపెనీల నుంచి స్టార్టప్‌ల వరకు ఈవీలను రిలీజ్ చేస్తున్నాయి. తాజాగా ప్రముఖ కంపెనీ హొండా ఈవీ రంగంలోకి అడుగుపెడుతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. హొండా మోటార్ సైకిల్ స్కూటర్ ఇండియా ఇటీవల హొండా యాక్టివా-ఈ, క్యూసీ-1 అనే రెండు ఎలక్ట్రిక్ స్కూటర్లను రిలీజ్ చేసిన విషయంలో తెలిసిందే. ఈ రెండు స్కూటర్లను నవంబర్ 27, 2024న బెంగళూరులో ప్రకటించారు. అయితే తాజాగా ఈ స్కూటర్ల బుకింగ్స్ గురించి హొండా ప్రతినిధులు క్లారిటీ ఇచ్చారు. ఈ రెండు స్కూటర్ల బుకింగ్‌లు జనవరి 1, 2025న ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. అలాగే ఈ స్కూటర్ల డెలివరీలు మాత్రం ఫిబ్రవరి 2025లో ప్రారంభం కానున్నాయని వివరించారు. ఇక ఫీచర్ల విషయానికి వస్తే యాక్టివా-ఈ స్కూటర్ రిమూవబుల్ బ్యాటరీ మేకానిజంతో వస్తుంది. యాక్టివా -ఈ స్కూటర్ రెండు 1.5 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీలతో వస్తుంది. ఒక్కో ఛార్జ్‌కు 102 కిలోమీటర్ల పరీక్ష పరిధిని అందిస్తుంది. ఈ బ్యాటరీలను ప్రస్తుతం బెంగళూరు, ఢిల్లీలో అందుబాటులో ఉన్న హొండా పవర్ ప్యాక్ ఎక్స్ఛేంజర్ స్టేషన్లలో మార్చుకోవచ్చు. యాక్టివా-ఈ స్కూటర్ 6 కేడబ్ల్యూ గరిష్ట శక్తిని, 22 ఎన్ఎం టార్క్‌ను అందించే ఎలక్ట్రిక్ మోటారు ద్వారా శక్తిని పొందుతుంది. ఈ స్కూటర్ 7.3 సెకన్లలో 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందని హొండా ప్రతినిధులు చెబుతున్నారు. గంటకు 80 కిలోమీటర్ల గరిష్ట వేగాన్ని చేరుకోగలదు. ఈ స్కూటర్ హొండాకు సంబంధించిన



రోడ్ సింక్ డుయో అప్లికేషన్ ద్వారా నావిగేషన్, అప్‌డేట్‌ల కోసం కనెక్టివిటీ ఫీచర్‌లతో కూడిన 7 అంగుళాల డిజిటల్ స్క్రీన్‌తో ఆకర్షణీయంగా ఉంటుంది. హొండా క్యూసీ-1 స్కూటర్ ఫిక్స్‌డ్ 1.5 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్‌తో వస్తుంది.

ఈ స్కూటర్‌ను ఓ సారి చార్జ్ చేస్తే 80 కిలోమీటర్ల పరిధిని అందిస్తుంది. స్కూటర్‌ను ఆఫ్-బోర్డ్ ఛార్జర్‌ని ఉపయోగించి ఇంట్లో ఛార్జ్ చేయవచ్చు. ఈ స్కూటర్ 80 శాతం ఛార్జ్‌ని చేరుకోవడానికి సుమారు 4.5 గంటలు, పూర్తి ఛార్జ్‌కి 6.5 గంటలు పడుతుంది. క్యూసీ-1 స్కూటర్ గంటకు 50 కిలోమీటర్ల గరిష్ట వేగాన్ని కలిగి ఉంటుంది. ఈ స్కూటర్ రెండు రైడింగ్ మోడ్‌లను కలిగి ఉంటుంది. ఇది అవసరమైన సమాచారం కోసం చిన్న 5 అంగుళాల ఎల్‌సీడీ స్క్రీన్, మొబైల్ ఛార్జింగ్ కోసం యూఎస్‌బీ టైప్-సీ పోర్ట్‌తో ఆకర్షణీయంగా ఉంటుంది. ఈ రెండు స్కూటర్లు మొదట్లో బెంగళూరు, ఢిల్లీ, ముంబైతో సహా ఎంపిక చేసిన నగరాల్లో అందుబాటులో ఉంటాయి.

## గోల్డ్ లవర్స్‌కి అదిరిపోయే న్యూస్.. తగ్గిన బంగారం ధర

దేశ వ్యాప్తంగా బంగారం వెండి ధరలు పెరుగుతూ, తగ్గుతూ ఉంటాయి. ప్రస్తుతం బంగారం, వెండి ధరలు కూడా ఇదే బాటలో పయణిస్తున్నాయి. మొన్నటి వరకు పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు, క్రమంగా తగ్గుతున్నాయి. ఈ రోజు ఉదయం దేశ వ్యాప్తంగా నమోదైన రేట్లు ఎలా ఉన్నాయో ఓసారి చూద్దాం. గోల్డ్ లవర్స్‌కి అదిరిపోయే న్యూస్ వచ్చింది. కొంతకాలంగా పెరుగుతూ షాకిస్తోన్న బంగారం ధరలు, ఎట్టకేలకు దిగివస్తున్నాయి. దీంతో బంగారం కొనేందుకు సరైన సమయం ఇదే నంటున్నారు



నిపుణులు. గత రెండు రోజులుగా బంగారం ధరలు భారీగా తగ్గాయి. ఇవాళ సోమవారం రూ. 10 మేరకు బంగారం ధర తగ్గింది. దేశంలో వివిధ నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో ఓసారి చూద్దాం. ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 71,540గా ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 78,030గా నమోదైంది. ఇక కోల్‌కతాతో పాటు చెన్నై, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 71,390గా నమోదవ్వగా, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 77,880గా ఉంది. మరోవైపు వెండి కూడా బంగారం బాటలో నడుస్తోంది. గత రెండు రోజులుగా వెండి రేట్లు రూ. 4100 మేరకు తగ్గాయి. హైదరాబాద్, కేరళ, చెన్నైలో కిలో వెండి రూ. 99,990లుగా నమోదవ్వగా.. ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు, ముంబైలో కేజీ వెండి ధర రూ. 92,400లుగా కొనసాగుతోంది.

# జాతీయం - అంతర్జాతీయం



## ప్రజల జీవనోపాధులపై కేంద్రం దాడి

న్యూఢిల్లీ: రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ ప్రజల జీవనోపాధులపై అనునిత్యం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ విమర్శించారు. సిపిఎం రాజస్థాన్ రాష్ట్ర 24వ మహాసభలో ఆమె ప్రసంగించారు. హనుమాన్‌నగర్‌లో సీతారాం ఏచూరి నగర్, బ్రిజ్‌లాల్ బదు మంచ్, బిజ్లా సింగ్ ఆడిటోరియంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ మహాసభలో ఆమె మాట్లాడుతూ.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో నేర్చుకున్న గుణపాఠాలను విస్మరించి, ఆర్‌ఎస్‌ఎస్ విభజన రాజకీయాలను ముందుకు తీసుకెళ్లడంపైనే బిజెపి దృష్టి నిలిపిందని విమర్శించారు. ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం -1991కి విరుద్ధంగా దేశవ్యాప్తంగా అనేక చోట్ల ముస్లింలు, ఇతర మైనార్టీలకు చెందిన ప్రార్థనా స్థలాల ప్రాంగణాల్లో హిందూ ఆలయాల ఆనవాళ్లు ఉన్నాయన్న ప్రచారంతో సంఘ్ పరివార్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని, మత వైషమ్యాలను రెచ్చగొడుతోందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో సహా రాజ్యాంగ పదవుల్లో ఉన్న బిజెపి నేతలు, దానితో అనుబంధమున్న అనేక మంది ప్రజలను విభజన రాజకీయాల చట్రంలో బంధించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగంపై నీతులు వల్లె వేస్తున్న ప్రధాని మోడీకి కార్చిచ్చులా హింసాకాండతో రగులిపోతున్న మణిపుర్‌ను సందర్శించే తీరిక లేకపోవడం సిగ్గుచేటు అని బృందాకరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సహజ వనరులను, జాతి సంపదను బడా కార్పొరేట్ మిత్రులకు కట్టబెట్టి..దేశాన్ని మాంద్యం దిశగా దేశాన్ని నెట్టేస్తున్నారని తప్పుబట్టారు. వినాశకరమైన కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే ప్రజలు సమస్యల వలయంలో చిక్కుకున్నారని, వీటి పరిష్కారం కోసం విశాల ప్రతిఘటనా పోరాటాలే మార్గమని ఆమె పిలుపునిచ్చారు. మహాసభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు విజు కృష్ణన్ కూడా ప్రసంగించారు.

## 'జమిలి' బిల్లులపై వెనక్కి తగ్గిన కేంద్రం

న్యూఢిల్లీ : జమిలి ఎన్నికలకు సంబంధించి లోక్‌సభలో సోమవారం రెండు బిల్లులు ప్రవేశపెట్టాలని నిర్ణయించిన నరేంద్ర మోడీ ప్రభుత్వం గంటల వ్యవధిలోనే వెనక్కి తగ్గింది. ఈ వారం చివరలో ఈ బిల్లులు సభ ముందుకు వచ్చే అవకాశం ఉన్నదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇతర కార్యక్రమాలు చేపట్టడానికి ముందు గ్రాంట్లకు సంబంధించిన తొలి అనుబంధ డిమాండ్లకు సభ ఆమోదం పొందాలని ప్రభుత్వం భావిస్తోందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నదని ఆ వర్గాలు వివరించాయి. ఈ నెల 20న పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగుస్తాయి. లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదనను అనేక ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. బిల్లులను ప్రవేశపెట్టే దశలోనే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయాలని ఆ పార్టీలు యోచిస్తున్నాయి. సోమవారం చేపట్టబోయే సభా కార్యక్రమాలను లోక్‌సభ వెబ్‌సైటులో ప్రచురించారు. దీని ప్రకారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 129వ రాజ్యాంగ సవరణ బిల్లును, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లును సభలో ప్రవేశపెట్టాల్సి ఉంది. జమిలి ఎన్నికల నిర్వహణకు వీలుగా ఈ రెండు బిల్లులను రూపొందించారు.

అయితే ఆశ్చర్యకరంగా కొన్ని గంటల వ్యవధిలోనే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. దిగువ సభ వెబ్‌సైటులో సవరించిన సభా కార్యక్రమాలను పోస్ట్ చేశారు. తొలుత ప్రచురించిన కార్యకలాపాల జాబితా ఉండి ఈ రెండు బిల్లులను తొలగించారు. బిల్లులను ముందుగా సభలో ప్రవేశపెట్టి, ఆ తర్వాత సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపుతారని తొలుత వార్తలు వచ్చాయి. సభలో చేపట్టే కార్యక్రమాల నుండి ఈ రెండు బిల్లులను తొలగించినప్పటికీ నిబంధనల ప్రకారం అనుబంధ జాబితా ద్వారా వాటిని ప్రభుత్వం సోమవారం సభలో ప్రవేశపెట్టవచ్చు.

## అంగన్‌వాడీలపై మోయలేని పని భారం !

న్యూఢిల్లీ : ప్రాథమిక విద్యాభ్యాసానికి ముందు అంటే ఒకటవ తరగతిలో చేరడానికి ముందే చిన్నారుల సంరక్షణ, విద్య (ఈసీసీఈ)పై జాతీయ విద్యా విధానం-2020 దృష్టి సారించింది. ఈ విధానాన్ని గతంలో ఎన్నడూ అనుసరించలేదు. చిన్నారుల వయసు ఆరు సంవత్సరాలకు చేరకముందే వారి మెదడు 85 శాతం మేర వృద్ధి చెందుతుంది. ఓ చిన్నారి ఆలోచనలు, మేధస్సు, భావోద్వేగ వృద్ధికి ఆ వయసు అత్యంత కీలకమైనదని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే ప్రీ-ప్రైమరీ తరగతులను (గ్రేడ్-1కి ముందు) ప్రభుత్వ పరిధిలో చేర్చారు. పాఠశాల విద్యను పూర్తిగా ప్రక్షాళన చేయడానికి వీలుగా తరగతులను నాలుగు స్థాయిలుగా విభజించాలని నేషనల్ కరికులమ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సీఎఫ్) సూచించింది. అందుకోసం 5ం3ం3ం4 ఫార్ములాను రూపొందించింది. ఇందులో మొదటి ఐదు సంవత్సరాలను ఫౌండేషన్ దశ అంటారు. ఈ దశలో మూడు నుండి ఎనిమిది సంవత్సరాల వయసున్న చిన్నారులు ఉంటారు. సమీప భవిష్యత్తులో ప్రామాణికీకరణకు, ప్రైవేటు ప్రీ-స్కూల్స్ క్రమబద్ధీకరణకు కూడా ఇది బాటలు వేస్తుంది. ఈ దశలో అంగన్‌వాడీలను, ప్రాథమిక పాఠశాలలను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆటలతో కూడిన విద్యను నేర్పడం ఈ దశ ప్రత్యేకత. అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ విషయంలో ఎక్కువ బాధ్యత అప్పగిస్తారు. అందుకోసం అంగన్‌వాడీ కార్యకర్తలకు అవసరమైన శిక్షణ అందిస్తారు. ఆ దిశగా ప్రభుత్వం పలు చర్యలను ప్రకటించింది.

## శివసేన (షిండే వర్గం)లో లుకలుకలు..

ముంబయి : మహారాష్ట్రలోని శివసేన (షిండే వర్గం)లో లుకలుకలు ప్రారంభమయ్యాయి. మంత్రి పదవి దక్కకపోవడంతో అసంతృప్తికి గురైన ఆ పార్టీ ఎమ్మెల్యే నరేంద్ర భోండేకర్ సోమవారం పార్టీ పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం ఆయన శివసేన (షిండే వర్గం)డిప్యూటీ నేతగా, విదర్భ పార్టీ కోఆపరేటివ్‌గా వ్యవహరిస్తున్నారు. భండారా-పావని నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన పార్టీ పదవికి రాజీనామా చేసినప్పటికీ ఎమ్మెల్యేగా కొనసాగుతుండటం గమనార్హం. మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆయనకు మంత్రి పదవిని ఇస్తామని పార్టీ హామీ ఇచ్చింది. అయితే, ఆదివారం జరిగిన కేబినెట్ విస్తరణలో ఆయనకు చోటు దక్కలేదు. దీంతో ఆయన అసంతృప్తికి గురైనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఏక్‌నాథ్ షిండే, ఉదరు సామంత్, ఏక్‌నాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్ షిండేకు సందేశాలు పంపినట్లు పేర్కొన్నాయి. ఫడ్నవీస్ ప్రభుత్వంలో ఉదరు సామంత్‌కు మంత్రి పదవి దక్కింది. మొత్తం 39 మంది నిన్న మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. వీరిలో 19 మంది బిజెపికి చెందినవారు కాగా, 11 మంది శివసేన (షిండే వర్గం), 9 మంది ఎన్‌సిపి (అజిత్ పవార్ వర్గం) నేతలు ఉన్నారు. ఫడ్నవీస్, డిప్యూటీ సిఎం ఏక్‌నాథ్ షిండేలతో కలిపి కేబినెట్ బెర్తల సంఖ్య 42కు చేరింది.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం
## గుంటూరు జిల్లా తెనాలి యువతి మృతి

అమెరికా : అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంటూరు జిల్లా తెనాలికి చెందిన యువతి మృతి చెందిన ఘటన గత శుక్రవారం రాత్రి జరిగింది. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన వ్యాపారి గణేష్, రమాదేవి దంపతుల కుమార్తె నాగశ్రీ వందన పరిమళ (26) ఉన్నత చదువుల కోసం 2022 డిసెంబర్‌లో అమెరికాకు వెళ్లారు. అక్కడ టెన్నెసీ రాష్ట్రంలోని ఒక యూనివర్శిటీలో ఎంఎస్ చదువుతోంది. గత శుక్రవారం రాత్రి ఆమె తన స్నేహితులతో కలిసి కారులో వెళుతుండగా, రాక్‌వుడ్ ఎవెన్యూ సమీపంలో ట్రక్ వెనుక నుంచి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. నాగశ్రీ వందన పరిమళతో పాటు స్నేహితులకు కూడా తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. నాగశ్రీ వందన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ప్రమాదంలో నాగశ్రీ వందన స్నేహితులు నికిత్, పవన్ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో నికిత్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండగా, పవన్ పరిస్థితి మాత్రం విషమంగా ఉందని తెలిసింది. కుమార్తె మృతి చెందినట్లు నాగ శ్రీ వందన తల్లిదండ్రులకు ఫోన్ రావడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. తల్లిదండ్రులు రోదిస్తున్నారు. నాగ శ్రీ వందన మృతితో స్వస్థలం తెనాలిలోని వారి నివాసం ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. యువతి మృతి దేహాన్ని స్వస్థలానికి వీలైనంత త్వరగా పంపించేందుకు తానా సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## అమెరికా, చైనా మధ్య శాస్త్రీయ సహకార ఒప్పందం పునరుద్ధరణ

బీజింగ్: అమెరికా, చైనాలు తమ మధ్య శాస్త్రీయ, సాంకేతిక సహకార ఒప్పందాన్ని మరో ఐదేళ్ల పాటు పునరుద్ధరించుకున్నాయి. ఇరు దేశాల మధ్య తీవ్రమైన ఆర్థిక, రాజకీయ ఘర్షణ వాతావరణం నెలకొందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ ఒప్పందం పునరుద్ధరణతో వాటిని ఖండించినట్లయింది. అయితే ఈ ఒప్పందంపై తొలిసారిగా 1979లో ఇరు దేశాలు సంతకం చేశాయి. తరువాత నుంచి ప్రతీ ఐదేళ్లకు ఈ దీన్ని పునరుద్ధరిస్తున్నారు. గగన తలంపై బెలూన్ కాల్చివేత, తైవాన్ అధ్యక్షులు-అమెరికా స్పీకర్ మధ్య భేటీ వంటి సందర్భాల్లోనూ ఈ ఒప్పందాన్ని పునరుద్దరించారు. శాస్త్రీయ పరిశోధనలు, వాతావరణ మార్పులు, ఫెంటానిల్ అక్రమ రవాణా, సింథటిక్ డ్రగ్ వంటి విస్తృత రంగాల్లో అమెరికా, చైనా మధ్య సహకారం కోసం ఈ ఒప్పందం కుది రింది. పునరుద్ధరించిన తాజా ఒప్పందంలో భద్రత, వివాదాల పరిష్కా రానికి సంబంధించిన నిబంధనలను బలోపేతం చేసినట్లు, అలాగే మేథో సంపత్తిని రక్షించే నిబంధనలను జత చేసినట్లు అధికారులు తెలిపారు.

## సిరియాపై ఆంక్షలను ఉపసంహరించండి

తమ దేశంపై విధించిన ఆంక్షలను ఉపసంహరించుకోవాలని పాశ్చాత్య దేశాలకు ఐరాసలో సిరియా ప్రత్యేక రాయబారి గీర్ ఫెడర్సెన్ ఆదివారం విజ్ఞప్తి చేశారు. దేశంలో బషర్ అసాద్ పాలన ముగిసిన నేపథ్యంలో 'ఆంక్షలను అతి త్వరలోనే ఎత్తివేస్తారని కోరుకుంటున్నాం. తద్వారా సిరియా నిర్మాణాన్ని చేపట్టగలం' అని ఆదివారం ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో గీర్ ఫెడర్సెన్ తెలిపారు. అస్సాద్ ప్రభుత్వం నేలకూలిన తరువాత ఏర్పాటైన తాత్కాలిక ప్రభుత్వంతో సమావేశం కోసం డమాస్కస్‌కు గీర్ ఫెడర్సెన్ వచ్చారు. తొలిసారిగా స్వదేశం వచ్చిన నేపథ్యంలో గీర్ ఫెడర్సెన్ విలేకరులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. తమదేశస్థులంతా రాజకీయంగా ఐక్యంగా ఉండి అభివృద్ధిలో పంచుకుంటారని చెప్పారు. అలాగే యుద్ధ సమయంలో జరిగిన నేరాల్లో బాధితులకు న్యాయం, జవాబుదారీతనం ఉండాలని పిలుపునిచ్చారు. సిరియాకు మానవతావాద సహాయాన్ని వేగవంతం చేయాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరారు. అంతర్యుద్ధం, తిరుగుబాటు వంటి కారణాలతో 2011 నుంచి సిరియాపై అమెరికా, యూరోపియన్ యూనియన్, ఇతర దేశాలు కఠినమైన ఆంక్షలను అమలు చేస్తున్నాయి.

## పెరిగిన శబరిమల ఆదాయం

శబరిమల : మండల కాలం 30 రోజుల తర్వాత శబరిమల ఆదాయం గతంతో పోలిస్తే 22 కోట్ల రూపాయలు పెరిగిందని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు ప్రెసిడెంట్ పిఎస్ ప్రశాంత్ తెలిపారు. శనివారం వరకు 163,89,20,204 ఆర్జించబడిందని తెలిపారు. గతేడాది ఇదే సమయానికి రూ.141,12,97,723 ఆదాయం వచ్చిందని,

గతేడాది కంటే ఈసారి రూ.22,76,22,481 అదనపు ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. అరవణ టర్నోవర్ రూ.82,67,67,050, గతేడాది కంటే రూ.17,41,19,730 పెరిగిందన్నారు. యాత్రికుల సంఖ్య కూడా పెరుగుతోందని, శనివారం వరకు 22,67,956 మంది యాత్రికులు దర్శించుకున్నారని పేర్కొన్నారు. గతేడాది కంటే 4,51,043 మంది యాత్రికులు పెరిగారని తెలిపారు. యాత్రికుల సంఖ్య, ఆదాయం పెరగడం కూడా ప్రభుత్వం, దేవస్వం బోర్డు, పోలీసులు సంయుక్తంగా చేపట్టిన సన్నాహక విజయమేనని తెలిపారు. ఈ పాదయాత్రలో మీడియా సపోర్ట్ కూడా బాగానే ఉందని, ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారని తెలిపారు.



## బంగ్లాదేశ్ ఎన్నికలపై యూనస్ కీలక ప్రకటన

ఢాకా : బంగ్లాదేశ్ ఎన్నికలపై ఆ దేశ తాత్కాలిక నేత ముహమ్మద్ యూనస్ సోమవారం కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది చివరలో గాని, 2026 ప్రారంభంలో గాని బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని అన్నారు. జాతినుద్దేశించి సోమవారం టెలివిజన్‌లో ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల తేదీలను 2025 చివరినాటికి లేదా 2026 ప్రథమార్థంలో నిర్ణయించవచ్చని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు పలు ఎన్నికల సంస్కరణలు చేపట్టాల్సి వుందని అన్నారు. లోపరహిత ఓటరు జాబితా వంటి కనీస సంస్కరణలతో ఎన్నికలను నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు అంగీకరిస్తే.. 2025 నవంబర్ నెలాఖరులోగా ఎన్నికలు నిర్వహించవచ్చని అన్నారు. ఎన్నికల సంస్కరణల పూర్తి జాబితాను క్లియర్ చేయాలంటే మరికొన్ని నెలలు ఆలస్యం కావచ్చని అన్నారు. ఎన్నికల నిర్వహణపై యూనస్‌పై ఒత్తిడి పెరుగుతుండటంతో ఈ వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల తిరుగుబాటుతో ఈ ఏడాది ఆగస్టులో బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా దేశాన్ని విడిచిపారిపోయిన సంగతి తెలిసిందే. అనంతరం నోబెల్ బహుమతి గ్రహీత యూనస్ బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వానికి ప్రధాన సలహాదారుగా నియమితులయ్యారు.

## సిరియాపై ఆంక్షలను ఉపసంహరించండి



డమాస్కస్ : తమ దేశంపై విధించిన ఆంక్షలను ఉపసంహరించుకోవాలని పాశ్చాత్య దేశాలకు ఐరాసలో సిరియా ప్రత్యేక రాయబారి గీర్ ఫెడర్సెన్ ఆదివారం విజ్ఞప్తి చేశారు. దేశంలో బషర్ అసాద్ పాలన ముగిసిన నేపథ్యంలో 'ఆంక్షలను అతి త్వరలోనే ఎత్తివేస్తారని కోరుకుంటున్నాం. తద్వారా సిరియా నిర్మాణాన్ని చేపట్టగలం' అని ఆదివారం ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో గీర్ ఫెడర్సెన్ తెలిపారు. అస్సాద్ ప్రభుత్వం నేలకూలిన తరువాత ఏర్పాటైన తాత్కాలిక ప్రభుత్వంతో సమావేశం కోసం డమాస్కస్‌కు గీర్ ఫెడర్సెన్ వచ్చారు. తొలిసారిగా స్వదేశం వచ్చిన నేపథ్యంలో గీర్ ఫెడర్సెన్ విలేకరులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. తమదేశస్థులంతా రాజకీయంగా ఐక్యతతో అభివృద్ధిలో పంచుకుంటారని చెప్పారు. అలాగే యుద్ధ సమయంలో జరిగిన నేరాల్లో బాధితులకు న్యాయం, జవాబుదారీతనం ఉండాలని పిలుపునిచ్చారు. సిరియాకు మానవతావాద సహాయాన్ని వేగవంతం చేయాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరారు. అంతర్యుద్ధం, తిరుగుబాటు వంటి కారణాలతో 2011 నుంచి సిరియాపై అమెరికా, యూరోపియన్ యూనియన్, ఇతర దేశాలు కఠినమైన ఆంక్షలను అమలు చేస్తున్నాయి.

## దక్షిణ కొరియా అధ్యక్షుడికి బిడెన్ ఫోన్



వాషింగ్టన్ : యూన్ సుక్ యెయోల్ అభిశంసన తర్వాత తాత్కాలిక అధ్యక్షుడిగా మారిన ప్రధాన మంత్రి హాన్ డక్-సూతో శనివారం అమెరికా అధ్యక్షుడు జో బిడెన్ దక్షిణ కొరియాతో యుఎస్ సంబంధాల బలాన్ని నొక్కి చెప్పారు. హాన్ డక్-సూకు ఫోన్ చేసి మాట్లాడారు. తాత్కాలిక ప్రెసిడెంట్ హాన్ పదవీకాలంలో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, శ్రేయస్సు కోసం కూటమి కొనసాగుతుందని అధ్యక్షుడు బిడెన్ తన విశ్వాసాన్ని వ్యక్తం చేశారని వైట్ హౌస్ కాల్ రీడౌట్‌లో తెలిపింది. కొరియా రిపబ్లిక్‌లో ప్రజాస్వామ్యం యొక్క పునరుద్ధరణ, చట్ట పాలనకు అధ్యక్షుడు బిడెన్ తన ప్రశంసలను వ్యక్తం చేశారని తెలిపారు. రిపబ్లిక్ ఆఫ్ కొరియా ప్రజలకు యునైటెడ్ స్టేట్స్ యొక్క ఉక్కుపాదం గల నిబద్ధతను పునరుద్ఘాటించారు. దక్షిణ కొరియా చట్టసభ సభ్యులు యూన్‌ని క్లుప్తంగా మార్షల్ లా ప్రకటించడంపై అభిశంసనకు శనివారం ఓటు వేశారు. ఇది దశాబ్దాలుగా దేశాన్ని అత్యంత దారుణమైన రాజకీయ గందరగోళంలోకి నెట్టింది. యూన్‌ను పదవి నుండి శాశ్వతంగా తొలగించాలా వద్దా అనే దానిపై రాజ్యాంగ న్యాయస్థానం చర్చిస్తున్నందున టెక్నోక్రాట్ హాన్ తాత్కాలిక నాయకుడిగా అడుగుపెట్టారు.

## దక్షిణ కొరియా అధ్యక్షులు యూన్ సుక్ యోల్ అభిశంసన



సియోల్ : దక్షిణ కొరియా అధ్యక్షులు యూన్ సుక్ యోల్‌పై శనివారం ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానం ఆమోదం పొందింది. జాతీయ అసెంబ్లీ ఈ తీర్మానాన్ని 204-85తో ఆమోదించింది. దీంతో యూన్ సుక్ యోల్ అధ్యక్ష అధికారాలు, విధులను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రధానమంత్రి హున్ డక్ సూ అధ్యక్ష అధికారాలను స్వీకరించారు. యూన్‌ను అధ్యక్షుడిగా తొలగించాలా.. లేదా అధికారాలను పునరుద్ధరించాలా అనే విషయాన్ని రాజ్యాంగ న్యాయస్థానం నిర్ధారించేందుకు 180 రోజుల గడువు ఉంటుంది. యూన్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తే నూతన అధ్యక్షున్ని ఎన్నుకోవ డానికి 60 రోజుల్లో జాతీయ ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుంది. శనివారం తీర్మానం ఆమోదం పొందడంతో అభిశంసనకు గురైన మూడో దక్షిణ కొరియా అధ్యక్షుడిగా యూన్ నిలిచారు. 2004లో రో%ఎ% మూ హ్యున్, 2016లో పార్క్ గ్యున్ హై అభిశంసనకు గురయ్యారు. శనివారం యూన్‌పై అభిశంసన తీర్మానం ఆమోదం పొందగానే పార్లమెంట్ సమీపంలో వేలాదిమంది ప్రజలు ఆనందోత్సాహాలతో నినాదాలు చేశారు. బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. 'మేం రాజ్యాంగ క్రమాన్ని పరిరక్షించాం' అని నినాదాలు చేశారు. అభిశంసన తీర్మానం ఆమోదం తరువాత యూన్ ఒక ప్రకటన విడుదల చేశారు. తన అధికారాన్ని ఎప్పటికీ వదులుకోనని తెలిపారు. ప్రస్తుత పరిస్థితిని తన అధ్యక్ష పదవికి తాత్కాలిక విరామంగా పేర్కొన్నారు. ఈ నెల 3న సైనిక పాలన విధించడంతో యూన్‌పై దేశవ్యాప్తంగా విమర్శలు ప్రారంభమయ్యాయి.



# చక్కని ఆరోగ్యం

## గర్భంలో ఉన్న బిడ్డ మెదడు చురుకుదనం కోసం...?

ఏ స్త్రీ అయినా సరే గర్భం దాల్చినప్పటి నుంచి కడుపులో ఉన్న తన బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని ఎన్నో పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకుంటుంది. అలాగే తను తీసుకునే ప్రతి ఆహారం పై శ్రద్ధ వహిస్తుంది. లోపల ఉన్న బిడ్డకు ఎటువంటి ఇబ్బంది కలగ కుండా చాలా జాగ్రత్తలు ఆరోగ్య నియమాలు పాటిస్తుంది. ఎక్కువగా బిడ్డ పై ప్రభావం పడేది మన ఆహార లోపాల వల్లనే.

## ఊపిరి సరిగ్గా తీసుకోలేకపోతున్నారా? బాదం పప్పుల్ని?



పొట్టలో నొప్పి, ఊపిరి సరిగా తీసుకోలేకపోతున్నా, ఆహారం సరిగా జీర్ణం కావట్లేదని అనిపించినా బాదం పప్పుల్ని ఆహారంలో భాగం చేసుకోవాలి. శ్వాస సమస్యలతో ఇబ్బందిపడేవారు రోజూ 10 నుంచి పదహేను బాదం పప్పుల్ని తీసుకోవాలి. ఆరోగ్యంగా వున్నవారు మాత్రం రోజుకు ఐదు బాదం పప్పులు తీసుకుంటే సరిపోతుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. జుట్టు తెల్లబడిపోవడం, చర్మంపై ముడతల వంటివి వస్తుంటే రోజూ ఐదేసి బాదం పప్పుల్ని తీసుకోవాల్సి వుంటుంది. ఎందుకంటే... వాటిలోని మాంగనీస్... కొల్లాజెన్ అనే పదార్థం ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. అది మన చర్మాన్ని కోమలంగా, అందంగా, ముడతలు లేకుండా చేస్తుంది. బాదంలలో యాంటీఆక్సిడెంట్స్, నీటిలో కరిగే ఫ్యాట్స్, మెగ్నీషియం, కాపర్ వంటివి ఉంటాయి. ఇవి రక్త నాళాల్లో కొవ్వును తరిమికొడతాయి. ఫలితంగా రక్త సరఫరా బాగా జరుగుతుంది. అలా జరిగినప్పుడు గుండెకు మేలు జరుగుతుంది. చెడు కొలెస్ట్రాల్ మన శరీరంలోంచి తరిమికొట్టాలంటే.. రోజుకు పది బాదం పప్పుల్ని తీసుకుంటే సరిపోతుంది. అంతేకాకుండా.. . ముఖ్యంగా జుట్టును ఒత్తుగా, గట్టిగా, బలంగా వుంచుతాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

## బరువు, పొట్ట తగ్గించ్చుకోవటానికి ఈ రసాన్ని తాగండి



ఈ రోజుల్లో చాలా మందికి బరువు తగ్గడం, పొట్ట తగ్గడం అన్నవి పెద్ద సమస్యలవుతున్నాయి. ఐతే.. ఫైబర్, ముఖ్యమైన పోషకాలతో ఉండే చెరుకు రసం మన బరువు తగ్గించగలదు. ముఖ్యంగా పొట్ట చుట్టూ పేరుకునే కొవ్వును కరిగిస్తుంది. అంతేకాదు ఇందులోని ఫ్లైవనాయిడ్స్, పాలీఫెనోలిక్ కాంపౌండ్లు, యాంటీ ఆక్సిడెంట్లు మనలో వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. వ్యాధులు రాకుండా చేస్తాయి. రోజూ ఓ గ్లాస్ చెరుకు రసం తాగేయాలి. ఇందులో ఫైబర్ తోపాటు... ప్రోటీన్లు, పొటాషియం, కాల్షియం, ఐరన్, జింక్, అమైనా యాసిడ్లు ఉంటాయి.

చెరుకు రసంలో కేలరీలు తక్కువగా ఉంటాయి. 220 గ్రాముల చెరుకు రసంలో... 180 కేలరీల శక్తి ఉంటుంది. పంచదార 30 గ్రాములు మాత్రమే ఉంటుంది. మన శరీరంలో అనవసరంగా ఉండే ఒఆఆ కొలెస్ట్రాల్, ట్రిగ్లిసెరైడ్స్‌ని కరిగిస్తుంది. వీటి వల్లే మనం బరువు పెరుగుతూ ఉంటాం. ఇవి మన శరీరంలో పెరిగే కొద్దీ... గుండె సంబంధిత జబ్బులు వచ్చే ప్రమాదం పెరుగుతూ ఉంటుంది. కాబట్టి... ఈ కొలెస్ట్రాల్‌ను కరిగించుకోవాల్సిందే. చెరుకు రసంలోని ఫైబర్ (పీచు పదార్థం)... కొవ్వును కరిగిస్తుంది. ఇది పొట్ట చుట్టూ ఉండే బెల్లీ ఫ్యాట్ అంతు చూస్తుంది. రోజూ గ్లాస్ చెరుకు రసం తాగితే... మన శరీరాన్ని అది ఆటోమేటిక్‌గా క్లీన్ చేస్తుంది. అనవసర వ్యర్థాల్ని బయటకు పంపేస్తుంది. ఇలా రెగ్యులర్‌గా జరిగే ప్రక్రియ వల్ల బరువు తగ్గిపోతారు. పొట్ట చుట్టూ ఉండే రింగు లాంటి కొవ్వు కూడా తగ్గిపోతుంది.

చెరుకు రసం వల్ల ఇంకా చాలా ప్రయోజనాలున్నాయి. మన కిడ్నీలు, లివర్ బాగా పనిచేస్తాయి. చాలా రోగాలు నయమవుతాయి. కాన్సర్, జాండీస్ లాంటివి కూడా తగ్గుతాయి. చెరుకు రసంలోని పొటాషియం... మన జీర్ణ వ్యవస్థ బాగా పనిచేసేలా చేస్తుంది. చెరుకు రసంలోని గ్లిసెమిక్ ఇండెక్స్... మన బ్లడ్ షుగర్ లెవెల్స్‌ని రెగ్యులేట్ చేస్తుంది. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారు కూడా కొద్ది మొత్తంలో చెరుకు రసం తీసుకుంటే ప్రయోజనం ఉంటుంది. చెరుకు రసం ముసలి తనం రాకుండా కూడా చేస్తుంది. చర్మాన్ని కాపాడుతుంది. మొటిమలు, మచ్చల్ని తగ్గిస్తుంది. ఎముకలు, దంతాలు కూడా చక్కగా ఉంటాయి. ఐతే... రోజుకు ఒక గ్లాస్ మాత్రమే తాగితే మంచిది. తియ్యగా ఉంటుంది కదా అని ఎక్కువ చెరుకు రసం తాగితే... అందులో షుగర్ వల్ల... బరువు పెరిగే ప్రమాదం కూడా ఉంటుంది

## మీ ఒంట్లో వేడి అలా తగ్గిపోతుంది...?



ఏకాకంలోనైనా దొరికేవి నిమ్మకాయలు. అయితే వేసవి కాలంలో అయితే ఇవి మరింతగా వస్తాయి. వీటి వాడకం కూడా ఆ కాలంలోనే ఎక్కువగా ఉంటుంది. అయితే ప్రస్తుత చలికాలంలో కూడా నిమ్మకాయను ఆహారాపదార్థాల్లో వాడితే ఎంతో మంచిదట. వీటిలో సి విటమిన్ పుష్కలంగా ఉంటుందట. ప్రతిరోజూ పొద్దునే పరగడుపున ఒక నిమ్మకాయ రసం గ్లాసుడు నీళ్ళలో కలుపుకుని కొంచెం తేనె వేసుకుని తాగితే అధిక బరువు తగ్గుతారట. రోజంతా ఉత్సాహంగా చలాకీగా ఉంటారని చెబుతున్నారు ఆయుర్వేద నిపుణులు. నిమ్మకాయ వల్ల నోటి అరుచి, పైత్యం తగ్గుతాయి. రోజూ నిమ్మకాయ తినడం వల్ల శరీరంలో ఉండే అధిక వేడి తగ్గుతుందట. పల్చగా వేసిన మజ్జిగలో కొంచెం ఉప్పు, నిమ్మరసం కలుపుకుని తాగితే ఒంట్లో వేడి పూర్తిగా తగ్గిపోతుందట. నిమ్మకాయలు అధికంగా దొరికే కాలంలో పది నిమ్మకాయలను రసం పిండి దాంట్లో వందగ్రాముల అల్లం చిన్న చిన్న ముక్కలుగా చేసి వేయాలట. అలాగే సరిపడినంత ఉప్పు, జీలకర్ర కూడా నిమ్మరసంలో కలపాలట. వాటిని మూడురోజుల పాటు అలాగే ఉంచిన తరువాత రసంతో పాటే అల్లం ముక్కలను ఎండబెట్టాలట. వీటిని ఒక సీసాలో వేసుకుని నోరు వికారంగా ఉన్నప్పుడు ఒక అల్లం ముక్కను నోట్లో వేసకుంటే వికారం తగ్గిపోతుందట. నిమ్మకాయలు అధికంగా దొరికే రోజుల్లో నిమ్మరసంతో షర్బత్ తయారుచేసుకుని నిల్వ చేసుకోవాలట. ఒక గ్లాసుడు నిమ్మకాయల రసానికి రెండు గ్లాసుల పంచదార తీసుకోవాలట. పంచదారలో గ్లాసుడు నీళ్ళు పోసి లేత పాకం పెట్టాలట. పాకం చల్లారాక నిమ్మరం కొంచెం ప్రిజిర్వేటివ్ లెమన్ ఎసెన్సు వేసి బాగా కలపాలట. ఆ తరువాత వడకట్టి సీసాలో పోసుకుంటే షర్బత్ రెడీ అవుతుందట. ఇలా నిమ్మరసం ఆరోగ్యానికి ఎంతో మేలు అంటున్నారు ఆయుర్వేద నిపుణులు.



## క్యాన్సర్ పేషంట్స్‌కి గుడ్‌న్యూస్... ఏమిటంటే?

రోజూ వాకింగ్ చేయడం ఆరోగ్యానికి చాలా మంచిది. వాకింగ్ చేయడం వల్ల శరీరంలో రక్త ప్రసరణ చాలా బాగా జరుగుతుంది. అంతేకాదు ఎన్నో జబ్బుల నుంచి తప్పించుకోవచ్చు కూడా బిపి, షుగర్ లాంటివి కూడా మీ ధరకి చేరవు. అలాగే ఈ మధ్య చాలా మందిలో మోకాళ్ళ నొప్పులు సహజంగా కనిపిస్తున్నాయి. అయితే ఆ మోకాళ్ళ నొప్పులు వచ్చాక డాక్టర్లు చెప్పే ఒకే ఒక చిట్కా కుదిరినంత వరకు వాకింగ్ చేయండి అని అలా చేసేకంటే ముందుగానే రోజుకు కనీసం ఒక అరగంట అయినా సరే వాకింగ్ చేయడం వల్ల ఇలాంటివన్నీ మీ ధరి చేరవు.

అంతేకాక వారానికి రెండున్నర గంటలు లేదా రోజుకు దాదాపు 20 నిమిషాలు పైగా వేగంగా నడిస్తే ఏడు రకాల క్యాన్సర్ల ముప్పు నుంచి తప్పించుకోవచ్చని తాజా అధ్యయనం వెల్లడించింది. ఈ తరహా వ్యాయామంతో స్త్రీ, పురుషులు లివర్ క్యాన్సర్ ముప్పును 18 శాతం, మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్ ముప్పు 6 శాతం మేర తగ్గుతుందని పరిశోధకులు తెలిపారు. వారానికి ఏడు గంటల పాటు వేగంగా నడిస్తే ఈ ముప్పు 10 శాతం తగ్గుతుందని తేల్చారు. వారానికి రెండున్నర గంటల పాటు వేగంగా నడిస్తే కిడ్నీ క్యాన్సర్ ముప్పును 11 శాతం, ఐదుగంటల వ్యాయామంతో 17 శాతం మేర ఈ ముప్పును తగ్గించవచ్చని వెల్లడించారు. బ్రిస్క్ వాకింగ్ చేసే పురుషుల్లో జీర్ణవాహిక క్యాన్సర్ ముప్పు 14 శాతం మేర తగ్గినట్టు గుర్తించారు.

ఇక స్త్రీ, పురుషులిద్దరిలో బ్లడ్ క్యాన్సర్ ముప్పు 19 శాతం తగ్గినట్టు వెల్లడైంది. వ్యాయామంతో బరువు తగ్గడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని, చురుకైన వ్యక్తులు వ్యాయామం చేయడం ద్వారా కొన్ని రకాల క్యాన్సర్లను నియంత్రించుకోగలుగుతారని ఈ ఫలితాలు వెల్లడించాయని పరిశోధకులు తెలిపారు. 7.5 లక్షల మందిపై పదేళ్ల పాటు పరిశోధనలు చేపట్టిన అనంతరం ఈ అవగాహనకు వచ్చినట్టు అమెరికన్ క్యాన్సర్ సొసైటీకి చెందిన సహ రచయిత డాక్టర్ అల్ఫా పటేల్ వెల్లడించారు. వేగంగా నడవటం వంటి సరళమైన వ్యాయామంతో పలు రకాల క్యాన్సర్ల ముప్పును నిరోధించవచ్చని పరిశోధనలో వెల్లడవడం నిజంగా అద్భుత ఫలితమేనని పరిశోధకులు విశ్లేషించారు. అయితే ఒక్క క్యానర్ మాత్రమే కాక వాకింగ్ అనేది మానవ శరీరానికి సర్వరోగ నివారిణి అని చెప్పవచ్చు. వేగంగా నడిస్తే మన శరీరంలోంచి వచ్చే చమట చాలా రోగాల నుంచి మనల్ని కాపాడుతుంది.

## వేరుశనగలు ఇలా తింటే ఎన్ని ప్రయోజనాలో తెలుసా..?



వేడి వేడి వేరు శనగలంటే అందరూ ఇష్టపడుతారు. కాలక్షేపం కోసం చిరు వ్యాపారుల నుంచి కొనుగోలు చేసి తినడం చాలా ఉత్తమం. ప్రధానంగా వంటల్లో వేరుశనగ నూనెను అమితంగా వాడుతారు. ఇక పేదోడి జీడిపప్పుగా పేరొంది అందరికీ అందుబాటులో ఉన్న వేరుశనగలో పుష్కలమైన పోషకాలు ఉన్నాయి. వేరు శనగల్లో ఎక్కువగా ఉండే విటమిన్ ఇ, సిలీనియం, ఫైబర్, జింక్ శరీర సౌందర్యానికి కావలసిన హార్మోన్ల ఉత్పత్తి చేయడానికి ఉపయోగపడతాయి. రక్త ప్రసరణను మెరుగు చేసి మంచి ఆరోగ్యంతో పాటు చర్మ సౌందర్యానికి ఉపకరిస్తాయి. విభిన్నమైన రుచి కలిగి ఉండే.. వేరుశనగ గింజలను సౌత్ ఇండియన్స్ ఎక్కువగా ఉపయోగిస్తారు. అయితే చాలా మంది వేరుశనగలు తొక్క తీసేసి తింటారు. కానీ పల్లీలను తొక్కలతో తింటేనే చాలా మంచిది. అలాగే వేరుశనగ గింజల తొక్కల్లో ఆరోగ్యాన్ని పెంచే, రోజువారీ అవసరమయ్యే చాలా పోషకాలున్నాయి. వేరుశనగ తొక్కల్లో కూడా గుండె జబ్బులు, కాన్సర్, హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకునే గుణాలున్నాయి.

విటమిన్ సీ, గ్రీన్ టీ కంటే వేపిన వేరు శనగ గింజలకు ఉండే తొక్కల్లో యాంటీఆక్సిడెంట్ కంటెంట్ ఎక్కువగా ఉంది. పీనట్ స్కిన్‌లో ఉండే ఫైబర్... శరీర అధిక బరువును తగ్గిస్తోంది. చిత్రమేంటంటే మామూలు వేరు శనగ గింజల కంటే వేపిన వేరుశనగ గింజల తొక్కలకు ఎక్కువ విష వ్యర్థాల్ని అడ్డుకునే శక్తి ఉన్నట్లు 2012లో జరిపిన పరిశోధనల్లో తేలింది. అదే విధంగా.. వీటిలో పొటాషియం అధికంగా ఉంటుంది. సోడియం తక్కువగా ఉంటుంది. కాబట్టి బీపీ ఉన్నవారికి ఇవి ఉపయోగపడతాయి.

## చూయింగ్ గమ్‌లు తింటున్నారా..

ప్రపంచ వ్యాప్తంగా ఏటా 374 బిలియన్ల చూయింగ్ గమ్‌లు అమ్ముడవుతున్నాయి. మనలో చాలా మంది రక రకాల తిను బండారాలను తినేందుకు ఇష్టపడినట్లే చూయింగ్ గమ్ లను తినేందుకు కూడా చాలా మంది ఆసక్తి చూపిస్తుంటారు. ఈ క్రమంలోనే మనం సరాసరి 187 బిలియన్ల గంటలను కేవలం చూయింగ్ గమ్ తినేందుకే వెచ్చిస్తున్నామని కూడా పరిశోధనలు చెబుతున్నాయి. అయితే ఇప్పుడు చెప్పబోయే విషయం తెలిస్తే ఇకపై చూయింగ్ గమ్ అంటే ఇష్టం లేని వారు కూడా దాన్ని అమితంగా తినేస్తారు. ఎందుకంటే చూయింగ్ గమ్‌లను తినడం వల్ల మనకు అనేక



లాభాలు కలుగుతాయి మరి..! అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం. చూయింగ్ గమ్ లను తినడం వల్ల మెదడు పనితీరు పెరుగుతుందట, ఏకాగ్రతగా పనిచేస్తారని సైంటిస్టులు చేపట్టిన పరిశోధనల్లో వెల్లడైంది.

అలాగే మెదడు యాక్టివ్ గా కూడా మారుతుందట. చూయింగ్ గమ్‌లను నమలడం వల్ల దంత సమస్యలు రాకుండా ఉంటాయని సైంటిస్టులు చెబుతున్నారు. దంత క్షయం రాకుండా ఉండాలంటే చూయింగ్ గమ్‌లను నమలాలని వైద్యులు చెబుతున్నారు. అయితే షుగర్ ఫ్రీ చూయింగ్ గమ్‌ను నమిలితేనే ఈ ప్రయోజనం కలుగుతుంది. చూయింగ్ గమ్‌ను తినడం వల్ల ఒత్తిడి తగ్గుతుందని సైంటిస్టులు చేపట్టిన పరిశోధనలు తెలుపుతున్నాయి. బాగా టెన్షన్, ఆందోళన, ఒత్తిడి ఉన్నప్పుడు చూయింగ్ గమ్‌ను తింటే వెంటనే ఆ పరిస్థితి నుంచి బయట పడవచ్చని సైంటిస్టులు చెబుతున్నారు. కనుక మీరు కూడా బాగా ఒత్తిడికి లోనవుతుంటే.. వెంటనే ఒక చూయింగ్ గమ్‌ను నమిలేయండి, ఒత్తిడి తగ్గుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి చూయింగ్ గమ్ ఎంత గానో ఉపయోగపడుతుంది. ఆకలిగా ఉన్న వారు చూయింగ్ గమ్‌ను తింటే ఆకలి చచ్చిపోతుందట. అందువల్ల ఆహారం తక్కువగా తీసుకుంటారు. ఫలితంగా శరీరానికి అందే క్యాలరీలు కూడా తగ్గుతాయి. దీంతో అధిక బరువు తగ్గుతారు.

## స్కిన్‌టోన్ పెంచే ప్యూమిస్ స్టోన్

సాధారణంగా ప్యూమిస్ స్టోన్‌ను పాదాల స్క్రబింగ్‌కు మాత్రమే ఉపయోగిస్తూ ఉంటాం. కానీ చర్మపు మృత కణాల్ని తొలగించటంతోపాటు అవాంఛిత రోమాల్ని కూడా ప్యూమిస్ స్టోన్ తొలగించగలదు. పొడి చర్మానికి మేలు: పొడి చర్మం కలిగినవారు సబ్బు నీళ్లలో నానబెట్టిన ప్యూమిస్ స్టోన్‌తో ఒళ్లు రుద్దుకుంటూ ఉండాలి. ముందుగా ఆయిల్ మసాజ్ చేసుకుని ఆ తర్వాత ప్యూమిస్ స్టోన్‌తో రుద్దుకుంటూ ఉంటే మృత కణాలు తొలిగి పొడి చర్మం తేమగా తయారవుతుంది.



స్కిన్‌టోన్ కోసం: స్కిన్‌టోన్ పెరగాలంటే ప్రతిరోజూ ప్యూమిస్ స్టోన్‌తో శరీరానికి సున్నితంగా మసాజ్ చేయాలి. ఇలా చేస్తే రక్త ప్రసరణ బాగా జరిగి చర్మం మెరుస్తూ ఉంటుంది. ఇందుకోసం స్నానం చేసేటప్పుడు సబ్బు రుద్దుకున్న తర్వాత ప్యూమిస్ స్టోన్‌తో శరీరమంతా వృత్తాకారంలో మసాజ్ చేయాలి. అవాంఛిత రోమాలు తొలగాలంటే: ముఖంపై ఉన్న అవాంఛిత రోమాలను తొలగించటం కోసం కూడా ప్యూమిస్ స్టోన్‌ను ఉపయోగించొచ్చు. ఇందుకోసం ఫేస్ ప్యాక్ వేసుకున్న తర్వాత దాన్ని తొలగించటం కోసం ప్యూమిస్ స్టోన్ వాడాలి. అయితే ఆరిపోయిన ఫేస్‌ప్యాక్‌ను కొద్ది నీళ్లతో తడిపి మెత్తబడిన తర్వాతే ప్యూమిస్ స్టోన్‌తో రుద్దాలి.

## బీపీతో గుండె ఆగడం ఖాయమంటా..!



బీపీ.. ఇప్పుడు ఇది వాడుక పదం. చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరు బీపీ.. బీపీ.. తెప్పియకు అని డైలాగ్ వేస్తారు. కానీ ఈ బీపీ చాలా డేంజర్ అని చాలామందికి తెలియదు. అయితే ఈ బీపీ వల్ల ఒక్కో సారి గుండెపోటు కూడా వస్తుంది. ఈ బీపీ ఎక్కువగా టెన్షన్ పడటం వల్ల.. ఎక్కువగా ఉప్పు, కారం వంటివి తీసుకోవటం వల్ల వస్తుంది. అయితే అధిక బీపీ వల్ల గుండె కవాటాల్లో లోపాలు ఎక్కువగా ఏర్పడే అవకాశాలు ఉన్నాయని ఆక్స్‌ఫర్డ్ పరిశోధనలో తేలింది. చిన్న వయసులో అధిక రక్తపోటు లక్షణాలు కనిపిస్తే గుండె నుంచి శరీరభాగాలకు రక్త సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతాయి అని.. దీనివల్ల గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని వెల్లడైంది. ముఖ్యంగా గుండెలోని మిట్రల్ కవాటాలకు సమస్యలు తలెత్తుతాయని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ కాజిమ్ రహిమి వెల్లడించారు. దీనివల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, త్వరగా అలసిపోవటం వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయని చెప్పారు. అయితే అలాంటి వారు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.. లేదు అంటే ఇబ్బందులు పడక తప్పదు.

## నచ్చింది తింటూనే నాజూగ్గా...

పాత రోజుల్లో సన్నగా ఉన్నవారిని బాగా తినాలని పెద్దలు చెబుతుండేవారు. అదే ఇప్పుడైతే కాస్త బొద్దుగా కనిపిస్తే చాలు పెద్దలే డైటింగ్ చేయమని చెబుతున్నారు. చదువుకునే వారు, నిపుణుల మొదలు సామాన్యుల వరకు వీలున్నత మేర సన్నగా ఉండటానికే ఇష్టపడుతున్నారు. అలాగే సన్నబడే ప్రయత్నంలో అనారోగ్యకర ఆహార, వ్యాయామ నియమాలను పాటించి లేనిపోని సమస్యలనూ కొని తెచ్చుకుంటున్నారు. అందుకే సన్నబడాలనుకునే వారు నచ్చింది తినటం మానుకోకుండానే నాజూగ్గా ఉండేందుకు దోహదపడే కొన్ని అంశాల మీద దృష్టి పెట్టాలి. చాలా మంది పొరబాటు పడుతున్నట్లు ఆహారానికి తగిన వ్యాయామం చేయాల్సిన పని లేదు . శరీర పరిస్థితి, స్వభావం, బరువు తదితర అంశాల ప్రాతిపదికన కనీస స్థాయిలో వ్యాయామాలు చేస్తూ పోవాలి.

– ఒకేసారి సన్నబడాలని ఏమీ తినకుండా పొట్టను ఖాళీగా ఉంచితే గ్యాస్ ఏర్పడే ఇబ్బంది ఉన్నందున ప్రతి మూడు, నాలుగు గంటలకు కొంచెం కొంచెం ఆహారం తప్పక తీసుకోవాలి. తీసుకునే ఆహారంలో గింజలు, పప్పు ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు ఉండేలా చూసుకోవాలి. వాటిని ఎప్పుడు ఎలా తినాలనే ప్రణాళిక ఉండాలి. ఎక్కువ సేపు శక్తిని నిలిపే ప్రోటీన్స్, పీచు అధికంగా ఉండే ఆహారం తీసుకోవటం మరచి పోవద్దు. చక్కెర తక్కువ ఉన్న పదార్థాలు తీసుకోవాలి.

చక్కెరకు బదులుగా బెల్లం, తేనె, ఖర్జూరాలు, పటిక బెల్లం వంటివి వాడాలి. రోజుకి 10– 12 గ్లాసుల నీరు తాగాలి. 60 నుంచి 70 శాతం ఆహారం, మిగిలిన 30 నుంచి 40 శాతం నీటిని తీసుకోవాలి. పిజ్జా, బర్గర్స్ స్థానంలో గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులు తీసుకోవాలి. మూడు నాలుగు వారాలకొకసారి మాత్రమే డైట్ ప్లాన్‌ను మార్చాలి. తరచూ మార్చడం వలన జీవప్రక్రియ దెబ్బతినే ప్రమాదముంది. అలాగే తెల్లవారుజామున కనీసం గంట పాటు చేసే వాకింగ్ ఆరోగ్యానికి చాలా మంచిది. దీనివల్ల శరీరం అంతా బాగా కదలి అన్ని అవయవాలూ చురుగ్గా పనిచేయటం మొదలవుతుంది. ఉదయం వీలు కాకపొతే



సాయంత్రం అయినా పర్వాలేదు. ఎప్పుడూ ఒకేరకమైన వ్యాయామాలు కాకుండా శరీర అవసరాలకు తగిన వ్యాయామాలు చేయాలి. ఒకరోజు వ్యాయామం చేసి రెండు రోజులు మానుకోవటం వల్ల ఆశించిన ఫలితాలు రాకపోగా లేనిపోని ఇబ్బందులు వస్తాయి.

## నోరూరించే 'మటన్ బిర్యానీ'



కావాల్సిన పదార్థాలు:బాస్మతి రైస్– ఒక కేజీమటన్– ఒక కేజీధనియాల పొడి– అర టీ స్పూన్అల్లం వెల్లుల్లి పేస్ట్ – ఒక టీ స్పూన్ గరం మసాలా పొడి– అర టీ స్పూన్వేగించిన ఉల్లి ముక్కలు– ఒక కప్పుఉప్పు– రుచికి సరిపడా పెరుగు– అర కప్పు నిమ్మరసం– కొద్దిగాకారం– రెండు టీ స్పూన్లుఆయిల్– సరిపడాబిర్యానీ ఆకులు– నాలుగు నెయ్యి– అర కప్పుజీడిపప్పు– కొద్దిగాకొత్తిమీర– కొద్దిగా

తయారీ విధానం:ముందుగా మటన్‌ను ఒక గిన్నెలోకి తీసుకుని అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్, గరం మసాలా , నిమ్మరసం, వేగించిన ఉల్లిముక్కలు కొన్ని, పెరుగు, కొత్తిమీర , ధనియాల పొడి , నూనె వేసి బాగా కలిపి రెండు నుంచి మూడు గంటల పాటు ఉంచాలి. ఆ తర్వాత పాన్ తీసుకుని అందులో నీళ్లు పోసి.. అందులో గరంమసాలా, బిర్యానీ ఆకులు వేయాలి. ఎసరు ఉడుకుపట్టగానే కడిగిపెట్టుకున్న బాస్మతి బియ్యం వేయాలి. బియ్యం సగం ఉడికాక ఎసరు వంపేయాలి. ఇప్పుడు ఫ్లాట్‌గా ఉన్న గిన్నె తీసుకుని అందులో ముందు నానబెట్టిన మటన్‌ను ఒక పొరలా వేయాలి. ఆ తర్వాత సగం ఉడికిన బియ్యాన్ని వేసి పైన నెయ్యి వేయాలి. ఇలా రెండు పొరలు వేసి మూత పెట్టి ఆవిరి బయటకు రాకుండా గిన్నెను, మూతను కలిపి మైదాతో మూసేయాలి. మండుతున్న బొగ్గులు మూతమీద వేయాలి. 20 నిమిషాల తర్వాత మూతను తీసి కొత్తిమీర, జీడిపప్పు, వేగించిన ఉల్లిపాయ ముక్కలతో డెకటేర్ చేస్తే సరిపోతుంది. అంతే మటన్ బిర్యానీ రెడీ..!

## శీతాకాలంలో పసుపును ఇలా వాడితే..

శీతాకాలంలో పసుపును ఆహారంలోతప్పక చేర్చుకోవాలి. పసుపులో కర్క్యుమిన్ అనే పదార్థం ఉంటుంది. ఇదో అద్భుత ఔషధంలా పనిచేస్తుంది. పసుపును కూరలు, కాఫీ, స్మూతీలతో కలిపి తీసుకోవడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుందంటున్నారు ఆరోగ్య నిపుణులు.

పసుపును, నల్ల మిరియాల పొడితో కలిపి తీసుకుంటే చక్కటి ఫలితాలు కనిపిస్తాయట. ఎందుకంటే పసుపుతో కలిసిన మిరియాల పొడి, అధిక వేడిని శరీరం పీల్చేసే కారకంలా పని చేస్తుంది. పసుపు కలిపిన పాలు తాగటం వలన ఆడవాళ్ళలో నెలసరి సమయంలో వచ్చే కడుపు నొప్పి, నడుము నొప్పి, చిరాకు వంటివి దరి చేరకుండా ఉంటాయి.



పసుపులో ఉండే యాంటి ఫంగల్, యాంటి వైరల్ గుణాలు రోగ నిరోదక శక్తిని పెంచుతాయి. తద్వారా మన శరీరం తోందరగా ఇన్‌ఫెక్షన్ల భారీన పడకుండా కాపాడుతాయి. డయాబెటిస్ ఉన్నవాళ్ళు పసుపు కలిపిన పాలు తాగటం వలన రక్తంలో ఉన్న చక్కెరను తగ్గిస్తుంది. దీని వలన షుగర్ అదుపులో ఉంటుందంటున్నారు ఆరోగ్య నిపుణులు.

# సినిమా



## మెగాస్టార్ చిరంజీవి ఇంట్లో అల్లు అర్జున్

### ఇక ఫుల్‌స్టాప్ పెట్టినట్టేనా!

మెగా ఫ్యామిలీ, అల్లు ఫ్యామిలీ వేరు వేరు. అల్లు అర్జున్ మెగా హీరో కాదు.. ఆయన అల్లు హీరో. ఆయనకు మెగాభిమానులు కాదు.. అల్లు ఆర్మీ ఉంది.. ఇది గత కొన్ని రోజులుగా వినిపిస్తూ వస్తున్న మాట. ఏపీలో జరిగిన ఎన్నికల సమయంలో అల్లు అర్జున్ చేసిన ఓ పని.. ఈ మాటని మరింత పటిష్టం చేసింది. అప్పటి వరకు అల్లు అర్జున్ అంటే ఇష్టపడే కొందరు మెగాభిమానులు కూడా ఆయన చేసిన పనితో ఆయనకు దూరం అయ్యారు. ఆయన ఏం చేశాడనేది పక్కన పెడితే.. చేసిన పని మాత్రం.. అల్లు అర్జున్‌పై నెగిటివ్‌కి కారణమైంది. ఇక అప్పటి నుండి మెగా ఫ్యామిలీ వర్సెస్ అల్లు ఫ్యామిలీ అనేలా ఆ ఫ్యామిలీల వ్యక్తులు, అభిమానులు మారిపోయారు. ఆ ప్రభావం 'పుష్ప 2' సినిమాపై కూడా పడింది. అయితే ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా. ముఖ్యంగా రాజకీయాలలో చెప్పినట్లుగా శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనేలా.. మెగా, అల్లు ఫ్యామిలీలలో కూడా ఇప్పుడు మార్పు వచ్చింది. మరీ ముఖ్యంగా సంధ్య థియేటర్ ఘటనలో అల్లు అర్జున్ అరెస్ట్ తర్వాత మెగా, అల్లు ఫ్యామిలీలలో అప్పటి వరకు ఉన్న కోపాలు మొత్తం దూరమయ్యాయి. ఎంత కాదన్నా.. అల్లు అర్జున్‌కి మెగాస్టార్ చిరంజీవి కూడా తండ్రిలాంటి వారే. తన చిన్నప్పటి నుండి చిరు ఎంత కేర్ తీసుకున్నారో.. వాళ్ల ఫ్యామిలీలకు తెలుసు. మరీ ముఖ్యంగా రామ్ చరణ్‌ని, అల్లు అర్జున్‌ని ఆయన ఎప్పుడూ వేరు చేసి చూడలేదు. అల్లు అర్జున్ ఎదుగుదలను చిరంజీవి తన బిడ్డ ఎదుగుదలగానే చూశారు. ఆ విషయం ఎన్నో స్టేజ్‌ల మీద స్పష్టంగా కనిపించింది కూడా. అందుకే అల్లు అర్జున్.. చిరుని బాబా అని పిలుస్తారు. పవన్ కళ్యాణ్‌ని బాబాయ్ అని పిలుస్తుంటారు. కొన్నిసార్లు.. సక్సెస్ తాలుకూ ప్రభావం అన్ని మరిచిపోయేలా చేసినా.. మళ్లీ గుర్తుకు రావడానికి చిన్న ఝలక్ చాలు. అల్లు అర్జున్ లైఫ్‌లో ఇప్పుడదే జరిగింది.

ఇక విషయంలోకి వస్తే.. మధ్యంతర బెయిల్‌తో జైలు నుండి విడుదలైన అల్లు అర్జున్‌ని చూసి, పరామర్శించేందుకు శనివారం టాలీవుడ్ ఇండస్ట్రీ మొత్తం ఆయన ఇంట్లోనే ఉంది. అయితే బన్నీ అరెస్ట్ అని తెలిసినప్పుడు వెంటనే షూటింగ్ ఆపేసుకుని వచ్చిన మెగాస్టార్, శనివారం మాత్రం ఎక్కడా కనిపించలేదు. కట్ చేస్తే.. ఆదివారం చిరంజీవి ఇంట్లోనే అల్లు అర్జున్ ప్రత్యక్షమయ్యారు. చిరంజీవి ఇంట్లో అల్లు అర్జున్ దంపతులు ఉన్న పిక్ ఒకటి ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఈ పిక్ చూసిన వారంతా.. ఇది కదా.. మెగాస్టార్ అంటే. గత కొన్ని సంవత్సరాలుగా అల్లు అర్జున్ ఏం కోల్పోయారో.. ఇప్పటికైనా తెలుసుకుంటే బాగుంటుంది. ఈ పిక్ చాలు.. ఇప్పటి వరకు వారి ఫ్యామిలీలో జరుగుతున్న అంతర్యుద్ధాలకు ఫుల్ స్టాప్ పడిందని చెప్పడానికి అంటూ ఇటు మెగా, అటు అల్లు అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఈ పిక్‌కు కామెంట్స్ చేస్తున్నారు. నిజంగా ఈ పిక్ అలాంటి సందేశమే ఇస్తే.. తెలుగు సినిమా ఇండస్ట్రీలో రాబోయే రోజుల్లో ఎన్నో గొడవలకు ముందే ఫుల్ స్టాప్ పడినట్లుగా భావించవచ్చునేది టాలీవుడ్ అభిమానుల మాట.

## విడుదల తేదీ ప్రకటించిన అనుష్క 'ఘాటి'




అగ్ర కథానాయిక అనుష్క శెట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ఘాటి ఈ సినిమాకు వేదం, కంచె చిత్రాల దర్శకుడు జాగర్లమూడి కృష్ణ (క్రిష్) దర్శకత్వం వహిస్తున్నాడు. 4 ఏండ్ల నుంచి షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం ఇటీవలే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికే అనుష్క పుట్టినరోజు సందర్భంగా ఆమెకి శుభాకాంక్షలు తెలుపుతూ ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇదిలావుంటే తాజాగా మూవీ నుంచి విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. ఈ మూవీని సమ్మర్ కానుకగా ఏప్రిల్ 18న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సందర్భంగా స్పెషల్ వీడియోను వదిలింది. ఈ సినిమాలో అనుష్క ట్రైబల్ అమ్మాయి పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. భారతదేశంలోని కొండ లోయలలో నివసించే జీవితాల ఆధారంగా ఈ సినిమా రానుంది. ఇందులో అనుష్క ఒక బాధితురాలి నుంచి క్రిమినల్‌గా, అనంతరం లెజెండ్‌గా ఎలా మారింది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే అంటూ మేకర్స్ తెలిపారు. ఇక కొండపోలం వంటి భారీ డిజాస్టర్ తర్వాత క్రిష్ దర్శకత్వంలో ఈ సినిమా వస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇక ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్ తెరకెక్కిస్తుంది. ఈ సినిమాను తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

## ఆ క్రేజీ టాలీవుడ్ డైరెక్టర్‌తో సూర్య సినిమా

సూర్య హీరోగా, చిరుత్తై శివ దర్శకత్వంలో వచ్చిన 'కంగువా' చిత్రం బాక్సాఫీస్ వద్ద బోల్తాపడింది. దీంతో సూర్య నెక్ట్స్ ప్రాజెక్ట్ పై ఫోకస్ చేయనున్నాడు. ప్రస్తుతం సూర్య చేతిలో కార్తీక్ సుబ్బరాజు ప్రాజెక్ట్ తో పాటు మరో ప్రాజెక్ట్ ఉంది. ఈ క్రమంలోనే ప్రముఖ టాలీవుడ్ టాప్ ప్రొడ్యూసర్ సూర్యని ముంబైలో కలిశారు. ఆయనతో పాటు హిట్ స్ట్రీక్ నడిపిస్తున్న క్రేజీ డైరెక్టర్ కూడా ఉన్నారు. ఈ ముగ్గురి కాంబినేషన్‌లో ఓ క్రేజీ ప్రాజెక్ట్ తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. ఇంతకీ ఆ స్టార్ ప్రొడ్యూసర్, క్రేజీ డైరెక్టర్ ఎవరంటే..

'సార్' వంటి ఘన విజయం తర్వాత వెంకీ అట్లూరి-సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'లక్కీ భాస్కర్' సినిమా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. మరోసారి మోక్షజ్ఞ సినిమా కోసం వెంకీ అట్లూరితో నాగవంశీ జతకట్టిన విషయం కూడా తెలిసిందే. అయితే ఈ కాంబినేషన్ ఇంకోసారి కొలాబరేట్ కానున్నారు. అదే సూర్య కొత్త సినిమా కోసం. తాజాగా ఈ ముగ్గురు ముంబైలో కలిశారు. వెంకీ అట్లూరి కథ వినిపించారు. నాగవంశీ ప్రొడ్యూస్ చేయడానికి సిద్ధమయ్యారు. సూర్య కూడా ఆల్మోస్ట్ ఓకే చేసినట్లు తెలుస్తోంది. 'కంగువా' విషయానికి వస్తే.. భారీ పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్‌గా దర్శకుడు శివ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రల్లో నటించారు. నవంబర్ 14న థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం ప్రస్తుతం ఓటీటీలో స్ట్రీమింగ్‌కి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ ఓటీటీలో ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతోంది.





## మీడియాకు బహిరంగ క్షమాపణలు తెలిపిన మోహన్ బాబు

టాలీవుడ్ సీనియర్ నటుడు మోహన్ బాబు మీడియాకు బహిరంగ క్షమాపణలు తెలిపాడు. మంచు ఫ్యామిలీలో జరుగుతున్న గొడవల నేపథ్యంలో సినీ నటుడు మంచు మోహన్ బాబు జర్నలిస్ట్‌పై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడి ఘటనలో జర్నలిస్ట్‌కు తీవ్రగాయాలు కాగా.. మోహన్ బాబు క్షమాపణలు చెప్పాలి అంటూ జర్నలిస్ట్ సంఘాలు అన్నీ ధర్నా చేయడం మొదలు పెట్టాయి. ఈ క్రమంలోనే యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్ట్ రంజిత్‌ను కలిసిన మోహన్ బాబు అతడికి బహిరంగ క్షమాపణలు తెలిపాడు. అనంతరం అతడి కుటుంబాన్ని పరమర్శించి.. ఆయన కుటుంబసభ్యులకు సారీ చెప్పారు. మెహన్ బాబుతో పాటు మంచు విష్ణు కూడా జర్నలిస్ట్ రంజిత్‌ను కలిసి పరమర్శించాడు. కాగా.. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి.

## బాలకృష్ణ అఖండ 2తో పాపులర్ హీరోయిన్ కూతురు ఎంట్రీ!



తెలుగు ప్రేక్షకులు ఎదురుచూస్తున్న మోస్ట్ ఎవెయిటెడ్ సినిమాల్లో టాప్‌లో ఉంటుంది అఖండ 2 బాలకృష్ణ బోయపాటి శీను క్రేజీ కాంబోలో వస్తోన్న ఈ సినిమా 2025 సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానున్నట్టు ఇప్పటికే ప్రకటించారు మేకర్స్. కాగా ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ సినిమాతో టాలీవుడ్ సీనియర్ నటి కూతురు సిల్వర్ స్క్రీన్‌పైకి ఎంట్రీ ఇవ్వబోతుందన్న న్యూస్ ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. ఇంతకీ ఆ నటి ఎవరనే కదా మీ డౌటు. అలనాటి అందాల తార లయ కూతురు శ్లోక. అఖండ 2తో శ్లోక ఎంట్రీ దాదాపు ఫైనల్ అయిపోయినట్టేనని తెలుస్తుండగా.. దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావడమే ఆలస్యమని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. ఇదే నిజమైతే మరి శ్లోక కోసం బోయపాటి ఎలాంటి పాత్రను రెడీ చేశాయనేది ఆసక్తి నెలకొంది. ఈ అప్‌డేట్ అఫీషియల్ అయితే మాత్రం శ్లోక్‌కు గ్రాండ్ డెబ్యూ అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. సీక్వెల్‌ను మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ థమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మరో స్థాయికి తీసుకెళ్లడం ఖాయమని రీసెంట్‌గా విడుదల చేసిన ప్రోమో చెప్పకనే చెబుతోంది. ఈ నేల అసురుడిది కాదురా.. ఈశ్వరుడిది అంటూ ప్రోమోలో బాలకృష్ణ చెబుతున్న డైలాగ్స్ అంచనాలు పెంచేస్తున్నాయి. బోయపాటి అఖండ 2లో బాలకృష్ణను ఎలాంటి రౌద్రరూపంలో చూపిస్తాడోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై తెరకెక్కించిన ఫస్ట్ పార్టులో ప్రగ్యాజైశ్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్ లో నటించగా.. శ్రీకాంత్, జగపతిబాబు, పూర్ణ కీలక పాత్రలు పోషించారు.

# 'మహా' మంత్రివర్గ విస్తరణ

**ముంబై:** మహారాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరిగింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ సారథ్యంలోని 'మహాయుతి' ప్రభుత్వంలో కొత్తగా 37 మంది కేబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. బీజేపీ నుంచి 19 మంది, 11 మంది షిండే శివసేన నుంచి, ఏడుగురిని ఎన్‌సీపీ నుంచి మంత్రివర్గంలోకి తీసుకున్నారు. నాగపూర్‌లోని రాజ్‌భవన్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గవర్నర్ సీపీ రాధాకృష్ణ కొత్త ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయుంచారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. డిసెంబర్ 5న ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవిస్, ఉపముఖ్యమంత్రులుగా అజిత్ పవార్, ఏక్‌నాథ్ షిండే ప్రమాణం చేశారు. అనంతరం తొలిసారి ఆదివారం మంత్రివర్గ విస్తరణ జరిగింది.

**కొత్త మంత్రులు వీరే**



బీజేపీ నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాంకులే, రాధాకృష్ణ విఖే పాటిల్, ఆశిష్ షెలార్, చంద్రకాంత్ పాటిల్, గిరీష్ మహాజన్, గణేష్ నాయక్, మంగళ్ ప్రతాప్ లోథా, జయకుమార్ రావల్, పంకజ ముండే, అతుల్ సావే మంత్రులుగా ప్రమాణస్వీకారం నుంచి. కాగా, షిండే శివసేన నుంచి దాదా భుసే, శంభురాజ్ దేశాయ్, సంజయ్ రాథోడ్, గులాబ్‌రావు పాటిల్, ఉదయ్ సామంత్ ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఉన్నారు. అజిత్ పవార్ ఎన్‌సీపీ నుంచి మాణిక్రావు కోకటే, దత్తాత్రేయ్ విఠోభా భర్నే, హసన్ ముష్రిఫ్, అదితి సునీల్ టట్కరే, ధనంజయ్ ముండే ప్రమాణస్వీకారం చేశారు.

**ఒకే దశలో ఎన్నికలు**

288 అసెంబ్లీ స్థానాలున్న మహారాష్ట్ర అసెంబ్లీకి నవంబర్ 20వ తేదీన ఒకే దశలో ఎన్నికలు జరిగాయి. నవంబర్ 23న ఫలితాలు వెలువడ్డాయి. మహాయుతి కూటమి 230 స్థానాలను కైవసం చేసుకుని మరోసారి అధికార పగ్గాలు చేపట్టింది. కేబినెట్ విస్తరణలో భాగంగా 37 మందికి చోటు కల్పించగా, మహా క్యాబినెట్‌లో గరిష్టంగా 43 మందిని తీసుకునే అవకాశం ఉంటుంది.

# జమిలి ఎన్నికల బిల్లుపై వెనక్కి తగ్గిన కేంద్రం

**న్యూఢిల్లీ :** ఒకే దేశం-ఒకే ఎన్నికకు సంబంధించిన బిల్లుపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచనలో పడినట్లు తెలుస్తున్నది. వాస్తవానికి, సోమవారం పార్లమెంట్‌లో బిల్లులు ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ క్రమంలో రాజ్యాంగం (129వ సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంత చట్టాల (సవరణ) బిల్లులను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు జాబితా చేసింది. తాజాగా సవరించిన లోక్‌సభ బిజినెస్ జాబితాలో సోమవారం నాటి ఎజెండాలో ఈ రెండు బిల్లులను తొలగించింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 20న ముగియనున్నారు. గురువారం కేబినెట్ రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు- 2024, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాలు (సవరణ బిల్లు), 2024కి ఆమోద ముద్ర వేసింది.

ఆ తర్వాత శుక్రవారం సాయంత్రం బిల్లులకు సంబంధించిన ప్రతులను సభ్యులకు పంపిణీ పూర్తయ్యింది. ఈ క్రమంలో కేంద్రం బిల్లులను ప్రవేశపెడుతుందా? లేదా? అన్నది చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి జమిలీ ఎన్నికల కోసం రాజ్యాంగంలో కొత్తగా 82ఎ అధికరణను చేర్చాల్సి రానున్నది. పార్లమెంట్ పదవీకాలంలో మార్పు కోసం 83 అధికరణ, అసెంబ్లీ పదవీకాలం సవరణ కోసం 327 అధికరణను సవరించాల్సి ఉంటుంది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ సిఫారసుల మేరకు రాజ్యాంగ (129వ సవరణ) బిల్లును కేంద్రం రూపొందించిన విషయం తెలిసిందే. ముసాయిదా బిల్లుల ప్రకారం సార్వత్రిక ఎన్నికల తర్వాత లోక్‌సభ మొదటి సమావేశానికి రాష్ట్రపతి నోటిఫై చేసిన తేదీ నుంచి ఏకకాల ఎన్నికలు అమలులోకి వస్తాయి.

రాజ్యాంగ సవరణ బిల్లు ప్రకారం.. ఈ నియమిత తేదీ తర్వాత ఎన్నికైన అన్ని రాష్ట్రాల అసెంబ్లీల పదవీ కాలాలు, లోక్‌సభ పూర్తికాల వ్యవధితో పాటు ముగిసేలా తగ్గిస్తారు. తద్వారా ఏకకాల ఎన్నికలకు మార్గం సుగమమవుతుంది. 2024 లోక్‌సభకు సంబంధించి మొదటి సమావేశం ముగిసిందున.. తదుపరి లోక్‌సభ ఎన్నికలు 2029లో జరుగుతాయి. ఆ లోక్‌సభ తొలి సమావేశంలో రాష్ట్రపతి నోటిఫై చేస్తే.. ఆ లోక్‌సభ పూర్తి పదవీ కాలం ఉంటే 2034లో తొలి విడత జమిలీ ఎన్నికలు జరుగుతాయి. బిల్లు ప్రకారం అసెంబ్లీలకు ఉన్న నిబంధనలు కేంద్ర పాలిత ప్రాంతాలైన ఢిల్లీ, జమ్మూ కశ్మీర్, పుదుచ్చేరికి వర్తిస్తాయి. కొత్త జమిలి ఎన్నికల బిల్లు ప్రకారం నిర్దేశిత కాల పరిమితి కన్నా ముందే పార్లమెంట్, రాష్ట్ర, యూటీల అసెంబ్లీలు రద్దయితే, ఆయా అసెంబ్లీలకు, పార్లమెంట్‌కు మిగిలి ఉన్న కాలానికి మాత్రమే మధ్యంతర ఎన్నికలు జరుగుతాయి.



**డిసెంబర్ 16న..**

నవంబర్ 25వ తేదీన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైనాయి. ఈ నేపథ్యంలో జమిలి ఎన్నికల బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందేందుకు మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. లోక్‌సభ ముందుకు ఈ బిల్లును సోమవారం అంటే డిసెంబర్ 16వ తేదీ తీసుకు వచ్చేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. ఆ క్రమంలో లోక్‌సభ బిజినెస్‌లో సైతం దీనిని పొందు పరిచింది.

**కేంద్ర మంత్రులు సైతం..**

ఈ బిల్లుతో పాటు మరో బిల్లును కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘవాల్ సభలో ప్రవేశపెడతారని ఇప్పటికే కేంద్రం సైతం ఓ స్పష్టమైన ప్రకటన చేసింది. అయితే లోక్‌సభలో బిజినెస్ జాబితా నుంచి ఈ రెండు బిల్లులను తొలగించింది. రివైజ్ చేసిన లోకసభ బిజినెస్‌లో జమిలి ఎన్నికలకు సంబంధించిన బిల్లులు లేవు. ఈ సమావేశాల్లోనే జమిలి బిల్లులు పార్లమెంటు ముందుకు తీసుకురానున్నట్లు పలువురు కేంద్ర మంత్రులు ఇప్పటికే ప్రకటించారు. అలాంటి వేళ.. ఈ బిల్లు ఆమోదింప చేసుకొనేందుకు మోదీ ప్రభుత్వం సందిగ్ధంలో పడడంపై సర్వత్ర సందేహాలు వ్యక్తమవుతోన్నాయి.

**ఎందుకంటే..**

సార్వత్రిక ఎన్నికలతో పాటు అన్ని రాష్ట్రాలకు ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తుంది. అందుకోసం జమిలి ఎన్నికల నిర్వహించాలని భావిస్తోంది. ఎందుకంటే.. ప్రతి ఏటా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఎక్కడో అక్కడ..ఎప్పుడో అప్పుడు ఎన్నికలు లేదా ఉప ఎన్నికలు జరుగుతునే ఉంటాయి. దీంతో ఎన్నికల కోడ్ అమల్లో ఉండడం.. అలాగే వివిధ రాష్ట్రాల్లో అధికార యంత్రాంగం అంతా ఆయా ఎన్నికల క్రతువులో పాల్గొంటున్నాయి.

**ఆ సమస్యల నుంచి..**

దాంతో పలు సమస్యలు ఉత్పన్నమవుతోన్నాయి. ఈ తరహా సమస్యల నుంచి బయట పడేందుకు జమిలి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తుంది. అందుకోసం ఈ బిల్లును ఆమోదింప చేసుకొనేందుకు ప్రయత్నం చేస్తుంది. అలాంటి వేళ.. ఇలా చివరి నిమిషంలో మోదీ ప్రభుత్వం వెనక్కి తగ్గడం పట్ల పలు సందేహాలకు తావిస్తోంది.

## కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేయడం ఇష్టం లేక..

# చేతి వేళ్లు నరుక్కున్న వ్యక్తి

అహ్మదాబాద్: బంధువుకు చెందిన సంస్థలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఆ జాబ్ పట్ల విసిగిపోయాడు. పని మానేయడంపై తన బంధువుకు చెప్పే ధైర్యం చేయలేకపోయాడు. దీంతో కంప్యూటర్ ఆపరేటర్ పనికి అనర్హుడయ్యేందుకు తన చేతి వేళ్లను నరుక్కున్నాడు. చేతబడి కోసం ఎవరో ఈ పని చేసినట్లు నమ్మించేందుకు ప్రయత్నించాడు. గుజరాత్‌లోని సూరత్‌లో ఈ సంఘటన జరిగింది. 32 ఏళ్ల మయూర్ తారాపరా తన బంధువుకు చెందిన వజ్రాల సంస్థలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆ పని పట్ల విసిగిపోయిన అతడు జాబ్ మానేయాలనుకున్నాడు. అయితే ఈ విషయాన్ని బంధువుకు చెప్పే ధైర్యం చేయలేకపోయాడు. కాగా, డిసెంబర్ 8న రాత్రి పది గంటల సమయంలో బైక్‌పై స్నేహితుడి ఇంటికి తారాపరా బయలుదేరాడు. అమ్రోలిలోని వేదాంత సర్కిల్ సమీపంలోని రింగ్‌రోడ్ వద్ద బైక్ ఆపాడు. కొనుగోలు చేసిన పదునైన కత్తితో ఎడమ చేతిలోని నాలుగు వేళ్లను నరుక్కున్నాడు. నరుక్కున్న వేళ్లను, కత్తిని ఒక సంచిలో ఉంచి దూరంగా విసిరేశాడు. రక్తం కారకుండా మోచేతి దగ్గర తాడు కట్టుకున్నాడు. ఫ్రెండ్స్‌కు ఫోన్ చేయగా అక్కడకు వచ్చి అతడ్ని హాస్పిటల్‌కు తరలించారు. మరోవైపు బైక్‌పై వెళ్తున్న తనకు కళ్లు తిరగడంతో అక్కడ అచేతనంగా పడిపోయినట్లు పోలీసులకు తారాపరా తెలిపాడు. పది నిమిషాల తర్వాత స్పృహలోకి వచ్చినప్పుడు ఎడమ చేతి నాలుగు వేళ్లు నరికివేయడాన్ని గమనించినట్లు చెప్పాడు. చేతబడి కోసం ఎవరో ఈ పనిచేసినట్లు అనుమానం వ్యక్తం చేశాడు. తారాపరా ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును క్రైమ్ బ్రాంచ్‌కు అప్పగించారు. కాగా, ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. సాంకేతిక, నిఘా ఆధారాలు సేకరించారు. దీంతో తారాపరానే తన చేతి వేళ్లను నరుక్కున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేయడం ఇష్టం లేక ఇలా చేశాడని పోలీస్ అధికారి తెలిపారు. ఒక బ్యాగ్‌లో మూడు వేళ్లు, మరో బ్యాగ్‌లో కత్తిని కనుగొని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



## ఢిల్లీ ఎన్నికల కోసం ఆప్ తుది జాబితా.. న్యూఢిల్లీ నుంచి అరవింద్ కేజ్రీవాల్ పోటీ



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం నాలుగో జాబితా విడుదల చేసింది. తుది జాబితాలో 38 మంది అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించింది. ఆప్ చీఫ్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న న్యూఢిల్లీ సీటు నుంచి అలాగే కల్కాజీ నుంచి సీఎం అతిషి పోటీ చేయనున్నారు. గ్రేటర్ కైలాష్ నుంచి మంత్రి సౌరభ్ భరద్వాజ్, బాబర్‌పూర్ నుంచి గోపాల్ రాయ్ బరిలోకి దిగుతున్నారు. శకుర్ బస్తీ నుంచి సత్యేంద్ర కుమార్ జైన్, రాజిందర్ నగర్ నుంచి దుర్గేష్ పాఠక్ పోటీ చేయనున్నారు. కాగా, తుది జాబితా ప్రకటనతో ఢిల్లీ అసెంబ్లీలోని మొత్తం 70 స్థానాలకు అభ్యర్థులను ఆప్ ఖరారు చేసింది. తమ పార్టీ పూర్తి విశ్వాసంతో, సన్నాహాలతో ఈ ఎన్నికల్లో పోటీ చేస్తుందని అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. 'బీజేపీ కనిపించదు. సీఎం ఫేస్ వ్యక్తి, బృందం, ప్రణాళిక, ఢిల్లీపై దృష్టి వారికి లేదు. వారికి ఒకే ఒక్క నినాదం ఉంది. 'కేజ్రీవాల్‌ను తొలగించండి'. ఈ ఐదేళ్లలో ఏమి చేశారో వారిని అడగండి. 'కేజ్రీవాల్‌ను మేం దుర్భాషలాడాం' అని చెబుతారు' అని విమర్శించారు. మరోవైపు ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై బెయిల్‌పై విడుదలైన అరవింద్ కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేశారు. 2025 ఫిబ్రవరిలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 'ప్రజాకోర్టు' తీర్పు తర్వాత మాత్రమే తిరిగి ఆ పదవి చేపడతానని అన్నారు. అలాగే కాంగ్రెస్‌తో ముందస్తు ఎన్నికల పొత్తుకు అవకాశం లేదని తేల్చిచెప్పారు. సొంత బలంతోనే తమ పార్టీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.

## ఈవీఎంలపై విశ్వాసం లేకుంటే...



**న్యూఢిల్లీ:** ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై కాంగ్రెస్ అభ్యంతరాలను జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తోసిపుచ్చాడు. 'ఇండియా' కూటమిలో ఒమర్ అబ్దుల్లా నేషనల్ కాన్ఫరెన్స్ భాగస్వామిగా ఉండటంతో పాటు కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌సీ–కాంగ్రెస్ కలిసి పోటీ చేశాయి. కాంగ్రెస్ పార్టీ తరచు ఈవీఎంలపై అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో పాటు బ్యాలెట్ ఎన్నికలకు డిమాండ్ చేస్తోంది. హర్యానా, అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం ఈవీఎంల వినియోగంపై మరింత దాడి చేసింది. ఈ నేపథ్యంలో ఒమర్ అబ్దుల్లా పీటీఐకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు. గెలిచినప్పుడు ఎన్నికల ఫలితాలను అంగీకరించినప్పుడు, ఓడిపోయినప్పుడు ఈవీఎంలను తప్పుపట్టరాదని అన్నారు. ''ఇదే ఈవీఎంలతో వందకు పైగా ఎంపీలను గెలిచినప్పుడు పార్టీ విజయాన్ని సెలబ్రేట్ చేసుకున్నారు. ఆ తర్వాత కొద్దినెలలకే ఎన్నికలు ఫలితాలు మీ అంచనాలకు అనుగుణంగా రానప్పుడు ఈవీఎంలు మీకు నచ్చకుండా పోతున్నాయి'' అని ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. ఓటింగ్ మిషన్లను విశ్వసించనప్పుడు ఎన్నికల్లో పోటీకి పార్టీలు దూరంగా ఉండాలన్నారు. బీజేపీ ప్రతినిధి తరహాలో మీ మాటలు ఉన్నాయని మీడియా అడిగినప్పుడు "అలాంటిదేమీ లేదు.. ఒప్పు ఎప్పుడూ ఒప్పే" అని ఆయన సమాధానమిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో తాను ఓడినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ఉదహరించారు. సిద్ధాంతాల పరంగానే కానీ పక్షపాతంతో తాను మాట్లాడటం లేదని, సెంట్రల్ విస్టా వంటి మౌలిక వసతుల ప్రాజెక్టుకు తాను సపోర్ట్ చేశానని విషయాన్ని గుర్తు చేసారు. ఢిల్లీలో సెంట్రల్ విస్టా ప్రాజెక్టు మంచిదేని, అలాగే కొత్త పార్లమెంటు భవనం నిర్మాణం చాలా మంచి ఆలోచన అని తాను నమ్ముతానని అన్నారు. పాత పార్లమెంటు భవనం మనుగడ కాలం తగ్గినందున కొత్త పార్లమెంటు భవనం అవసరం ఉందని చెప్పారు. జమ్మూ కశ్మీర్‌లో గత నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఫలితాలపై ఒమర్ అబ్దుల్లా అసంతృప్తితో ఉన్నారంటూ వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో ఒమర్ అబ్దుల్లా తాజా వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రచారంపై కాంగ్రెస్ పెద్దగా దృష్టి పెట్టకుండా తమపైనే ఎక్కువగా కాంగ్రెస్ ఆధారపడిందని పలువురు ఎన్‌సీ నేతలు సైతం వ్యాఖ్యానించారు. 90 మంది సభ్యుల జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో ఎన్‌సీ 42 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 6 సీట్లు దక్కించుకుంది

## భార్యతో కలిసి ఆప్‌లో చేరిన.. బీజేపీ నేత రమేష్ పెహల్వాన్



**న్యూఢిల్లీ:** బీజేపీ నేత రమేష్ పెహల్వాన్ తన భార్య కుసుమలతతో కలిసి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లో ఆదివారం చేరారు. ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకుని సభ్యత్వం తీసుకున్నారు. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నేతలు ఆప్‌లో చేరారు. 2025 ఫిబ్రవరిలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కొందరు పోటీలో ఉన్నారు. కాగా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం నాలుగో జాబితాను ఆప్ ఆదివారం విడుదల చేసింది. తుది జాబితాలో 38 మంది అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించింది. ఆప్ చీఫ్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న న్యూఢిల్లీ సీటు నుంచి అలాగే కల్కాజీ నుంచి సీఎం అతిషి పోటీ చేయనున్నారు. తుది జాబితా ప్రకటనతో ఢిల్లీ అసెంబ్లీలోని మొత్తం 70 స్థానాలకు అభ్యర్థులను ఆప్ ఖరారు చేసింది. మరోవైపు ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై బెయిల్‌పై విడుదలైన అరవింద్ కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేశారు. 2025 ఫిబ్రవరిలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 'ప్రజాకోర్టు' తీర్పు తర్వాత మాత్రమే తిరిగి ఆ పదవి చేపడతానని అన్నారు. అలాగే కాంగ్రెస్‌తో ముందస్తు ఎన్నికల పొత్తుకు అవకాశం లేదని తేల్చిచెప్పారు. సొంత బలంతోనే తమ పార్టీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : **SIRIKONDA AUGUSTIN . RNI No.: APTEL/2013/52694.** E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.